ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-5-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 106 పేజీలు: 12 వెల: 8.00

తుర్కియే యాపిల్స్ బ్యాన్ చేయండి 9లో

ముంబయి ఎయిర్‌పోర్టులో ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టు

# ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

## స్వాతంత్ర్య దినోత్సవ కానుక ప్రకటించిన సీఎం చంద్రబాబు

ఆగస్టు నాటికి చెత్తలేని పరిశుభ్ర రాష్ట్రంగా ఏపి

హరిత ఇంధన కేంద్రంగా సీమను తయారు చేస్తాం

కర్నూలు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి


శనివారం కర్నూలులో జరిగిన సభకు హాజరైన ప్రజానీకం

**కర్నూలు, మే 17, ప్రభాతవార్త :** స్వచ్ఛాంధ్ర లక్ష్యయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పర్యావరణ పరిరక్షణకు కలిసికట్టుగా కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. తెలుగుదేశం హయాంలో రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని కూకటివేళ్లతో పెకలించివేశామని, భవిష్యత్తులోనూ సీమ గడ్డపై ఫ్యాక్షన్ మాట వినబడనివ్వమని స్పష్టం చేశారు. సీమకు పరిశ్రమలు తెచ్చి పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, హరిత ఇంధన కేంద్రంగా సీమను తయారుచేస్తామని అన్నారు. ఆగస్టు 15 నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. కర్నూలు నగరంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పెట్టాను. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం. మన ఇల్లు, పరిసరాలు శుభ్రం చేసుకోవాలి. పల్లెలు, పట్టణాలు, చెరువులు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, ఆస్పత్రులు, విద్యాలయాల్లో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహించాలి. దుమ్ము దులిపి స్వచ్ఛమైన


శనివారం కర్నూలు సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

ఆలోచనలు చేయాలి. ఆధునిక ప్రపంచంలో చాలామంది అనారోగ్యం పాలవుతున్నారు. ప్రతిరోజూ అందరూ యోగా చేయాలి. వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ విశాఖ వస్తున్నారు. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకూ యోగా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తాం. నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నాం. గత ప్రభుత్వం పట్టణాల్లోనే 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలేసిపోయింది. అక్టోబర్ 2నాటికి రాష్ట్రంలో చెత్తలేకుండా చేస్తాం. చెత్త నుంచి ఎనర్జీ తీసే ప్రాజెక్టులు ప్రస్తుతం రెండు పనిచేస్తున్నాయి. భవిష్యత్‌లో రాజమండ్రి, విజయవాడ, >>2

## కొన్ని ప్రాంతాలకు భారీ వర్ష సూచన

పిడుగులు పడే అవకాశం

**విజయవాడ,మే 17,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో శనివారం పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సగటు పగటి ఉష్ణోగ్రతలు 38డిగ్రీలు పలు జిల్లా నమోదయితే, ఇందుకు భిన్నంగా పలు చోట్ల మోస్తరు వర్షాలు కురిసాయి. రాష్ట్రంలో మరో 48గంటలుఅక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మోస్తరు వర్షాలు కురిసాయి విజయనగరం, మన్యం, ఏలూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. పిడుగులు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున హోర్డింగ్స్, చెట్లక్రింద, శిథిలావస్థలో నున్న గోడలు, భవనాల వద్ద నిలబడవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈదురు గాలులతో కూడిన భారీ >>2


పిఎస్‌ఎల్‌వి-సి61 రాకెట్

## రక్షణ ఉపగ్రహం నేడే నింగిలోకి

ఉదయం 5.59 గం.కే ముహూర్తం

షార్‌లో పర్యటిస్తున్న కేంద్రపార్లమెంటరీ బృందం సభ్యులు

**శ్రీహరికోట (తడ), మే 17 ప్రభాతవార్త:** శ్రీహరికోట నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు రక్షణ ఉపగ్రహాన్ని పిఎస్ఎల్వి-సి61 రాకెట్ నింగికి మోసుకెళ్లనుంది. ఇందుకు సంబంధించి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ వి.నారాయణన్‌తో పాటు సీనియర్ శాస్త్రవేత్తలు, షార్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. రెండు, నాలుగవ దశలలో ఘన ఇంధనం నింపడం కాకుండా రాకెట్‌లోని అన్ని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పనితీరును కౌంట్‌డౌన్‌లో ఎప్పటికప్పుడు తెలుసుకుంటు న్నారు. శ్రీహరికోట మొదటి ప్రయో గ వేదిక నుంచి ఈ రాకెట్ నింగికి >>2


శనివారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీని కలిసి మామిడి పండ్లను బహూకరిస్తున్న మంత్రి లోకేష్ దంపతులు

## ప్రధాని మోడీతో లోకేష్ భేటీ

'యువగళం' కాఫీటేబుల్ బుక్ ఆవిష్కరణ

దేవాన్ష్‌తో ఆప్యాయంగా మాట్లాడిన పిఎం

**న్యూఢిల్లీ, మే 17:** ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీశాఖల మంత్రి నారా లోకేష్ , భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శనివారం న్యూఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధాన మంత్రి ఖియువగళంఖి కాఫీ టేబుల్ బుక్‌ని ఆవిష్కరించి, మొదటి ప్రతిని అందుకున్నారు. ప్రధానితో జరిగిన ఈ సమావేశం లోకేష్ కుటుంబానికి ముఖ్యమైన, మరపురాని భేటీగా కలకాలం నిలిచిపోతుంది. 2024 ఎన్నికలకు ముందు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన చారిత్రాత్మకమైన >>2

# మహిళలకు 'వర్క్ ఫ్రం హోం'

ఆసక్తి కలిగిన వారిని ప్రోత్సహిస్తామన్న సిఎం చంద్రబాబు

స్టెమ్ కోర్సుల పట్ల మహిళల్లో ఉత్సాహం

ప్రతి నియోజకవర్గంలో స్పెషాలిటీ హాస్పిటల్

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మహిళలకు వర్క్ ఫ్రమ్ హోం విధానాన్ని ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒక కుటుంబానికి ఆదాయ వనరులను సృష్టించే దిశలో మహిళల పడే శ్రమ ప్రశంసనీయమన్నారు. వర్క్ ఫ్రమ్ హోం పట్ల ఆసక్తి ఉన్న వారిని ప్రభుత్వం గుర్తించి ప్రోత్స హిస్తోందన్నారు, "ఎక్స్' వేదికగా వర్క్ ఫ్రం హోంతో సహా పలు అంశాలను సీఎం చంద్రబాబు వివరించారు. సీఎం, సైన్స్ రంగంలో విజయాలు సాధిస్తున్న మహిళలకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో స్టెమ్ కోర్సుల పట్ల ఆసక్తి చూపించే మహిళలను ప్రోత్సాహిస్తామన్నామని స్పష్టం చేశారు. స్టెమ్ కోర్సులు చేస్తున్న మహిళలకు శుభాకాంక్షలు సీఎం తెలిపారు. కొవిడ్ అనంతర పరిణామాలు, అందుబాటులో ఉన్న సాంకేతికత వర్క్ ఫ్రమ్ హోమ్‌ఖి ప్రాముఖ్యతను పెంచాయని గుర్తు చేశారు.

రిమోట్ వర్క్, కోవర్కింగ్ స్పేస్, నైబర్ హుడ్ వర్క్ స్పేస్ వంటి కాన్సెప్ట్‌లు అనువైన ఉత్పాదక వాతావరణాన్ని సృష్టిస్తాయని అన్నారు. ఇవి వ్యాపారులు, ఉద్యోగులకు సమర్థవంతమైన ఫలితాలు అందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాలు మెరుగైన పని, జీవిత సమతుల్యతను సాధించడంలో సహాయపడతాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ, జీసీసీ పాలసీ 4.0 ఆ దిశగా గేమ్ ఛేంజర్ కానుందని చంద్రబాబు వెల్లడించారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పబ్లిక్ పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్(పీ4) కార్యక్రమాన్ని ప్రారంభించింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిని గుర్తించి వారి అభ్యున్నతికి దాతల ద్వారా సహాయ సహకారాలు అందించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఎంపిక చేసిన కుటుంబాల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం, ఉద్యోగ, ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పించడం, నివాస ప్రాంతాల్లో, ఇంటి ఆవరణలో జీవనానికి వీలుగా మౌలిక వసతులు కల్పించడం, ఆదాయ పరంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చే మార్గదర్శకులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చే దిశగా ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి నగరం, పట్టణం, మండలంలో ఐటీ కార్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అందుకు తగ్గ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు. ప్రతీ నియో జకవర్గంలో 300 పడకలతో స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేస్తున్నామని "ఎక్స్"లోనే సీఎం చంద్రబాబు వివరించారు. ఇంకా పేదలకు మెరుగైన పాలన అందించేందుకు ఉగాది నుంచి పీ4 మోడల్ విధానాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. మరో మూడు నెలల్లో అయిదులక్షల మందిని పీ-4 పరిధిలోకి తీసుకుని వస్తామన్నారు. వైద్య ఖర్చుల్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ ఆసుపత్రులు పరీక్షల పేరిట ప్రజలను దోచుకుంటే సహించేది లేదు. త్వరలో ఆయుష్మాన్‌భవలో భాగస్వాములవుతాం. నేచురల్ ఫుడ్‌లో రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తున్నామన్నారు. అందుకు వీలుగా అనేక కార్యక్రమాలు కార్యచరణలో ఎక్స్"లోనే సీఎం చంద్రబాబు పెట్టామన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే గ్రీన్ ఎనర్జీలో 1/3 ఏపీలో చేయబోతున్నాం. ప్రతిఒక్కరూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ వాడే రోజు రావాలి. కాలుష్యం, పారిశుద్ధం మెరుగు పడితే రోగాలు దూరమవుతాయి. >>2



## మార్కెట్లో నాసి విత్తనాల హల్‌చల్

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** వానలు పలకరించడంతో వాణిజ్య పంటల రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. దీంతో నాసిరకం పత్తి విత్తన విక్రయదారులు తమ మోసాలకు తెరదీసారు. కీలకంగా పత్తి నాసిరకం, జిన్నింగ్ విత్తనాలు మార్కెట్లోకి జోరుగా విక్రయింప చేస్తున్నారు. పత్తిసాగు అధికంగా ఉండే తెల్లబంగారపు గనులు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈ విత్తనాలు ఎక్కువ సర్కులేషన్‌లో ఉన్నాయి. ఈ నాసిరకం ప్యాకింగ్ కేంద్రాలు గుంటూరు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లా, తెలంగాణ రాష్ట్రం జిల్లా ఖమ్మం, నల్గొండ జిల్లాల సరిహద్దుల్లో కేంద్రీకరించి సాగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ, కంచికచర్ల, మైలవరంల నుంచి నాసిరకం జిన్నింగ్ విత్తనాలు గుట్టు చప్పుడు కాకుండా ఇతర కేంద్రాలకు పంపిస్తున్నట్లు సమాచారం గత సంవత్సరం బాగా పంట దిగుబడి వచ్చిందంటూ ఆ విత్తనాలను పలు మండలాల్లో విక్రయిస్తున్నారు. 450 గ్రాముల ప్యాకెట్ ధర రూ.901గా ఉంది. కానీ ఒక >>2

# 'సేఫ్‌జోన్'గా తిరుమల ఘాట్ రోడ్డు!

## రెండో ఘాట్‌లో అధునాతన సిసికెమెరాలు

మరింత పటిష్ఠంగా నిఘా వ్యవస్థ



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** భారత్-పాక్ దేశాల మధ్య తలెత్తిన యుద్ధ పరిణామాల నేపథ్యంలో ప్రపంచప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలను మరింత పూర్తిస్థాయిలో "సేఫ్ జోన్"గా ఉంచడానికి కేంద్రనిఘా వర్గాలు రాష్ట్రపోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఇందుకోసం తిరుపతి జిల్లా పోలీసువిభాగానికి ,టిటిడి నిఘాభద్రత విభాగం అవసరమైన భద్రత, నిఘా పరికరాలు సమకూర్చుకునే దిశగా ఆదేశాలు జారీచేసింది. తిరుమలకు ఉన్న రెండు ప్రధాన ఘాట్‌రోడ్లతోబాటు మూడు కాలినడక మార్గాలు, శేషాచలం అడవిలో 14 ప్రవేశద్వారాలు ఉండటం, ఇక్కడ భద్రతను మరింత పటిష్టం చేసేదిశగా కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే తిరుమల ఆలయ భద్రతతోబాటు నిత్యంవస్తున్న లక్షమంది వరకు భక్తులకు పూర్తిస్థాయి రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని మార్గాల్లో అధునాతన టెక్నాలజీ సాయంతో భద్రతను పటిష్టం చేయాలనే లక్ష్యంగా చకచకా పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా తిరుమల ఆలయం భద్రతపై పూర్తిస్థాయిలో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా దళాలకు సదుపాయాలు, టెక్నాలజీతో కూడిన ఆయుధాలు, శిక్షణ అంశాలు సమకూర్చుకునేందుకు ప్రణాళికలు సిద్దం చేశారు. ప్రధానంగా దేశం నలుమూలల నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వాహనాల్లో వచ్చే యాత్రికులు తిరుపతి అలిపిరి మార్గంలో సప్తగిరి తనిఖీకేంద్రం మీదుగా రెండోఘాట్‌లో తిరుమలకు చేరుకుంటారు. ఇక్కడ మూడంచెల తనిఖీలు కోసం 24గంటలూ టిటిడి విజిలెన్స్, ఎస్‌పిఎఫ్, హోంగార్డులు, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు విధుల్లో ఉంటారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత తిరుమలకు అనుమతిస్తారు. అయితే ఇక్కడ వస్తున్న భక్తులు ఎవరు, ఎక్కడ నుండి వచ్చారు, వారెవరు, తీవ్రవాదులా, నేరస్థులా, దొంగలు అనేది కనిపెట్టేవ్యవస్థ లేకపోయింది. అంతేగాక ఘాట్‌లో తిరుమలకు చేరుకునే సమయంలో వాహనాల వేగం, యాత్రికుల కదలికలపై మరింత నిఘా ఉంచేందుకు వీలుగా తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి సివిఎస్‌ఒ వి.హర్షవర్ధన్‌రాజు పర్యవేక్షణలో అధునాతన సిసి కెమెరాలు, సోలార్ సిసికెమెరాలు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే అలిపిరి తనిఖీ కేంద్రందాటిన తరువాత వినాయకుడి గుడి సమీపంలోంచి ఘాట్‌లో హరిణివిశ్రాంతి కేంద్రం, లింకురోడ్డు వరకు సోలార్ సిసికెమెరాలు అమర్చారు. వీటికి విద్యుత్‌తో అవసరం లేకుండా పూర్తిగా సౌరశక్తితో పనిచేసేలా సాంకేతికత ఉంది. వీటిని తిరుపతిలోని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి, జిల్లా ఎస్పీ చరవాణికి(మొబైల్‌ఫోన్)కు అనుసంధానం చేశారు. ఈ సోలార్ సిసికెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు ఎస్పీనే స్వయంగా పరిశీలించే అవకాశం ఉంది.

తిరుపతి నుండి తిరుమలకు వచ్చేరెండోఘాట్‌లో ఇప్పటికే నాలుగు ప్రధాన చోట్ల సోలార్‌తో పనిచేసే సిసికెమెరాలు ఐదుచోట్ల ఏర్పాటుచేశారు. ఘాట్‌లో 18కిలోమీటర్లు దూరం. ఈ మధ్యలో ఎన్నో మలుపులు ఉన్నాయి. ఇక్కడ వాహనాలు అదుపుతప్పినా, చిరుతపులులు సంచరించినా వెంటనే గుర్తించి భద్రత సిబ్బందిని అప్రమత్తం చేసే వీలుంటుంది. ఘాట్‌లో భద్రతను మరింత పటిష్ఠంచేసేందుకు రెండు రోజుల క్రిందట అనంతపురం డిఐజి >>2



## హైదరాబాద్-విశాఖ ఇక 8 గంటలే!

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌హైవే ప్రారంభానికి సిద్ధం

విజయవాడకు రాకుండా నేరుగా విశాఖకే

తగ్గనున్న 125 కి.మీ దూరం

**విజయవాడ.మే17,ప్రభాతవార్తప్రతినిధి:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాల నడుమ దూరాభారం తగ్గనుంది. ఇప్పటి వరకు ఆంధ్రనుంచి కీలక నగరాలకు వెళ్ళాంటే విజయవాడ నగరం నడిబొడ్డు నుంచి వెళ్ళాల్సి వచ్చేది. ఇక ముందు ఆ అవసరం లేకుండా నగర శివారులు. ఇంకా ఎగువ నుంచి వాహనాలు వెళ్ళే విధంగా జాతీయరహదారులు, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జరుగుతున్నాయి. ఆంధ్ర-తెలంగాణలను కలుపుతూ కేంద్రం నిర్మిస్తోన్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే 365 బిజి ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే నిర్మాణం పూర్తవ్వాల్సి ఉన్నా భూ సేకరణలో జాప్యం, అధిక వర్షాలతో నిర్మాణం పూర్తి కాలేదు. ఖమ్మం దేవరపల్లి మధ్య 162 కిలోమీటర్ల మేర నిర్మితతస్తోన్న ఈ రహదారి మిగతా వాటికంటే పూర్తి భిన్నమైనది. పచ్చని పొలాల మధ్యలోంచి, ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రయాణం సాగించవచ్చు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ విశాఖ మధ్య విజయవాడ వెళ్లకుండానే వేగంగా వెళ్ళిపోవచ్చు హైదరాబాద్ నుంచి విశాఖ మధ్య 125 కిలోమీటర్ల దూరం తగ్గించడానికి మూడేళ్ల క్రితం ఖమ్మం నుంచి ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి వరకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ జాతీయ రహదారి నిర్మాణం చేపట్టారు. దేవరపల్లితల్లాడ జాతీయ రహదారి డైమండ్ జంక్షన్ కు రెండు కిలోమీటర్ల దూరంలో గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభమవుతుంది. 162 కిలోమీటర్ల దూరం ఉన్న నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే365 ను పచ్చని పొలాల మధ్య ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 4,609 కోట్ల రూపాయలతో నిర్మించే ఈ రోడ్డుకు >>2




## నీట్ ఫలితాలపై మద్రాస్ హైకోర్టు స్టే

**చెన్నై, మే 17:** నీట్ ఫలితాల విడుదలకు సంబంధించి మద్రాస్ హైకోర్టుకీలక నిర్ణయం తీసుకుంది. ఫలితాలను విడుదల చేయొద్దని హైకోర్టు ఆదేశాలు జారీచేస్తూ తదుపరి విచారణ జూన్ 2వ తేదీకి వాయిదావేసింది. కాగా ఇప్పటికే నీట్ ఫలితాలపై మధ్యప్రదేశ్ హైకోర్టుకూడా స్టేవిదించింది. తమ ఎగ్జామ్ కేంద్రంలో విద్యుత్ అంతరాయం కారణంగా పరీక్ష సరిగ్గారాయలేకపోయామని కొంతమంది విద్యార్థులు పిటిషన్ దాఖలుచేసారు. పరీక్ష కేంద్రంలో విద్యుత్ అంతరాయం >>2




## 'సీజ్‌ఫైర్' నేటితో పూర్తి

కొద్ది రోజుల్లో మళ్లీ చర్చలు: పాక్ డిప్యూటీ ప్రధాని

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** భారత్ పాకిస్తాన్‌లమధ్య కాల్పుల విరమణ ప్రతిపాదనలు ఆదివారంతో ముగుస్తున్నాయి. మరోసారి డిజిఎంలు సమావేశం అయి సరిహద్దుల వెంబడి నెలకొన్న పరిస్థితులను సమీక్షిస్తారని అంచనా. వాస్తవాధీన రేఖవెంబడి ఉద్రిక్తతలు తగ్గించి, కాల్పులు నిలిపివేసి శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు భారత్ పాకిస్తాన్‌లు రెండూ కూడా >>2

18-5pg2exHMNWJQE.qxd:18-5pg2exHMNWJQE.qxd 01/01/01 8:05 AM Page 1





ఇఒఎస్09 ఉపగ్రహం సోలార్ ప్యానెల్లు

# రక్షణ ఉపగ్రహం నేడే నింగిలోకి

>> నిర్దేశిత వేయనుందగా, రక్షణ ఉపగ్రహం ఇఒఎస్09 దీని ద్వారా ప్రయోగిస్తున్నారు. ప్రయోగ సమయంలో రాకెట్ బరువు 321 టన్నులు కాగా, ఉపగ్రహం బరువు 1696.24 కిలోల బరువుగా ఉంది. అంతరిక్షంలోని 534 కిలోమీటర్ల దూరంలో 18 నిమిషాలలోపే ఇఒఎస్9ను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టేలా ఈ ప్రయోగం జరుపుతున్నారు. ఇఒఎస్09 భారత రక్షణ దళానికి ఎంతో ఉపయోగపడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు ఇప్పటికే పేర్కొన్నారు. ఈ కీలక ఉపగ్రహ ప్రయోగ వేళ పార్లమెంటరీ కమిటీ బృందం షార్‌లో పర్యటన చేస్తోంది. శనివారం కూడా సుమారు 18 మందితో కూడిన ఎంపీలు, ఇతర ముఖ్య అధికారులు శ్రీహరికోటలోని వివిధ అంతరిక్ష కేంద్రాలను పరిశీలించారు. రాకెట్ అనుసంధాన భవనాలు, ప్రయోగ వేదికలు, మిషన్ కంట్రోల్ సెంటర్ తదితర ప్రాంతాల పర్యటన అనంతరం స్థానిక నక్షత్ర హోటల్‌లో ఇస్రో పెద్దలతో కీలక సమావేశాలు జరిపారు. ఈ పర్యటన కేవలం రాకెట్ ప్రయోగ వీక్షణ కోసమే కాకుండా శ్రీహరికోట అభివృద్ధికి సంబంధించి విస్తృతమైన చర్చలు జరిపినట్లు తెలిసింది. భవిష్యత్‌లో నిర్మాణం జరుపుకోనున్న మూడవ ప్రయోగ వేదిక లాంటివి ఇందులో ఉన్నాయి. శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగాలు కొత్త కోణాలు ఇప్పటికే వంద పూర్తి చేసుకుని, ప్రస్తుతం 101 ప్రయోగం జరుగుతున్నప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. కేంద్ర పారిశ్రామిక భద్రత దళాలు, తిరుపతి జిల్లా పోలీసులు, ఇంటలిజెన్స్, నావికా దళ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# ‘సీజ్‌ఫైర్’ నేటితో పూర్తి

>> తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకారం తెలిపాయి. ఇందులోభాగంగానే సరిహద్దులవెంబడి పాక్ కాల్పులు, రెచ్చగొట్టే కాల్పులు కూడాజరగలేదు. అయితే ఈ కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారంతోముగుస్తున్నది. స్వయంగా పాకిస్థాన్ ఉపప్రధాని ఇషాక్‌దార్ ఆదేశ ఎగువసభలోనే ప్రకటించారు. డెడ్‌లైన్‌ను మరింత పొడిగించే అవకాశం ఉందని, దశలవారీగా చర్చలు కూడా జరుపుతామన్నారు. డైరెక్టర్‌జనరల్స్ మిలిటరీ ఆపరేషన్స్ చర్చల్లో ముందు కాల్పులు విరమణకు అంగీకారం కుదిరిందని, 12వ తేదీవరకూ ఉన్న గడువును 14వ తేదీవరకూ పొడిగించారు. ఆతర్వాత 18వ తేదీవరకూ పొడిగించినట్లు చెప్పారు. భారత్ ఈ వివాదంపై చర్చలకు అంగీకరించవచ్చని ఇషాక్‌దార్ అన్నారు. పిపిపి చీఫ్ బిలావల్ భుట్టో తీవ్రస్థాయి వ్యాఖ్యలతో కొంతమేర చర్చలకు విఘాతం జరిగినా డిజిఎంఒల స్థాయిలో చర్చలుజరిగాయి. పాక్ ఆక్రమిత కాశ్మీర్; సరిహద్దుల్లో చొరబాట్లు, కాల్పులు, ఉగ్రవాద నిర్మూలన మినహా మరేమీ ఇతరచర్చలుండబోవని ఇప్పటికే భారత్ స్పష్టంచేసింది. ఈ క్రమంలో మరోసారి డిజిఎంఒల చర్చలకు స్పష్టమైన తేదీ ఇంకా ఖరారుకాలేదు.



# భారీ అగ్నిప్రమాదం:త్రుటిలో తప్పిన ప్రాణనష్టం

**కోవూరు (నెల్లూరు), మే 17, ప్రభాతవార్త :** అందరూ గాఢనిద్రలో ఉన్నారు.. ఉన్నట్టుండి. ఆ ప్రాంతంలో పొగలతో కూడిన మంట రావడం జరిగింది. హుటాహుటిన ఆ ప్రాంత వాసులు లేచేసరికే మంటలు గుప్పెత్తున ఎగసాయి. ఈ సంఘటన కోవూరు పంచాయతీ పరిధిలోని పెళ్లకూరు కాలనీ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది ఈ ప్రాంతంలో సుభహాన్ అనే వ్యాపారి చిత్తు కాగితాలు పేపర్లు రబ్బర్ టైర్లు ఖాళీ సిలిండర్లు ఫ్రిజ్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేస్తూ స్టాక్ పెట్టి ఉన్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా ఆ ప్రాంతంలో పొగలతో కూడిన మంటలురావడం జరిగింది. ఈమెకు సమాచారం అందుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సుభాష్ సేవా సంఘం అధ్యక్షులు దేవి రెడ్డి సురేష్ రెడ్డి మండల పార్టీ సీనియర్ నాయకులు ఇంత మల్లారెడ్డి సాయిరెడ్డి తదితరులు ఆ ప్రాంతానికి చేరుకుని ఫైర్ ఇంజన్ రావడంతో సహాయ చర్యలు చేపట్టారు మంటలు చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు వ్యాపించకుండా ఫైర్ ఆఫీసర్ వేణుగోపాల్ బృందం ఆధ్వర్యంలో ఫైర్ ఇంజన్ ద్వారా రాత్రి మూడు గంటల వరకు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు మొత్తం మీద ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాన్స్కో సిబ్బంది అధికారులు సంఘటన స్థలానికి వచ్చి విద్యుత్ సరఫరా నిలిపియడంలో కీలక పాత్ర పోషించారు దాదాపు మూడు గంటల వరకు మంటలు తీవ్రంగా వ్యాపించడంతో చుట్టుపక్కల గృహాల వాళ్ళు భయాందోళనలకు గురయ్యారు.

# కొన్ని ప్రాంతాలకు భారీ వర్ష సూచన

>> వర్షం అనంతపురం జిల్లా ఉరవకొండ,విడపనకల్లు,వజ్రకరూరు మండల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం దాటికి వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.బూఏదగవి వంక ఏరు పారుతోంది.పెంచలపాడు-పొలికి గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.దీంతో రాత్రి నుండి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీనివలన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమిద్యాల గ్రామంలో పిడుగుపాటుకు నరసింహులు అనే రైతుకు చెందిన రెండు ఎద్దులు మృతిచెందాయి. లక్షన్నర నష్టం వాటిల్లిందని రైతు నరసింహులు వాపోయాడు. చాయపురం వద్ద హంద్రీనీవా కాలువ వర్షపు నీటితో నిండిపోయింది.అల్లూరి జిల్లాలో మోస్తరు నుండి భారీ వర్షాలకు అవకాశం ఉంది. పిడుగులు,ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. విజయనగరం,మన్యం,ఏలూరు,కర్నూలు,నంద్యాల జిల్లాలకు కూడ హెచ్చరికలు జారీ చేశారుతూర్పు గోదావరి, ప్రకాశం,వైఎస్సార్,తిరుపతి,అన్నమయ్య జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. మన్యం-5,అల్లూరి-2,విజయనగరం-2,తూర్పు గోదావరి-1 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని చెప్పింది. పలు ప్రాంతాల్లో పిడుగులు,గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. చెటల క్రింద,శిథిల గోడలు,భవనాల వద్ద ఉండొద్దని అధికారులు సూచించారు. ఏపీలో మిగితా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# రక్షణరంగ కొనుగోళ్లకు రూ.40 వేలకోట్లు ఆమోదం

## రక్షణశాఖ కొనుగోళ్ల కమిటీ గ్రీన్‌సిగ్నల్

**న్యూఢిల్లీ, మే 17:** భారత్‌పాక్ ఉద్రిక్తతల వేళ రక్షణ దళాలకు మరింత బలాన్ని ఇచ్చేలా భారీ ప్రోత్సాన్ని అందించనున్నారు. పరిశోధన, ఆయుధాలు, మందుగుండు, యుద్ధ సామాగ్రిని కొనుగోలు కోసం రూ.40 వేల కోట్లకు రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. అత్యవసర అధికారాల కింద ఈ కొనుగోళ్లకు ఇటీవల రక్షణ మంత్రిత్వ శాఖ, సైనిక ఉన్నతాధికారుల సమావేశంలో ఆమోదం తెలిపినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.అత్యవసర అధికారాల కింద, రక్షణ దళాలు నిఘా డ్రోన్లు, కమికజ్ డ్రోన్లు, లాంగ్ రేంజ్ లూటరింగ్ క్షిపణులు, రాకెట్లు వంటి సామగ్రిని కొనుగోలు చేయడంపై రక్షణ శాఖ దృష్టి సారిస్తుంది. అత్యవసర అధికారాల కింద ఒప్పందాలు కుదుర్చుకుంటున్న పరికరాలను నిర్ణీత వ్యవధిలోపు బలగాలను అందిచాలని నిర్ణయించారు. గత ఐదు సంవత్సరాల్లో ఇలా కొనుగోలు కోసం కేటాయించడం ఇది ఐదోసారి. రక్షణ ఆర్థిక విభాగం, ఆర్థిక సలహాదారులతో కలిసి ఈ కొనుగోళ్లను చేస్తాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. పాక్‌స్థావరాలపై దాడి చేయడానికి ఉపయోగించిన రాంపేజ్ మిసైల్ కూడా కూడా అత్యవసర కొనుగోలు అధికారాల కింద రక్షణ దళాలు కొనుగోలు చేశాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రత్యక్ష కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఉపయోగించిన హెరాన్ మార్క్2 డ్రోన్‌లను కూడా భారత్ ఇలానే కొనుగోలు చేసింది.

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రక్షణ రంగానికి రూ.50వేల కోట్ల మేర బడ్జెట్‌లో అదనపు కేటాయింపులు చేపట్టవచ్చని సంబందిత వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం ఆ దిశగా సన్నాహాలు చేస్తుందని తెలిపాయి. ఈ ఏడాది రక్షణశాఖ కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. తాజాగా పెంపునకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం విధిగా లభిస్తుంది. దీంతో డిఫెన్స్‌కు కేటాయించిన నిధులు రూ. 7లక్షల కోట్లు దాటేస్తాయి.

# మహిళలకు ఉచిత బస్సు

>> నెల్లూరు, కడపలో అందుబాటులోకి వస్తాయి. వీటి వల్ల 90 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉండే చెత్త ఎనర్జీగా తయారవుతుంది. పల్లె పుష్కరిణి అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చెరువులు శుభ్రం చేయబోతున్నాం. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్స్ వేస్తాము. 123 మున్సిపాలిటీ మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్లు పెట్టాం. అనంతపురం, సత్యసాయి జిల్లాలు ఓడీఎఫ్ ప్లస్ గా నిలిచాయి. 15, 995 గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ గా చేయాలని నిర్ణయించాం. 2026 మార్చి నాటికి వందశాతం ఓడీఎఫ్ ప్లస్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మరికొన్ని రైతు బజార్ల ఏర్పాటు .....రైతులకు గిట్టుబాటు ధర రావాలి, వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందాలనే లక్ష్యంతో 1998లో నేను రైతు బజార్ లు ప్రారంభించాను. పల్లె వెలుగు పేరుతో ఆర్టీసీ బస్సులు ప్రారంభించాం. బస్సు వెనుక సీట్లు ఖాళీ చేయించి అందులో కూరగాయలు వేసి రైతు బజార్లకు రైతులు తరలించేలా ఏర్పాట్లు చేశాం. దీనివల్ల దళారీ బెడద తగ్గించాం. రూ.6 కోట్లు కేటాయించి కర్నూలులోని రైతుబజార్ ని ఆధునికీకరిస్తాం. ప్రస్తుతమున్న 125 రైతు బజార్ల సంఖ్యను పెంచుతాం. ఒకప్పుడు మొబైల్ రైతు బజార్లు కూడా విజయవంతంగా నడిపించాం. సీమ అభివృద్ధి నా బాధ్యత...... నేను సీమ బిడ్డను సీమ అభివృద్ధి నా బాధ్యత. ఒకప్పుడు రాయలసీమ అంటే కరువు, ఫ్యాక్షన్ అనేవారు. నేను వచ్చాక సీమలో ఫ్యాక్షనిజం మాటే వినబడకుండా చేశాను. కరువు రక్కసి నుంచి సీమ ప్రజలను కాపాడాము. సీమను హార్టికల్చర్ హబ్ గా తయారుచేస్తాం. ప్రస్తుతం సీమలో 18 లక్షల హెక్టార్లలో హార్టికల్చర్ ఉంది. రాబోయే ఐదేళ్లలో 36 లక్షల హెక్టార్లలో హార్టికల్చర్ పెడతాం. 16 లక్షల ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ ఇచ్చాం. గత ప్రభుత్వంలో ఐదేళ్లూ వారు పట్టించుకోలేదు. మైక్రో ఇరిగేషన్ కింద ప్రతి రైతుకు 10 ఎకరాల వరకూ 90 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. సీమ నాలుగు జిల్లాలకూ నాలుగు ఎయిర్ పోర్టులు (తిరుపతి, కడప, పుట్టపర్తి, ఓర్వకల్లు) ఉన్నాయి. టీడీపీ చొరవతో ఈ జిల్లాలకు జాతీయ రహదారులు అనుసంధానమయ్యాయి. రాబోయే రోజుల్లో సీమ గ్రీన్ ఎనర్జీకి హబ్ గా తయారవుతుంది. సోలార్ ఇక్కడి నుంచే ఉత్పత్తవుతుంది. విండ్ ఎనర్జీ ఇక్కడి నుంచే వస్తుంది. దేశంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి సీమ కేంద్రంగా పనిచేస్తుంది. ఓవైపు సంక్షేమం మరోవైపు పెట్టుబడులుఎన్డీఏ ప్రజా ప్రభుత్వం. అర్హులకు సంక్షేమం అందిస్తూనే రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తెస్తున్నాము. ఇప్పటికే 76 ప్రాజెక్టులు తెచ్చాం. రూ.4.96 లక్షల పెట్టుబడులు వస్తున్నాయి. తద్వారా రాష్ట్రంలో 4.51 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయి. ఆగస్టు 15 నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తాము. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 4 వేలు మొదలు రూ. 15 వేల వరకూ పింఛను అందిస్తున్నాము. అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నాము. దీపం 2 కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాము. స్కూళ్లు తెరిచేలోగా డీఎస్సీ ద్వారా టీచరు పోస్టులు భర్తీ చేస్తాం. స్కూళ్లు తెరిచే నాటికి తల్లికి వందనం కింద రూ. 15 వేలు జమ చేస్తాం. రైతులకు గిట్టుబాటు ధర ఇస్తాం. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం. సోలార్ వెలుగులు తెస్తాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇంటిపై కరెంటు తయారీ సౌకర్యం కల్పిస్తాం. అందరం కలిసి పేదలకు అండగా ఉందాం. 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా రూపుదిద్దుకుందాం. అవసరమైన సంక్షేమ పథకాలన్నీ అందజేస్తాం. ఆదాయాన్ని పెంచే మార్గం చూపిస్తాం. పేదల జీవితాల్లో వెలుగు తేవడానికి పని చేస్తా. నేను పడే కష్టం నా కోసం, ధనవంతుల కోసం కాదు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండే నిర్భాగ్యులు తృప్తిగా ఉండాలని ఆలోచిస్తున్నాను. పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన పారిశ్రామిక వేత్తలను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హైదరాబాద్-విశాఖ ఇక 8 గంటలే!

>> 31 గ్రామాల్లో 19వందల 96 ఎకరాలను కేంద్ర ప్రభుత్వం సేకరించింది. తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 56.7 కిలోమీటర్ల మేర ఈ రహదారి విస్తరించింది. దీనిని రెండు ప్రాజెక్టులుగా చేపట్టారు. గత ఏడాది డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. మొదటి ప్రాజెక్ట్‌లో 90 శాతం పనులు పూర్తవ్వగా రెండో ప్రాజెక్ట్ లో 70 శాతం మాత్రమే చేశారు. ఇంకా మూడు కిలోమీటర్ల మేర అసలు రహదారి పనులు మొదలు పెట్టలేదు. భూ సేకరణ అంశం కొలిక్కి రాకపోవడంతో మూడు కిలోమీటర్లు పనులు నిలిచిపోయాయి. ఖమ్మందేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిని హైదరాబాద్ విశాఖ మధ్య దూరం తగ్గించేందుకు ప్రధానంగా నిర్మిస్తున్నారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే 676 కిలోమీటర్లు 12 గంటలపాటు ప్రయాణించాలి. ప్రధానంగా విజయవాడ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ నూతన రహదారి పూర్తయితే విజయవాడ వెళ్లకుండానే సుమారు 125 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. 8 గంటల్లోనే విశాఖ నుంచి హైదరాబాద్ చేరుకోవచ్చు.నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ జాతీయ రహదారి 162 కిలోమీటర్ల దూరంలో కేవలం 8 చోట్ల మాత్రమే దీనిపై ప్రవేశించడానికి వీలుంది. తెలంగాణాలోని ఖమ్మం, వైరా, కల్లూరు, సత్తుపల్లి ఏపీలో తిరువూరు, జంగారెడ్డిగూడెం, గురవాయిగూడెం, దేవరపల్లి వద్ద మాత్రమే ఈ రహదారిపైకి రావడానికి అనుసంధాన రహదారులు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలో నాలుగు చోట్ల టోల్ ప్లాజాలు, విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మూడు కిలోమీటర్ల పరిధిలో భూ సేకరణ అంశం కొలిక్కి వస్తే అక్కడ కూడా నిర్మాణం చేపట్టి రహదారిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై కేంద్రం దృష్టిని కేంద్రీకరించింది. ఏపీ, తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై ఆయా శాఖలకు కేంద్ర హోంశాఖకు ఆదేశాలిచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సర్కార్ల ప్రతిపాదనలతో పాటు విభజన చట్టం ప్రకారం ఉన్న పెండింగ్ అంశాలపై చర్చించారు. ఆ భేటీకి సంబంధించిన మినిట్స్‌ను ఇటీవల ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్ర హోంశాఖ పంపించింది. ఈ సమీక్ష సమావేశంలో అమరావతిహైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని కేంద్ర రోడ్లు, ఉపరితల రవాణాశాఖకు హోంశాఖ ఆదేశాలిచ్చింది. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చింది. ఆంధ్రప్రదేశ్ లో మరో రిఫైనరీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని ఏపీ ప్రభుత్వం అభ్యర్థించింది.ఈ నేపథ్యంలో ఆ మేరకు పెట్రోలియం శాఖకు హోంశాఖ సూచనలు చేసింది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ముమ్మరంగా కొనసాగించాలని రెండు సంవత్సరాల్లో అక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖకు ఆదేశాలు జారీ చేసింది. విశాఖ, అమరావతి, కర్నూలు, హైదరాబాద్ కారిడార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని దానిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని హోంశాఖ సూచించింది. గతంలో ఆంధ్రప్రదేశ్ లోని వెనకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నందున విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చింది. తెలంగాణకు ఆ నిధుల విషయంపై నీతిఆయోగ్‌తో చర్చించాలని అధికారులకు హోంశాఖ సూచనలు చేసింది.



శనివారం న్యూఢిల్లీలో మంత్రి లోకేష్ తనయుడు దేవాన్ష్‌ను ఆప్యాయంగా పలుకరిస్తున్న ప్రధాని మోడీ

# ప్రధాని మోడీతో లోకేష్ భేటీ

>> 3,132 కిలోమీటర్ల పాదయాత్ర విశేషాలను ఈ కాఫీ టేబుల్ బుక్ లో పొందుపరిచారు. యువగళం పాదయాత్ర ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి చారిత్రాత్మక విజయానికి బాటలు వేసింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రధాన మంత్రి, పుస్తకంపై సంతకం చేసి లోకేష్‌కు మరపురాని జ్ఞాపకంగా అందించారు. ఈ సందర్భంగా లోకేష్ కుటుంబాన్ని ప్రధాని ఆశీర్వదించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాని ఆశీస్సులు, మార్గదర్శకత్వం కావాలని లోకేష్ కోరారు. రాష్ట్ర పురోగతికి ప్రధానమంత్రి అందించిన నిరంతర మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు.అంతేకాకుండా, జాతీయ భద్రత, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ప్రధానమంత్రి బలమైన నిర్ణయాత్మక నాయకత్వానికి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి చేరుకోవడంలో ఆంధ్రప్రదేశ్ తమ వంతు సహకారం అందించేందుకు దిశా నిర్దేశం చేయాల్సిందిగా ప్రధానిని లోకేష్ కోరారు

# మహిళలకు ‘వర్క్ ఫ్రం హోం’

>> పేదలకు అందుబాటులో మెరుగైన పాలన ఇచ్చేలా ముందుకెళ్తున్నాం అన్నారు.ఇటీవలే రాష్ట్రానికి ఆదాయ వనరులను పెంచే దిశలో ఆలోచన చేసామన్నారు. ఏపీలో ఎర్రచందనం నిల్వలను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేలా కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఎక్స్‌'లోనే సీఎం చంద్రబాబుతెలిపారు. రూ.వేలకోట్ల విలువైన ఎర్రచందనం మన రాష్ట్రానికి మాత్రమే సొంతమని దీనిని విక్రయించడం ద్వారాపెద్దఎత్తున ఆదాయం ఆర్జించవచ్చన్నారు.

# ‘సేఫ్‌జోన్’గా తిరుమల ఘాట్‌రోడ్లు!

>> షిమోషి ఆధ్వర్యంలో గ్రేహౌండ్స్ కమాండర్ ఎస్పీ డాక్టర్ గరుడ్‌సుమిత్‌సునీల్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ అరిఫ్‌హఫీజ్, తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి సివిఎస్‌ఒ వి.హర్షవర్ధన్‌రాజు,తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, డిఎఫ్‌ఒ వివేక్‌ఆనంద్, వివిధ భద్రత దళ అధికారులు కీలక సమావేశం నిర్వహించారు. తిరుమలలో, తిరుపతిలో భద్రత సిబ్బందికి రసాయన,జీవ, కిరణ,అణు ముప్పులపై శిక్షణ ఇచ్చే ప్రతిపాదనలు చేశారు. ఏపిఎస్‌పి, ఏఆర్, ఎస్‌పిఎఫ్, హోం గార్డులు, సివిల్ పోలీసు,టిటిడి భద్రత సిబ్బంది అన్ని భద్రత దళాలను సమన్వయ పరిచి ప్రతి దళానికి స్టాండింగ్ ఆపరేటింగ్ ప్రొసైటీజర్స్ రూపొందించారు. ఇంకా ఇప్పటికే తిరుమల ఘాట్‌లో అడవివైపు 30అడుగుల వరకు ఫోకస్‌లైట్లు ,500ట్రాఫ్ సిసికెమెరాలు కూడా పని చేస్తున్నాయి. భద్రత విషయంలో ఇంకా పూర్తిస్థాయి అధునాతన సాంకేతిక పరికరాలు ఏర్పాటుతో భక్తులు మరింత ప్రశాంతంగా తిరుమలకు చేరుకుని పూర్తిస్థాయి రక్షణలో దేవదేవుని దర్శనం చేసుకునే వీలుకల్పిస్తున్నారు.

# నీట్ ఫలితాలపై మద్రాస్ హైకోర్టు స్టే

>> కలిగినపుడు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని వారన్నారు. దీనితో హైకోర్టు ఫలితాలను నిలిపివేయాలని ఆదేశించింది. ఫలితాలు ప్రస్తుతానికి వాయిదా పడ్డాయి. కాగా ఫలి తాల విడుదలకు సంబంధించిన తేదీపై ప్రభుత్వ అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. 2024-25 సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఉన్న వైద్యకళాశాలల్లోప్రవేశాలకోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మే 4న పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు 23 లక్షలమంది దరఖాస్తుచేసుకోగా 20.8 లక్షలమంది పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షల ఫలితాలను వెల్లడించాల్సి ఉంది.

## వారం - వర్జ్యం

తేది : 18-05-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
పంచమి ఉ.5.57
ఉత్తరాషాఢ సా.6.49
వర్జ్యం రా.10.55-12.33
దు.సా.4.45-5.37
శుభసమయం :ఉ.7.30-8.40
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** వ్యాపారాలు అభివృద్ధి సాధిస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వస్తులాభం. దైవదర్శనాలు.

**వృషభం:** నూతన ఉద్యోగయోగం. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కొంత ఊరట చెందుతారు. బంధువులను కలుస్తారు.

**కర్కాటకం :** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఋణ బాధలు తప్పవు. వాహనసౌఖ్యం.

**సింహం:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**కన్య :** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**తుల:** కుటుంబంలో సమస్యలు ఎదురై చికాకులు పెట్టినా అధిగమించి ముందుకు సాగుతారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**వృశ్చికం:** కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. విందు, వినోదాలు.

**ధనుస్సు:** దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మకరం:** పాత మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. నూతన వస్తు, వస్త్రాల లాభాలు పొందుతారు.

**కుంభం:** పెట్టుబడులలో తొందరపాటు వద్దు. ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**మీనం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మార్కెట్లో నాసి విత్తనాల హల్‌చల్

>> ప్యాకెట్‌ను రూ.1800 నుంచి రూ.2000లకు అమ్ముతున్నారు. వీటిపై తమకెలాంటి ఫిర్యాదులు రాలేదని వస్తే చర్యలు తీసుకుంటామని అధికారులే సర్దుబాబు చేసే ప్రయత్నం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కొన్ని హైబ్రీడ్, బ్రాండెడ్ కంపెనీల పత్తి విత్తనాలను కొనుగోలు చేసేందుకు వెళ్తున్న అన్నదాతలకు షరతులు విధిస్తున్నారు. కొంత మేరకు ఇతర కంపెనీల పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తేనే ఇస్తామని డీలర్లు షరతులు పెట్టారు. 6 ప్యాకెట్లు బ్రాండెడ్ కంపెనీలవి, మరో 4 సాధారణ పత్తి రకాల ప్యాకెట్లను విక్రయిస్తున్నారు.

విత్తనాలు కొనుగోలు చేసిన అన్నదాతలకు మాత్రం రూ.901కే రసీదు ఇస్తున్నారు. కానీ అధిక ధరలకు అమ్ముతున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఎమ్మార్పీ కంటే రెట్టింపు ధరకు అమ్ముతుండటం గమనార్హం. రాయలసీమ ప్రాంతాల్లోను పత్తి నాసిరకం జోరు అధికంగా ఉంది. తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి లూజు విత్తనాలు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారు. బహిరంగ మార్కెట్లో పత్తి విత్తన ప్యాకెట్ (450 గ్రాములు) ధర రూ.901 ఉంది.అదే లూజు విత్తనాలు కిలో రూ.1000 నుంచి రూ.1200లు తీసుకుంటున్నారు. కర్నూలు, నందికొట్కూరు, గూడూరు, కల్లూరు, కోసిగి మండలాల పరిధిలో అన్నదాతలు వీటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

హాలహర్వి, హుళగుంద ప్రాంతాల్లోని అన్నదాతలు కర్ణాటక రాష్ట్రం బళ్లారి, శిరుగుప్ప ప్రాంతాల్లో పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. అక్కడ ఒక ప్యాకెట్ రూ.680 నుంచి రూ.840కే లభిస్తుండటంతో వాటినే కొనుగోలు చేస్తున్నారు.పల్లెల్లో బహిరంగంగా కిలోల చొప్పున పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారు. కానీ అధికారులు ఇప్పటి వరకు ఒక్కచోట కూడా తనిఖీలు చేయకపోవడం విమర్శలు తావిస్తోంది.ఎన్టీఆర్,గుంటూరు జిల్లాల్లో అధికార, విపక్షాలకు చెందిన కొందరు చోటా,మోటా నాయకులు స్వయంగా రాజకీయాలకతీతంగా ఈ విత్తనాల దందా నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి.

# తుర్కియేకు భారీ షాక్: డెస్టినేషన్ వెడ్డింగ్ మార్కెట్‌కు రూ.770 కోట్ల రాబడి నష్టం

**ఇస్తాంబుల్, మే 17:** పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న తుర్కియేకి భారత్ నుంచి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో భారతీయులు బాయ్‌కాట్ తుర్కియే పిలుపునిచ్చారు. ఈ ప్రభావం ఆదేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా డెస్టినేషన్ వెడ్డింగ్స్ ద్వారా ఆ దేశం ఆర్జించే ఆదాయంపై తీవ్ర ప్రభావంచూపింది. ఈ పరిణామాల వల్ల టర్కీ దాదాపు 90 మిలియన్ డాలర్లకు పైగా ఆదాయాన్ని నష్టపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. కొంతకాలంగా విదేశాల్లో వివాహాలు చేసుకోవాలనుకునే భారతీయ సంపన్నులకు తుర్కియే ఒక ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇస్తాంబుల్‌లోని చారిత్రక రాజభవనాలు, అందమైన సముద్ర తీర ప్రాంతాలు నూతన వధూవరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో 2018లో కేవలం 13 భారతీయ జంటలు తుర్కియేలో పెళ్లి చేసుకోగా, గత ఏడాది నాటికి ఈ సంఖ్య ఏకంగా 50కి చేరింది. ప్రముఖ వెడ్డింగ్ ప్లానింగ్ సంస్థ కెస్టోన్ ఉత్సవ్ సీనియర్ ప్రతినిధి నిఖిల్ మహాజన్ మాట్లాడుతూ భారత్ నుంచి డెస్టినేషన్ వెడ్డింగ్‌ల కోసం తుర్కియేకి వెళ్లే వారి ద్వారా ఆ దేశ పర్యాటక రంగానికి ఏటా సగటున 140 మిలియన్ డాలర్ల ఆదాయం లభిస్తోందన్నారు. సాధారణంగా ఒక్కో వివాహానికి సగటున 3 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 25 కోట్లు వరకు ఖర్చవుతుందని, కొన్ని సందర్భాల్లో ఇది 8 మిలియన్ డాలర్లు మన కరెన్సీలో సుమారు రూ. 68 కోట్లు వరకు కూడా ఉంటుందని అక్కడి గణాంకాలు తెలియజేస్తున్నాయి. పెళ్లికి హాజరయ్యే అతిథులు స్థానికంగా పర్యటించడం వల్ల కూడా టర్కీకి అదనపు ఆదాయం సమకూరుతోంది. అయితే సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆదేశం బహిరంగంగా మద్దతు ప్రకటించడం భారతీయులతీవ్ర ఆగ్రహానికి కారణమైంది. దీంతో దేశవ్యాప్తంగా బాయ్‌కాట్ తుర్కియే నినాదం ఊపందుకుంది. ఇప్పటికే దాదాపు 2,000 మంది భారతీయ పర్యాటకులు తమ తుర్కియే పర్యటనలను రద్దు చేసుకున్నారు. ఈ ఏడాది ఆదేశంలో వివాహం చేసుకోవడానికి సుమారు 30 భారతీయ జంటలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. కానీ ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో వీరంతా ప్రత్యామ్నాయ వివాహ వేదికలను ఎంచుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనివల్ల తుర్కియే సుమారు 90 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ. 770 కోట్లు ఆదాయాన్ని కోల్పోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నిరసన పర్యాటకం, వివాహాలకే పరిమితం కాలేదు. ఆదేశంతో వ్యాపార సంబంధాలను కూడా భారతీయులు క్రమంగా తగ్గించుకుంటున్నారు. పండ్లు, ఆభరణాల వ్యాపారులు అక్కడినుంచి దిగుమతులను నిలిపివేయాలని నిర్ణయించుకున్నారు. అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (కెయిట్) కూడా తుర్కియే కంపెనీలతో ఎలాంటి వ్యాపార సంబంధాలు పెట్టుకోవద్దని పిలుపునిచ్చింది.

18-05Pg3exHMNWJQER22222222.qxd:18-05Pg3exHMNWJQER22222222.qxd 01/01/01 8:23 AM Page 1



## మెగా డీఎస్సీకి రాష్ట్ర వ్యాప్తంగా 3,35,401 మంది అభ్యర్థులు దరఖాస్తు

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** మెగా డీఎస్సీకి రాష్ట్రవ్యాప్తంగా 3,35,401 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. దరఖాస్తుల గడువు ఈ నెల 15 అర్ధరాత్రితో ముగిసింది. దాంతో అన్ని పోస్టులకు కలిపి 5,77,417 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా 39,997 మంది అభ్యర్థులు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి దరఖాస్తు చేయగా అత్యల్పంగా కడప జిల్లా నుంచి 15,812 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 7,159 మంది దరఖాస్తు చేశారు. ఈ నెల 30 నుంచి హాల్‌టికెట్ల జారికి పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ మెగా డీఎస్సీలో మొత్తం 16,347 పోస్టులు భర్తీ చేయనున్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జూన్ 6వ నుంచి జులై 6వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

## రెండ్రోజుల పాటు రైళ్లు రద్దు

**గుంతకల్లు రైల్వే,మే 17,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వేలో జరుగుతున్న రైల్వే నిర్వహణ పనుల కారణంగా రెండ్రోజుల పాటు రైలు సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఆది, సోమవారాల్లో సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో తిరిగే 30రైలు సర్వీసులతో పాటు జంట నగరాల్లో తిరిగే 13ఎంఎంటిఎస్ రైలు సర్వీసులను, హైదరాబాద్ డివిజన్‌లో తిరిగే 10రైలు సర్వీసులను, విజయవాడ డివిజన్‌లో తిరిగే 8రైలు సర్వీసులను, నాందేడ్ డివిజన్‌లో తిరిగే 6రైలు సర్వీసులను కలిపి మొత్తం 67రైలు సర్వీసులను ఆది,సోమ వారాల్లో రద్దు చేశారు.



## తిరుమల మఠాల్లో భద్రతపై నిశిత తనిఖీలు

**తిరుమల,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** జమ్మూ కాశ్మీర్‌లో గతంలో జరిగిన ఉగ్రదాడితో ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలలో పోలీసు వర్గాలు భద్రతను కట్టుదిట్టంచేస్తున్నాయి. ఇందులో భాగంగా తిరుమలలో స్థానికులు నివాసముంటున్న బాలాజీనగర్‌తోబాటు తిరుమలలోని మఠాలు, గోగర్భమ్‌డ్యామ్‌వద్ద మఠాలను శనివారం ఉదయం తిరుమల పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది, బాంబుడిస్పోజల్ టీమ్, పోలీసుజాగిలాలతో తనిఖీలు చేశారు. మఠాల్లోని గదుల్లో ఉన్న భక్తులు ఎవరు, ఎక్కడ నుండి వచ్చారు, శ్రీవారి దర్శనం టిక్కెట్లు ,ఆధార్‌కార్డులు పూర్తిస్థాయిలో తనిఖీ చేసి వారికి భద్రతకు సంబంధించి,అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు పై అవగాహన కల్పించారు. తిరుమలలో ఇప్పటికే భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. టిటిడి సివిఎస్‌ఒ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో శనివారం ఉదయం ఆయా ప్రాంతాల్లో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, సిఐలు విజయకుమార్, రాముడు, విజిలెన్స్ సిబ్బంది భక్తులను ,వారి ఆధార్‌కార్డులను, దర్శన టిక్కెట్లను తనిఖీ చేశారు. ఇదివరకే అలిపిరి వద్దనుండే భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు తిరుమలకొండపై డేగకళ్ళతో పహరాకాస్తున్నారు. ఆలయం పరిసరాలు, ఆలయ మాఢవీధులుల్లో పోలీసులు, విజిలెన్స్ నిఘాతో బాటు ఆక్టోపస్ బలగాలు మొహరించి పర్యవేక్షిస్తున్నారు.

# దేశం కోసం సైనికులు చేస్తున్న త్యాగాలకు సెల్యూట్,

### మన సైనికులకు అండగా ఉందాం

### - రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, సత్య కుమార్ యాదవ్



అనంతపురంలో నిర్వహిస్తున్న తిరంగ ర్యాలీ, పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు

**అనంతపురము, మే 17 ప్రభాతవార్త బ్యూరో** భారతదేశ సైనికుల శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుద్దామని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ కార్యక్రమంతో మన సైనికులు ఉగ్రవాదులను మట్టుపెట్టారని, మన సైనికులకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రులు పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా తెలుపుతూ తిరంగా యాత్ర నిర్వహించారు. శనివారం అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న గ్రౌండ్ నుండి ప్రారంభమై టవర్ క్లాక్ మీదుగా.. సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న జాతీయ జెండా స్తంభం వరకు నిర్వహించిన తిరంగా యాత్రను రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, వై.సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. మంత్రులతో పాటు అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మినారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివనారాయన్ శర్మ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, మాజీ సైనికులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, అన్ని వర్గాల నగర ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు, ఎన్జీఓలు, సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెషనల్స్, వ్యాపార సంస్థలు, టీచర్లు, పోలీసులు, ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్స్, తదితరులు పాల్గొన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. సరిహద్దుల్లో ప్రాణాలను అడ్డేసి నిలిచిన సైనికులకు, సైనిక శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుస్తూ దేశం మొత్తం మీద జరుగుతున్నటువంటి తిరంగా యాత్రలో భాగంగా ఈరోజు నా అనంతపురం జిల్లాలో హాజరైన వేలాదిమందికి హృదయపూర్వక నమస్కారాలు తెలుపుతున్నామన్నారు. దేశం ఒక్కటే అన్నటు వంటిది మన గుండెచప్పుడని ఈ రోజు అర్ధం అవుతుందన్నారు. ఇంత ఉదయాన్నే వేలమంది ఇక్కడ హాజర య్యారంటే దేశభక్తి ప్రతి గుండె చప్పుడుగా మారింది అనడానికి ఇంతకన్నా నిదర్శనం అవసరంలేదన్నారు. మొన్నటి దాకా సైన్యంలో పనిచేసిన ఉమ్మడి అనంతపురం జిల్లా వాసి అయిన ఎం.మురళినాయక్ ప్రాణాలు పోగొట్టుకోవడం జరిగిందని, వారు మన రక్షణ కోసం చేసినటువంటి త్యాగాలకు బాసటగా నిలవాలన్నారు. త్రివిధ దళాలకు సంబంధించిన సైన్యానికి మద్దతుగా ఈ దేశం మీ వెనకాలే ఉందని, దేశం కోసం మీరు చేస్తున్న త్యాగాలకు దేశం గుర్తిస్తుందని మేము మీకోసం సెల్యూట్ చేస్తున్నామన్నారు.

## అభయా యాప్ ద్వారా రోగులకు వైద్యసేవలు

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆస్పత్రులకు వెళ్ళే అవకాశంలేకుండానే అత్యావసర సమయాల్లో వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకమైన యాప్ అందుబాటులోకి వచ్చింది.ప్రభుత్వాసుపత్రులకు వెళ్ళినపుడు గతంలో రోగికి ఉన్న అనారోగ్య సమస్యలను వైద్యులు అడిగి తెలుసు కుం టుంటారు. దీని కోసం మనం పాత రికార్డులు తీసుకెళ్తుంటాం. ఒక్కోసారి అవి కనిపించకపోతే ఇబ్బందే. ఇప్పుడు ఆ అవసరం లేకుండా రోగి ఆరోగ్య చరిత్ర డిజిటలీకరణ చేస్తున్నారు. దీవల్ల సమయంతో పాటు వైద్య పరీక్షల ఖర్చులు తగ్గనున్నాయి. ప్రస్తుతం నమోదు ప్రక్రియ జరుగుతోంది.రోజుకి 50కి తక్కువ కాకుండా: ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. రోజుకు 50 మంది రోగుల వివరాలు చొప్పున ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషనరీ(ఏబీడీఎం) యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీని కోసం ఒక్కో ఆస్పత్రిలో ఒక్కో వ్యక్తిని నియమించారు. రోగి ఆధార్‌కార్డుకు అనుసంధానమైన చరవాణి సంఖ్య నమోదు చేసి,14 అంకెలతో ఉన్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య డిజిటల్ కార్డు జారీ చేస్తున్నారు.సెల్‌ఫోన్‌లో యాప్‌ను పెట్టుకునే అవకాశం కల్పించారు.

వైద్య సిబ్బంది రోగి ఆరోగ్య చరిత్ర ఏబీడీఎం యాప్‌లో నమోదు చేశాక రోగుల స్మార్ట్‌ఫోన్‌లోనే వారితోనే అభాయాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. ఈ యాప్ కలిగిన రోగి,

ఓపీ కేంద్రం వద్ద క్యూలైన్‌లో నిల్చోవాల్సిన అవసరం లేదు. ఓపీ చీటీలు ఇచ్చే చోట క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఏర్పాటు చేశారు. చరవాణీలో ఉన్న యాప్ సాయంతో స్కాన్ చేయగానే కొన్ని వివరాలు నమోదు చేయనమి చూపిస్తుంది. ఆ విధంగా నమోదు చేస్తే ఓపీ నెంబరు వస్తుంది. ఇందులోనే రోగికి అవసరమైన వైద్యుడి వివరాలు కూడ కనిపిస్తాయి.

దాని ఆధారంగా వైద్యుడిని సంప్రదిస్తే చాలు వైద్యసేవలు సులువుగా పొందవచ్చు.



## ఐ ఫోన్‌లోనూ ఎస్పీడిసిఎల్ మొబైల్‌యాప్

**తిరుపతి,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుజిల్లాల పరిధిలోని ఎస్‌పిడిసిఎల్ వినియోగదారుల సౌకర్యార్థం ఐఫోన్‌లో మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ వ్యవస్థ సిఎండి కె.సంతోషరావు తెలిపారు. గతంలో ఆండ్రాయిడ్ మొబైల్స్‌లో మాత్రమే ఎస్‌పిడిసిఎల్ యాప్ వినియోగదారులకు అందుబాటులో ఉండేదన్నారు. అయితే యాపిల్ ఐఫోన్ వినియోగదారులకు కూడా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంస్థ ఐటి విభాగం ఆధ్వర్యంలో ఇన్వెన్సిస్ సహకారంతో యాపిల్ ఐఓఎస్ మొబైల్‌యాప్‌ను రూపొందించామని వివరించారు. ఈ యాప్ ద్వారా ఇకపై యాపిల్ ఐఫోన్ వినియోగదారులు కూడా ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్‌సేవలను పొందవచ్చని సిఎండి తెలిపారు. వినియోగదారులు ఈ యాప్‌ను యాపిల్‌స్టోర్‌నుండి గానీ ఏపిఎస్‌పిడిసిఎల్ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. యాండ్రాయిడ్ యాప్ తరహాలోనే ఐఓఎస్ మొబైల్ యాప్‌లో కూడా సర్వీస్ నంబర్ నమోదు/తొలగింపు ,విద్యుత్ బిల్లు చెల్లింపు, మొబైల్ నంబర్ అనుసంధానం, చెల్లింపుల వివరాలు, వినియోగదారుని వివరాలు ,బిల్లు గణింపు తదితర సేవలు వినియోగించుకోవచ్చన్నారు.

## రూపాయికే సారవంతమైన మట్టి

### -రైతుల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** రైతుల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.రసాయన ఎరువుల వాడకంతో చప్పగా ఉన్న నేలలను సారవంతంగా మార్చుకోడానికి బహుళత ప్రయోజనాలను సర్కార్ కల్పిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా స్వంత గ్రామాల పరిసరాల్లో ఉన్న చెరువు,జలాశయాల్లో మట్టిని పొలాల్లోకి తీసుకెళ్ళడానికి సర్కార్ అనుమతినిచ్చింది. మట్టిని పొలాల్లో కలపడం వల్ల పంట దిగుబడి రెట్టింపు స్థాయిలో వస్తుందన్న ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా మోతాదుకు మించి వాడుతున్న రసాయన మందులు, ఎరువులకు చెక్ పెట్టడానికి ఇదొక మంచి సదుపాయంగా ప్రభుత్వం తెలిపింది. మీటర్ లోతు దాకా: చెరువు,జలాశయాల్లోని ఒండ్రు మట్టిని అన్నదాతలు తమ పొలాల్లో తీసుకెళ్ళడానికి కూటమి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఎక్కడికక్కడ జలవరనురల శాక (ఎంఐ) డివిజన్ల ఈఈలకు అర్జీ చేసుకోవాలి.నిర్దేశిత ప్రాంతాల్లోని జలాశయాలు, చెరువు పరిస్థితిని బట్టి అనుమతిస్తారు. క్యూబిక్ మీటర్ ఒండ్రు మట్టిని తవ్వుకొని తీసుకెళ్ళడానికి రూపాయి చెల్లించాలి.,ఎప్పటికప్పుడు మట్టిని తీసుకెళ్ళాలి. గుట్టగా ఉంచకూడదు. ఒక మీటర్ లోతు దాకా మాత్రమే తవ్వుకోవాలి. జలాశయం/చెరువు కట్ట పక్కనే త్వకూడదని అధికారులు పేర్కొన్నారు. మండలాల ఏఈల ద్వారా ఈఈలకు ధరఖాస్తు చేసుకుంటే సత్తరమే అనుమతిస్తామని చెప్పారు.

## బెజవాడలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భారీ మోసం

### - నిరుద్యోగుల నుండి లక్ష రూపాయలు దోచేసిన కేటుగాళ్లు

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:**నిరుద్యోగులకు ఉద్యోగం పేరుతో తెలివిగా ఎర వేసి,దండిగా దోచుకుని పరాయ్యారు,బెజవాడలో ఉద్యోగాలిప్పిస్తామని లక్షల రూపాయలు దోచేశారు. .ట్రెనింగ్ ఇచ్చి ఉద్యోగాలను ఇస్తామనే పేరుతో విజయవాడ మొగల్రాజపురం లోని నాగరాజు ట్రైనింగ్ అండ్ కన్సల్టెన్సీ సంస్థ మోసం చేసింది.ఒక్కొక్కరి వద్ద రూ.రెండు లక్షల నుండి రూ.మూడు లక్షల వరకు వసూలు చేసి బోర్డు తిప్పేశ్శారు నాగరాజు ట్రైనింగ్ అండ్ కన్సల్టెన్సీ సంస్థ నిర్వాహకులు.,..మాచవరం పోలీసు స్టేషన్‌లో కంప్లయింట్ ఇచ్చినా న్యాయం జరగలేదని విజయవాడ పోలీసు కమీషనర్‌ను కలిసేందుకు వెళ్ళారు భాధితులు.రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది భాధితులు ఉన్నారని అంటున్నారు భాధిత నిరుద్యోగులు.ఫిర్యాదు చేసి నెలరోజుల గడిచినా ఇప్పటి వరకు అరెస్ట్ చేయలేదని భాధితులు ఆరోపిస్తున్నారు. సంస్థ ప్రతినిథులు నాగరాజు అండ్ అండ్ హెచ్ఆర్ శిరీషను అరెస్ట్ చేయకుంబా మాచవరం పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.మోసపోయిన వాళ్ళందరూ ఒకేసారి వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకునే సరికి పది సంవత్సరాలైనా సమయం పట్టవచ్చు అని హేళనగా సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు. దీంతో...చేసేది లేక విజయవాడ సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వెళ్ళిన భాధితులు తమకు న్యాయం చేయాలని సీపీ రాజశేఖర్ బాబు వేడుకుంటున్నారు.

## శ్రీశైలం ప్రాజెక్టు రక్షణ పనులకు రు.25.65 కోట్లతో టెండర్లు



**రాజంపేట అర్బన్, మే17 ప్రభాతవార్త** జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్ డి ఎస్ ఎ) హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు శ్రీశైలం ప్రాజెక్టు రక్షణ పనులపై దృష్టి సారించింది. శ్రీశైలం ప్రాజెక్టు సమగ్రతకే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించిన తర్వాత జలవనరుల శాఖ స్పందించి వెంటనే రక్షణ పనులు ఈ సీజన్లోనే చేపట్టేందుకు 25.65 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శనివారం రక్షణ పనులు చేపట్టేందుకు టెండర్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద ఉధృతి ఏటా పెరుగుతుండడంతో డ్యామ్ రక్షణకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి అనివార్యమని ఇప్పటికే నిపుణులు హెచ్చరించారు. ఈ హెచ్చరికల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం డ్యాన్స్ సేఫ్టీ అథారిటీ కి ఓ లేఖ రాసింది. శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించి సలహాలు, నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ మేరకు ఎన్ డి ఎస్ ఏ చైర్మన్ అనిల్ జైన్ గత నెల 29న శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించారు. కేంద్ర జల సంఘం (సి డబ్ల్యూ సి) సహాయాన్ని కూడా తీసుకొని డ్యామ్ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను ఎన్డిఎస్ఏ సిఫార్సు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం దిగువ కుడిగట్టు పటిష్టపరిచేందుకు నిర్ణయం తీసుకుంది. అలాగే 780 అడుగుల నుంచి 550 అడుగుల వరకు కూడా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు 20.93 కోట్లతో టెండర్లను పిలిచారు. అలాగే కుడి, ఎడమ కొండగట్టులకు 904 అడుగుల పైన గల భాగంలో షాట్ క్రీటింగ్ చేపట్టాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు 4. 72 కోట్లు కేటాయించారు. ఈ మేరకు ఈ రెండు పనులకు టెండర్లను ఆహ్వానిస్తూ శ్రీశైలం ప్రాజెక్టు ఎస్.ఇ. టెండర్ ఉత్తర్వులు జారీ చేశారు. టెండర్లు దాఖలు చేసేందుకు జూన్ 2 చివరి గడువుగా పేర్కొన్నారు.

## పోలవరంపై కేంద్రానిది సవతి తల్లి ప్రేమ - పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**విజయవాడ,మే 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ఉద్ధరిస్తున్నామని చెప్తున్నవన్నీ పచ్చి అబద్ధాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆరోపించారు.రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరంలో జీవం తీసి కుట్రపూరితంగా జీరో చేశారన్నారు."ఎక్స్" వేదికగా ప్రాజెక్ట్ లో నీటి నిల్వ ఎత్తు 45.7 మీటర్ల నుంచి 41.15కు తగ్గించి విధ్వంసం చేశారు. నీటి నిల్వ సామర్థం 119.4 గిలీదిలకు కుదించి బహుళార్ధ సాధక ప్రాజెక్టు కాస్త బ్యారేజీగా మార్చారు. ఆర్‌ఆర్ ప్యాకేజీని ఎగ్గొట్టేందుకు పోలవరాన్ని మొత్తంగా చంపేశారు. కేవలం రూ.22వేల కోట్ల మిగులు కోసం రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీ ఘోరంగా దెబ్బతీస్తుంది. గ్రావిటీ బేస్డ్ ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించి ఎత్తిపోతల పథకంగా మారుస్తున్నారు. 41.15 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేస్తే కుడి, ఎడమ కాలువలకు సహజంగా నీరు పారదనే నిపుణుల హెచ్చరికలు బేఖాతర్ చేస్తున్నారు. ఎత్తు తగ్గింపుతో ప్రాజెక్టుకు తీవ్ర నష్టం జరుగుతుంటే కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాల కన్నా మోడీ గారి ప్రయోజనాలే మిన్న అన్నారు. నీటి నిల్వ ఎత్తు తగ్గింపుపై చంద్రబాబు గారి తీరు చూస్తుంటే "జంకు లేని బొంకు తత్వం" అన్నట్లు ఉంది. బనకచర్ల మీదున్న ప్రేమ బాబు గారికి పోలవరం మీద లేదు. అనుసంధానం అనుమతుల మీద పెట్టిన శ్రద్ధ .. పోలవరానికి పూర్తిస్థాయి నిధుల సాధన మీద పెట్టడం లేదు.పార్లమెంట్ వేదికగా 41.15 మీటర్ల నీటి నిల్వ ఎత్తు వరకే నిధులు పరిమితం చేస్తామని బీజేపీ చెబుతుంటే నిలదీసే దమ్ము కూటమిలోని టీడీపీ, జనసేన సభ్యులకు లేదు. పోలవరానికి శుభవార్త చెప్తామంటూ ఈ నెల 28న సమీక్ష చేస్తున్న ప్రధాని మోడీకి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జాతీయ ప్రాజెక్టుగా పోలవరం బాధ్యత పూర్తిగా కేంద్రానిదే. ప్రాజెక్ట్ నిర్మాణంలో ఫేజ్ 1, ఫేజ్ 2లు మాకొద్దు అన్నారు. మొదటి దీశిళి ప్రకారం నీటి నిల్వ సామర్థం 45.7 మీటర్ల ఎత్తుకు ప్రాజెక్ట్ నిర్మాణం ఇప్పుడు జరగాల్సిందే. ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టం 194.6 టీఎంసీలుగా ఉండాల్సిందేనన్నారు. పోలవరం ద్వారా 30 లక్షల ఎకరాలకు సాగునీరు, 28.50లక్షల మందికి తాగునీరు ఇవ్వాల్సిందే. 45.7 మీటర్ల ఎత్తు ప్రకారం ళి ళి ప్యాకేజీలో మిగిలిన 94వేల కుటుంబాలకు 100శాతం పరిహారం ఇవ్వాలన్నారు. మీ స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, పోలవరం ప్రయోజనాలను కాపాడాలని రాష్ట్ర ప్రజలు, రైతాంగం పక్షాన చేతులు జోడించి వేడుకుంటున్నామన్నారు.

# తిరుమల సమాచారం

## తిరుమల పరిశుభ్రత మనందరి బాధ్యత

### - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అదనపు ఇఒ చౌదరి



**తిరుమల,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రం తిరుమల పరిశుభ్రత మనందరిపై ఉందని, ఇక్కడకు వచ్చే యాత్రికులు కూడా స్వచ్ఛతిరుమలకు సహకరించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. తిరుమల క్షేత్రానికి లక్షమంది భక్తులు వస్తున్నారని, పరిశుభ్రత కాపాడుకోవాల్సిన అవసరం స్థానికులపై కూడా ఉందన్నారు.స్వచ్ఛతకు తిలోదకాలు ఇవ్వకుండా భక్తులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలన్నారు.వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకుని భక్తులకు దుకాణాల వద్ద మంచినీరు అందించి పరోపకారం చేయాలన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఉదయం తిరుమలలోని బాలాజీనగర్‌లో స్వచ్ఛతిరుమల కార్యక్రమం చేపట్టారు. డిప్యూటీ ఇఒ సోమన్‌నారాయణన్,సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవి, ఆరోగ్యఅధికారి మధుసూదన్,విఎస్‌ఒ సురేంద్ర,ఆరోగ్యవిభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలలో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి



**తిరుమల,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి శనివారం మధ్యాహ్నం తిరుమలకు చేరుకున్నారు. పద్మావతివిశ్రాంతి భవనం సముదాయంలోని శ్రీకృష్ణ అతిధిగృహం వద్ద కేంద్రమంత్రికి డిప్యూటీ ఇఒ (ఆర్1)భాస్కర్, ఓఎస్‌డి సత్రానాయక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి ఇక్కడే బసచేసి ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుంటారు.

## శ్రీవారి దర్శనంతో ఆనందం:మహారాష్ట్ర మంత్రి రాధాకృష్ణ



**తిరుమల,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని మహారాష్ట్ర మంత్రి రాధాకృష్ణ తెలిపారు.తిరుమలలో భక్తులకు దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకోగలుగుతున్నారన్నారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆయన కుటుంబంతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవాణి ట్రస్ట్ నిధులతో పక్కాగా ఆలయాల నిర్వహణ

### - నిరాదరణకు గురైన ఆలయాల్లో ధూపదీపనైవేద్యాలకు సహకారం :టిటిడి ఇఒ శ్యామలరావు



**తిరుమల,మే 17 ప్రభాతవార్తప్రతినిధి:** సనాతన హిందూ ధర్మాన్ని మరింత విస్తృతంగా జనబాహుళ్యంలోనికి తీసుకెళ్ళేందుకు ఆలయాల నిర్మాణాలు పక్కాగా నిర్వ హించేందుకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు దోహదపడుతాయని టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. నిరాదరణకు గురైన ఆలయాల ధూపదీపనైవేద్యాల నిర్వహణకు ప్రణాళికలు,వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల నిర్వహణకోసం ప్రత్యేకంగా యంత్రాంగాన్ని రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలనభవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, ఎఫ్ఎసిఎఒ బాలాజీ. సిఇ సత్యనారాయణతో కలసి ఇఒ శ్యామలరావు సమీక్షించారు. శ్రీవాణి ట్రస్ట్‌లో ప్రస్తుతం ఉన్న నిబంధనలను పున:సమీక్షించుకుని మరింత మెరుగ్గా, పారదర్శకంగా ఉండేలా ప్రణాళికలు తయారుచేయాలని ఇఒ ఆదేశించారు. సనాతనధర్మాన్ని జనంలోకి తీసుకెళ్ళేందుకు ఆలయాల నిర్మాణాలు పునాదుల్లాంటివని, ఆలయాల నిర్మాణాలతో దైవచింతన,ఆధ్యాత్మికత, సేవాభావం సమభావంతో మానవ సంబంధాలు పెరుగుతాయన్నారు. ఇప్పటికే సమరసత సేవాఫౌండేషన్, దేవాదాయశాఖ సంయుక్తంగా నిర్మితమవుతున్న ఆలయాల ప్రస్తుత స్థితి, జీర్ణోద్ధారణ పనులు ఏ దశలో ఉన్నాయో నివేదిక తయారుచేయాలన్నారు. ఆలయాల నిర్మాణం జరుగుతున్నపుడు, పూర్తయిన తరువాత ఆలయాల నిర్వహణను టిటిడి తరచూ తనిఖీలు చేపట్టాలని ఇఒ సూచించారు.

## వేసవిసెలవులు.. వారాంతం - భక్తులతో కొండ కిటకిట

### - వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు

**తిరుమల,మే 17 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమంది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది. వేసవి సెలవులు.. ఆపై వారాంతం శని,ఆదివారాలు కలసి రావడంతో శనివారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 18గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో ఐదుగంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. దీంతో టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. అసలే వేసవిసెలవులు....ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది.

**NATIONAL SEEDS CORPORATION LIMITED**
(A Government of India Undertaking)
"An ISO 9001:2015 & ISO 14001:2015 Company"
REGIONAL OFFICE, 17-11,Tukaram Gate, Lalaguda,
Secunderabad-500017.(TG) PH: 040 -27731152, 27730635
Mail ID- rm.secunderabad@indiaseeds.com

**NOTICE INVITING E-TENDER**

National Seeds Corporation Limited, Regional office, Secunderabad invite tenders through e-tendering for purchase of Dhaincha and Sunhemp Certified or Truthfully Labelled (TL) seeds from reputed seed producers / suppliers. Tender Document can be downloaded from **website https://indiaseeds.enivida.com from 19.05.2025, 13.00 hrs.** The Tender fee is Rs.1180 and for further details visits our website www.indiaseeds.com. Tenders without Tender Fee and EMD will be rejected. Last Date for submission of online tender is 26.05.2025 till 14.00 hrs. and the date of opening technical bid is 26.05.2025 at 14.30 hrs. If opening date happens to be holiday, the tender will be opened on next working day. If any changes will be placed only on NSC web-site.

No. 1(23)/Mktg/NSC-HYD/2025-26/
DATED: 17.05.2025

Regional Manager
National Seeds Corporation
Secunderabad

ఇటీవల మాజీ మంత్రి హరీష్‌రావు ప్రభుత్వం ధాన్యంసేకరణలో వైఫల్యాన్ని ఎండ గడుతున్నారు. రైతులు చనిపోతుంటే పట్టించుకోకుండా అందాల పోటీల మీద రివ్యూలు పెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి తీరు.. రోమ్ నగరం తగులబడుతుంటే నీరో చక్రవర్తిఫిడేల్ వాయించినట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో వచ్చే పదిరోజుల్లో నైరుతి రుతు పవనాలు ప్రవేశించనున్నాయి. రైతులు సాగు స్నాహాలు చేసుకోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపు కాస్తున్నారు. ధాన్యం ఎప్పుడు మిల్లుకు తరలిస్తారో కొందరు ఎదురు చూస్తుంటే, మరికొందరు నగదు ఎప్పుడు బ్యాంకు ఖాతాలో చేరుతుందో అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన దొడ్డు,సన్నరకం ధాన్యానికి సంబంధించిన కనీస మద్దతు ధరకు మొత్తంరూ.3328.36 కోట్లు రైతులకు చెల్లించలేదు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే చెల్లిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. పౌర సరఫరాల సంస్థకు చెందిన ఓపీఎంఎస్ సాఫ్ట్వేర్ పోర్టల్లో ధాన్యం కొనుగోళ్ల వివరాలు నమోదు చేశాకే రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయి. ఇంకా తెలంగాణలో 19 లక్ష మె.ట.పైగా వివరాల నమోదు చేయాల్సి ఉంది.సివిల్ సప్లయ్ సన్నాలకు చెల్లించాల్సిన బోనస్ బకాయిలు ఖరీఫ్‌కు చెందినవి రూ.250 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. రబీ సీజన్ సన్నాలకు సంబంధించి రూ.767కోట్ల బోనస్ చెల్లింపులు ఇంకా చేపట్టలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రా ల్లో కనీస వసతులు లేక వడదెబ్బతో ధాన్యం రాశులపైనే రైతులు ప్రాణాలు వదులుతున్నా రని, ఇవి ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగిన హత్యలేనని, రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని హరీష్ డిమాండ్ చేశారు. చనిపోయిన రైతు కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ బిఆర్ఎస్ డిమాండ్ చేస్తే రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని బిజెపి డిమాండ్ చేస్తున్నది.

# మబ్బులు ముసురుతున్నా రైతుకు వెతలే!

'నాదని భూమిని నమ్మేవాడికి నాగలిపట్టి దున్నేవాడికి ఉన్నది ఎంతో సంతృప్తి ఉందిరా సుఖ సంపత్తి' -1971లో వచ్చిన రైతుబిడ్డ సినిమాలో కొసరాజు రాసిన పాటకు భిన్నంగా ప్రపంచీకరణతో వచ్చిన మార్పులతో రైతుబతుకు తల్లకిందై 'అన్నదాత జీవితమల్లా అశాంతేరా' అని పాడుకొనేలా తయారైంది. ప్రకృతి ప్రకోపంతో ఓవైపు తెలంగాణ రైతు తల్లడిల్లుతుంటే మరోపై ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులు తాలు, తరుగు, చేట, సడెం అంటూ కొల్లగొడుతున్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో జెట్టి రాజు అనే రైతుక్వింటాకు 10కిలోల తరుగుతీస్తున్నారని ఆత్మహత్య చేసుకున్నారు. ముగిసిన వ్యవసాయ సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్‌లు కలిపి రైతుల నుంచి రూ.6283 కోట్లు మార్కెట్‌లో దళారులు దోచుకున్నారు. రబీ సీజన్‌లోనే ఇప్పటి వరకు 13లక్షల టన్నుల ధాన్యం తరుగు, తాలు రూపంలో దళారుల గిడ్డంగుల్లోకి చేరుతోన్నది. టన్ను ధాన్యానికి 22వేల చొప్పున ధర కడితే సుమారు రూ.2860 కోట్లు. ఈ సీజన్ రైతు కష్టాన్ని దోచుకున్నారు. ఖరీఫ్,రబీ సీజన్‌లో 281లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి తెలంగాణలో జరిగింది. యాసంగి సీజన్‌లోనే 127లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కాగా అందులో 70.13 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు విక్రయానికి వస్తాయని అంచనా వేశారు. శుక్రవారం నాటికి 44.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 40కిలోల గన్నీ బ్యాగు 850 గ్రాముల బరువు వుంటుంది. ధాన్యం తూకం వేసేప్పుడు 40.850 గ్రాములు మాత్రమే తూకం వేయాలి. కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తాలు, తేమ అంటూ పేచిపెడుతూ నాలుగున్నర కిలోలు అధికంగా తూకం వేస్తున్నారు. క్వింటాల్‌కు పది కిలోలు తరుగు దళారుల జేబుల్లో నింపుకొంటుంటే రైతు కళ్లలో కన్నీళ్లు నింపుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ధాన్యం సేకరణలో కూడా జాప్యం జరుగుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఇద్దరు మహిళా రైతులతో పాటు పదకొండు మంది రైతులు ఎండదెబ్బతో మృతి చెందారు. ఒక రైతు తాను అమ్మకాని తీసుకొచ్చిన

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

వరిధాన్యం కుప్పపైనే మృతి చెందిన హృదయవిదారకమైన దృశ్యం ఈ రబీసీజన్‌లో ఆవిష్కృతమైంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని కుమ్మరికుంట్లకు చెందిన ఎండీ యాకూబ్ 38 రోజుల క్రితం వరి కోసి గ్రామంలోని ప్రాథమిక సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోశాడు. పూర్తిస్థాయిలో ఆరబెట్టిన తరువాత తేమశాతం వచ్చినా తన వడ్లు కాంటాలు పెట్టకుండా తాత్సారం చేస్తుండటంతో సోమవారం ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యా



యత్నం చేశాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్మడానికి అన్నదాతలు ఆపసోపాలు పడుతున్నారు.సాయంత్రం ఆకాశం మేఘావృతం వుతుండటంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ల కొరత ఉండటంతో ధాన్యం తడిసిపోతుందని అన్నదాత ఆందోళన చెందుతున్నారు. దాదాపు 60 శాతం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు దుబాటులో లేవు. కేంద్రాలకు ఊహించిన దానికంటే ఎక్కువ ధాన్యం రావడంతో జాప్యం భగుతోంది. దీనికితోడు తేమ పేరుతో కేంద్రాల నిర్వాహకులు అధిక తూకం వేస్తుండటంతో కర్షకులు నష్టపోతున్నారు. తెలంగాణలో ఆర్థిక సంక్షోభం పెరిగిపోతుండటంతో అనంతకోటి దరిద్రాలకు శతకోటి ఉపాయాలు అన్నట్లుధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దొంగలు కూడా పెరిగిపోతున్నారు. రాళ్లతో రైతులపై దాడులు చేసి ధాన్యం ఎత్తుకుపోయే ముఠా కూడా ఇటీవల తయారైంది. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొందరు తమ అక్రమార్జనకు అనువుగా మలచుకుంటున్నారు. అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించటంతో అన్నదాతలు నిలువు దోపిడీకి గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు వర్షానికి తడవకుండా కాపాడుకోవడానికి వారు నానా తంటాలు పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి కుటుంబ సభ్యులందరూ శ్రమిస్తున్నారు. తెలంగాణలో యాసంగిలో 54.89లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 8381ఇందిరా క్రాంతి, పీఏసీఎస్. మార్కెట్యార్డు, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దొడ్డురకం ధాన్యం క్వింటాలుకు రూ.2,320,సన్నరకానికి రూ.2,320, బోనస్ రూ.500లను ప్రభుత్వం ప్రకటించింది. వరికోతలు పూర్తిచేసి నెలరోజులు గడిచింది. 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రబీలో పంట దిగుబడిగా వస్తుందనీ అంచనా వేయగా 100లక్షల మెట్రిక్ టన్నులలోపే దిగుబడి అయింది 70లక్షల మె.ట ధాన్యం కొంటామనీ ప్రభుత్వం ప్రకటించినా కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు లేక తేమ యంత్రాలు పనిచేయక అకాల వర్షంతో కొనుగోళ్ల జాప్యం చేయడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. తూకాల్లో జాప్యం, లారీల కొరత రైతులకు తీవ్ర మానసిక ఇబ్బందిగా మారింది. అకాల వర్షాలతో పలుకొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవుతోంది. భారీ ఈదురుగాలు లకు టార్పాలిన్లు ఎగిరిపోతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో దోపిడి మాత్రం ఆగడంలేదు. తుంగతుర్తి మండలంలోని కేంద్రాల నిర్వాహకులు కొందరు రైతుల నుంచి వంద బస్తాలకు ఒక డబ్బా, ఆపైన బస్తాలకు బస్తా వడ్లు వసూలు చేస్తున్నారు. తామేమీ తక్కువ కాదన్నట్లు హమాలీలు కూడా అదనంగా వడ్లుకాదంటే నగదు వసూలు చేస్తున్నారు.వాస్తవానికి ధాన్యం బస్తా 41కిలోలు తూకం వేయాల్సి ఉండగా 41,200 కిలోలు తూకం వేస్తున్నారు. ఈ లెక్కన క్వింటాకు అరకిలో దగాచేస్తున్నారు. దీనికితోడు లారీ డ్రైవర్ మామూలు పేరుతో బస్తా ఒక్కంటికి రూ.2చొప్పున వసూలు చేస్తున్నారు.

నిర్వాహకులు ఇప్పటికే ఒక్కో కేంద్రం నుంచి 30 క్వింటాళ్ల వరకు రైతుల పేరునలారీల్లో తరలించినట్లు తెలుస్తోంది. కొనుగోళ్ల పూర్తయ్యే నాటికి నిర్వాహకులు, హమాలీలు కలిసి ఇంకెంత సమకూర్చుకుంటారోనని రైతులు వాపోతున్నారు.ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, నేలకొండపల్లి, వైరా, తల్లాడ, ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, వేంసూర్ మండలాల్లో నిజామాబాద్ జిల్లా లోని ధర్పల్లి.ఇందల్వాయి, నందిపేట,రెంజల్ మండలాల్లో రైతుల నుంచి లారీ డ్రైవర్లు డబ్బులు వసూలు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో లింగంపల్లి, నిజాంసాగర్ తదితర మండలాల్లోనూ ఇదే సమస్య. మహబూబా బాద్ జిల్లాలోని పెద్దవంగర, నర్సింహుల పేట, ఇనుగుర్తి మండలాల్లోని కొన్ని సహకార సంఘాల కొనుగోలు కేంద్రాలు, మరికొన్ని ఐకేపీ కేంద్రాల వద్ద ఎంతో కొంత ఇవ్వకపోతే ధాన్యం తరలించడం లేదని రైతులు వాపోతున్నారు.వరంగల్ జిల్లాలో బస్తాకు ఇంత అని కాకుండా ధాన్యం అమ్మిన రైతు నుంచి రూ.300వసూలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయలేని పరిస్థితుల్లో డబ్బులు ఇవ్వక తప్పటంలేదని రైతులు వాపోతున్నారు. తూకం వేసిన ధాన్యం మిల్లుకు చేరేవరకు వారం పదిరోజుల అవుతుండటంతో ఎండిపోయి బరువు తగ్గుతోందని బరువుతగ్గిందని కోత పెడుతున్నారని రైతుల అంటున్నారు. లారీ డ్రైవరు కూడా బస్తాకు రూ.2 చొప్పున ఎన్ని బస్తాలుతెస్తే అన్ని రూపాయలు ముడుపులు చెల్లించుకుంటున్నారు రైతులు. కొనుగోళ్ల చివరి దశకు చేరుకున్న ఈక్రమంలో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిల్లు వద్ద క్వింటాకు రూ.5 ఇస్తుంటే కొనుగోలు కేంద్రం వద్దక్వింటా లారీలోకి ఎక్కిస్తే రూ.14నుంచి రూ.15 ఇస్తుంటారు. దీంతో హమాలీలు.. పక్క జిల్లాల్లో కొనుగోళ్ల వద్దకు వెళ్తున్నారు. దీంతో లారీల్లోంచి ధాన్యం మిల్లుల వద్ద అన్ లోడింగ్ ఆలస్యమవుతోంది. ఇది సదరు మిల్లరు ట్రక్ తయారీపై పడుతోంది. కాంటా వేశాక మిల్లుకు తరలించటంలో ఆలస్యం అన్లోడింగ్లో జాప్యంతో వడ్లు ఎండిపోతున్నాయి. కాంటాలు వేసిన చోట తూకానికి.. మిల్లరు ఇచ్చే ట్రక్షో తూకానికి వ్యత్యాసాలుంటున్నాయి. దీంతో వివాదాలు తలెత్తుతున్నాయి. తాము అమ్మిన సరకు తక్కువగా చూపారంటూ రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇప్పటికైనా రైతు క్షేమం కోసం ప్రభుత్వం సమాజం కదలిరావాలి. ●

# మళ్లీ పేర్ల కయ్యం!

అరుణాచల్ ప్రదేశ్

గిల్లికజ్జాలు పెట్టుకోవడంలో పాకిస్థాన్ కంటె రెండాకులుఎక్కువే చదివింది చైనా. కానీ పాక్ మాదిరిగా ఏ ఉగ్రవాదం మీదో ఆధారపడి ప్రత్యక్ష దాడికిప్రయత్నించదు. మూలాల నుంచి మొక్కను పెకలించే దౌత్యవివాదాల ద్వారా ఆక్రమణలకు ప్రయత్నిస్తూంటుంది. కాశ్మీర్ విషయంలో పాక్ తగాదా పడుతున్నట్లే, అరుణాచల్ ప్రదేశ్ విషయంలో చైనా మనమీద పెత్తనం చెలాయించాలని చూస్తోంది. ఈ తగాదా ఇప్పటిది కాకపోయినా, అప్పుడప్పుడు గుర్తుచేస్తూ భారత్‌కు శిరోభారం పెంచుతోంది. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాక్‌లోని కొన్ని ఉగ్రశిబిరాలపై మన సైన్యం దాడులు జరపడంతో యుద్ధం దిశగా పరిస్థితులు పరిణమిస్తున్న వేళ.. చైనా కూడా భారత్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నాలు మరోసారి మొదలు పెట్టింది. దానిలో ఒక భాగమే అరుణాచల్‌లోని కొన్ని ప్రాంతాలకు పేర్లు మార్చి చైనా తాను భావించిన పేర్లు పెట్టడం. పొరిగింటిలోని వారి పిల్లలకు పేర్లుమార్చాలని ఎవరైనా అనుకుంటారా! అనుకుంటే మాత్రం మార్చగలరా? ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేక కాదు.. కానీ ఏదో విధంగా కయ్యానికి కాలు దువ్వాలన్నదే చైనా సంకల్పం. దాదాపు పదేళ్లుగా ఈ ' పేర్ల మార్పిడి' ప్రక్రియతో చైనా వృధా ప్రయత్నం చేస్తూనే ఉంది. భారత్ ఎన్ని రకాలుగా నిరసనలు ప్రకటించినా, దౌత్య పరంగా ఎన్ని చర్చలు జరిపినా ' అబ్బే! అదేం లేదు.. ఊరికేనే' అంటూనే అరుణాచల్ పై అధికారం చెలాయించడానికి చైనా ఏదో ఒక కుట్ర పన్నుతూనే ఉంది. అరుణాచల్ తమదే అని చెప్తూ రాష్ట్రం పేరునే 'జంగ్నాన్' గా గతంలోనే మార్చేసింది.అనేక ప్రాంతాలు,గ్రామాల పేర్లను ఇప్పటికి అయిదు మార్లు మార్పులు చేసి సొంత పేర్లతో పిలుస్తోంది. అరుణాచల్‌ను చైనాలో అంతర్భాగంగా భావిస్తూ తానుమార్చిన పేర్లతో మ్యాప్‌ను కూడా తయారు చేసి ప్రపంచానికి చూపుతోంది. ఈ దుందుడుకు చర్యలన్నిటిని భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ 'అరుణాచల్ భారత్‌లో అంతర్భాగం. చైనా వాదాన్ని తిరస్కరిస్తున్నాం' అంటూ ప్రపంచ వేదికలపై ఎన్నోమార్లు ప్రకటించింది కూడా. అయినా చైనా వక్రబుద్ధిలో మార్పు రాకపోవడమే విచిత్రం. ఒక వంక పాక్‌తో తాజా ఉద్రిక్తతలు పూర్తిగా చల్లారకుండానే గతవారం చైనా కొత్త మంట పెట్టింది.

**ఎ.వి.వి ప్రసాద్**

టిబెట్‌కు దక్షిణ ప్రాంతంగా అరుణాచల్‌ను చైనా భావిస్తోంది కానీ భారత్ అంతర్భాగంగా మాత్రం గుర్తించడం లేదు. ఇది ప్రాదేశిక హద్దులు తెలియకపోవడం వల్ల కాదు, చైనా దురహంకార, దురాక్రమణ ధోరణి వల్లనే. భారత్ చుట్టూ ఇప్పటికే అనేక రకాలుగా, చాలా వ్యూహాత్మకంగా చైనా దురాక్రమణలకు పాల్పడుతున్నట్లే కనిపిస్తుంది. భారత్ చుట్టూ సముద్ర తీర ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా తన ప్రాబల్యం పెంచుకుంటోంది. పాక్‌లో గ్వాదర్ పోర్ట్, శ్రీలంకలో హంబంటోటా పోర్ట్,బంగ్లాదేశ్‌లో చిట్టగాంగ్ పోర్ట్, మయన్మార్ లో కయాక్ప్యూ పోర్ట్‌లపై పెత్తనం సాగిస్తూతద్వారా భారత్‌కు తరచుగా ఇబ్బందులను సృష్టించే యత్నాలు చేస్తోంది. చైనా హ్యాకర్ల ద్వారా భారత్‌లోని కీలక సంస్థలపై సైబర్‌దాడులు కూడా పెంచుతోంది. ఈ చర్యలన్నీ భారత్‌కు నిరంతరం నిద్ర పట్టకుండా చేయాలనే. కొద్ది రోజులుగా చైనా గూఢచారి నౌక ఒకటి భారత్ సముద్ర జలాల్లో సంచరించడం కూడా అటువంటిదే. భారతీయ నౌకల కదలికలు, నిఘా,ప్రతిస్పందనసామర్థ్యం, జలాంతర్గాముల కదలికలను హైడ్రోగ్రాఫిక్ పరికరాల సాయంతో చైనా నౌక పసిగడుతోందని నిపుణులు అంటున్నారు.'ఆపరేషన్ సిందూర్' తర్వాత మన నౌకాదళం అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రం ఉత్తరతీరం వైపు చాలా అప్రమత్తంగా ఉంటోంది. ఎందుకంటే పాక్‌తో తాజాగా జరిగిన పోరు తాటాకు చప్పుళ్ల వంటిది కాదు. మరికొంచెం ముందుకు వెళ్లి ఉంటే,రెండు దేశాలకు జరిగే నష్టాన్ని అంచనా వేయలేం.కానీ బెడద పాక్‌తో తప్పినంత మాత్రాన సరిపోదు



డ్రాగన్


కదా! అదే సమయంలో చైనా కవ్వింపులు మొదలయ్యాయి. చైనా గూఢచారి నౌకలో అత్యంత అధునాతన సెన్సర్లుకూడా ఉన్నాయనిఅంటున్నారు. వాటివల్ల మన ఐఎన్ఎస్ విక్రాంత్ సహా, యుద్ధ నౌకల కదలికలను చైనా పసిగట్టి ఏదైనా ముప్పు తేవడానికి ప్రయత్నించవచ్చు. బెల్ట్అండ్ రోడ్ ఇనీషియేటివ్ కింద చైనా పాక్ ఎకనమిక్ కారిడార్ నిర్మాణం జరుగుతోంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ గుండా సీపెక్ ప్రాజెక్టును నిర్మించడంపై భారత్ మొదటి నుంచి అభ్యంతరం చెబుతూనే ఉంది. అయినా చైనా ఈ ప్రాజెక్టును కొనసాగిస్తూనే ఉంది. ప్రాజెక్టు పనులు పూర్తి కావాలంటే పాక్‌లో రాజకీయంగా, ఆర్థికంగా స్థిరమైన పరిస్థితులుండాలి. చైనా నిఘా పెట్టడానికి ఇదికూడా ఒక కారణం కావొచ్చని తెలుస్తోంది. ఇలా ఏదో ఒక రకంగా భారత్‌కు 'స్థిమితం' లేకుండా చేయడమే చైనా వ్యూహం. డ్రాగన్ దేశం ఎప్పుడు ఏం చేస్తుందోననే అంశంపై భారత్ తన దృష్టిని కేంద్రీకరించవలసిరావడంతో ప్రాధమ్యాలు కూడా మారిపోతుంటాయి. పాక్ వైపు కంటె చైనా వైపు ఎక్కువ దృష్టి పెట్టిన సమయంలో దాయాది దేశం మళ్లీ ఏ కుట్రకైనా పాల్పడవచ్చు. పేర్ల మార్పు వ్యూహం కూడా అటువంటిదే. అరుణాచల్‌లోని 27 ప్రాంతాలకు తాజాగా చైనా తానను కున్న పేర్లను పెట్టింది. చైనా ఇలాపేర్లుమార్చడం ఇది ఐదోసారి. ఇంతకు ముందు 2017, 21, 23, 24 లో నాలుగుసార్లు చాలా గ్రామాలకు కొత్త పేర్లుపెట్టింది. దాదాపు 90 ప్రాంతాలు, గ్రామాల పేర్లను ఇప్పటిదాకా మార్చేసింది. గత సంవత్సరం నాలుగో విడతలో 30 ప్రాంతాల పేర్లు మార్చినప్పుడు భారత్ చాలా తీవ్రంగానే ప్రతిస్పందించింది.అయినా వక్రబుద్ధిమార్చుకోని చైనా గత బుధవారం (14,మే ) మరో 27 ప్రాంతాల పేర్లు మార్చినట్లు ప్రకటించింది. ఇది పైకి చిన్నదిగా కనిపించినా చాలా ప్రమాదకరమైన అంశమే. పాక్ చేసే ప్రత్యక్ష దాడి కంటే ఎక్కువ ప్రమాదకరం. భారత్ తగిన విధంగా వ్యూహం రూపొందించకపోతే ముందు ముందు మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ●

# మరో కొత్త 'సుంకం'!

అమెరికా

ప్రపంచంలో ఎన్నడూ వినని, చూడని కొత్త చట్టాలు, బిల్లులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచ దేశాలు చూస్తున్నాయి. డోజ్ వ్యవస్థను స్థాపించి ప్రభుత్వ ఉద్యోగుల్లో కోత విధించడం, ఖజానాకు భారం అనిపిస్తే చాలు ఎలాంటి చర్యనైనా చేపట్టేందుకు ట్రంప్ వెనకాడటంలేదు. ఈక్రమంలో దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ నుంచి చీవాట్లు ఎదురవుతున్నా కూడా ట్రంప్ తనదారిలో తాను వెళ్లడం అలవాటుగా మార్చేసుకున్నారు. మనం మళ్లీగ్రేట్ అమెరికాను నిర్మిద్దాం, అమెరికా ఫస్ట్, అమెరికన్ ఫస్ట్‌నినాదమే లక్ష్యంగా వెళుతున్న ట్రంప్‌ముందు వలసదారులపై వేటువేసారు. ఫలితంగాసుమారు ఆరులక్షలమందికిపైగా స్వదేశాలకు పలాయనం చిత్తగించారు. ఉక్రెయిన్ యుద్ధం ముగించేస్తామంటూ పుతిన్‌తో తానుమాట్లాడితే తప్ప సంధి కుదరదని చెపుతున్న ట్రంప్ పాకిస్థాన్ భారత్‌ల మధ్య నేనే మధ్యవర్తిత్వం చేసామని, ఒత్తిడి చేయడంతో రెండుదేశాలు అంగీకరించాయని అందువల్లనే అతిపెద్ద అణ్వస్త్రదాడి ముప్పు తప్పిందంటూ విదేశాల్లో సైతం ఆయన చెప్పుకుంటున్నారు. ఈ విధానాల్లో ఎలాంటి మార్పు లేకపోయినా అదేదారి అదే పద్ధతి ఎంతమాత్రం తీరుమార్చుకోని ట్రంప్‌ఇప్పుడు అమెరికా ఖజానా పరిపుష్టం చేసే పనిలో పడినట్లుంది. గోల్డ్‌కార్డ్ వీసానుప్రవేశపెట్టి 10 మిలియన్ డాలర్ల రుసుం విధించారు.తనకంటూ సొంతంగా ఒకకొత్త క్రిప్టో కరెన్సీని ప్రవేశపెట్టారు. అక్కడితో ఆగకుండా ఇప్పుడు ఖజానా సమృద్ధిగా ఉండాలంటే కొంత మేర కఠిన కార్యాచరణ తప్పదంటూ ఇప్పుడు ట్రంప్ వలసదారులపై మరో భారం మోపారు. అమెరికాలో నివసిస్తున్న విదేశీయులంతా తమ స్వదేశానికి సొమ్ములు పంపించుకుంటేఐదుశాతం సుంకం విధిగా చెల్లించాలి. ఇందుకోసంఅమెరికా ఉభయసభల్లో ప్రత్యేక బిల్లును తెస్తోంది. ఈనెల 12వ తేదీనే ప్రతినిధుల సభలో ఈబిల్లు ప్రతిపాదించారు. బిల్లు అమలుకు వస్తే అంతర్జాతీయ నగదు బదిలీలపై ఐదుశాతం పన్ను విధిస్తారు. అలాగే ప్రామాణిక తగ్గింపును పెంచడం, చిన్న పిల్లలపై పన్ను క్రెడిట్ 2028 వరకూ, 2500 డాలర్లకు పెంచడం ద్వారా 2017 పన్నుకోతలు, ఉద్యోగాల చట్టాన్ని శాశ్వతం చేయాలనే లక్ష్యంతోనే ఈ బిల్లును ప్రవేశపెట్టారు.రెండోసారి అధికారంలోకి వచ్చిన రిపబ్లికన్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాహాటంగానే ఈ చట్టాన్ని 'గ్రేట్' అని వర్ణించారు. ఈనెల 26వ తేదీ మెమమోరియల్ డే ఉన్నందున ఈలోపే ఈ బిల్లు ఆమోదింప చేసుకోవాలని ట్రంప్ యోచనచేస్తుండటం చూస్తే అమెరికాలో నివసించే ప్రతి విదేశీయుడు తన కుటుంబానికి సొమ్ములు పంపిస్తే ఐదుశాతం పన్నులు రూపంలో చెల్లించుకోవాలి. కష్టపడి సంపాదించుకున్న సొమ్ములపై మళ్లీ పన్నులేమిటని ఇప్పటికే ప్రవాసులంతా పెదవి విరుస్తున్నా ట్రంప్ మాత్రం ట్రెజరీ పరిపుష్టం కావాలంటే పన్నులుతప్పవన్న భావనతోనే ఉన్నారు. ఒక్క భారత్‌కే విదేశాలనుంచి ఏటా 8300 కోట్ల డాలర్లు జమలు వస్తున్నాయి. అందులో అత్యధికభాగం అమెరికానుంచే కావడం విశేషం. ఇపుడు కొత్త బిల్లు అమలుకు వస్తే ప్రతి లక్ష రూపాయలకు ఎన్నారైలు ఐదువేల రూపాయలు పన్ను రూపంలో చెల్లించుకోవాలి. భారతీయ రిజర్వు బ్యాంకు నివేదికల ప్రకారం2011 సంవత్సరంలో 55.6బిలియన్ డాలర్ల జమలు భారత్‌కు వచ్చేవి. అదే 2024 నాటికి 118.7 బిలియన్ డాలర్లకు పెరిగాయి.అంటే గత ఏడాది భారత్ అందుకున్న మొత్తం జమలలో అమెరికా నుంచే అత్యధికంగా ఉన్నాయి.అంటే27.7శాతం వాటాతోఉంది. అంటే మొత్తం 32.9 బిలియన్ డాలర్ల జమలకు ఈ 27.7శాతం వాటా సమానంగా ఉంటుంది. అంటే ఐదుశాతం చొప్పున పన్నులు విధిస్తే సుమారు 1.64 బిలియన్ డాలర్లు ప్రవాసులంతా చెల్లించుకోవాలి.గడచిన రెండు దశాబ్దాల నుంచి భారత్ అత్యధిక విదేశీ జమలు రాబట్టుకునే దేశాల్లో మొదటిదిగా ఉంది.

**గన్ని మోహన్**



ట్రంప్

ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం ప్రపంచ స్థాయి చెల్లింపుల్లో భారత్‌కు అత్యధిక వాటా ఉంది. 14శాతం ఉన్నట్లు అంచనావేసింది. గత ఏడాది ఈ జమలు భారత్‌కు 129 బిలియన్ డాలర్లవరకూ వచ్చాయి. ఆతర్వాత మెక్సికో 68 బిలియన్ డాలర్లు, చైనా 48 బిలియన్‌డాలర్లు, ఫిలిప్పీన్స్ 40 బిలియన్ డాలర్లు, పాకిస్థాన్‌కు 33 బిలియన్ డాలర్లు విదేశీ జమలరూపంలో అందాయి. ట్రంప్ ప్రతిపాదించిన ఐదుశాతం సుంకం అమలుకువస్తే ఈ దేశాలకు వెళ్లే జమలన్నింటిపైనా అదనపు భారం పడుతుంది. నిజానికి అమెరికా అంటేనే వలసదార్ల రాజ్యం అన్న పేరుంది. ప్రపంచంలోనే అత్యధిక వలసజనాభా ఉన్నదేశంగా అమెరికా నిలిచింది. ప్రపంచదేశాల నుంచి 53.3 మిలియన్ల మంది నివాసితులు అమెరికాలో ఉపాధి పొందేందుకు వచ్చినవారు, స్థిరనివాసాలు ఏర్పాటుచేసుకుని జీవిస్తున్నవారున్నారు.మొత్తం అమెరికా జనాభాలో వీరు 15.8 శాతం వాటాతోఉన్నారు. అమెరికాలో విదేశీ సంతతి జనాభా 47.78 మిలియన్లకు చేరిందని అమెరికా లెక్కలే చెపుతున్నాయి.అంతకుముందు సం॥ కంటే 1.6 మిలియన్లు పెరిగారు. ఇక ఇతరదేశాలకంటే భారత్‌నుంచి అమెరికాకు వెళ్లి నివసిస్తున్న పౌరులు 5.4మిలియన్లమంది ఉన్నారు. అమెరికా జనాభాలో వీరివాటా 1.6 శాతంగా ఉంది.ట్రంప్ ప్రతిపాదించిన ఐదుశాతం సుంకం అమలుకు వస్తే ప్రతి లక్షకు ఐదువేలు భారత కరెన్సీలో ఎన్నారైలు చెల్లించుకోవాలి.ఈ రూపేణా ట్రంప్ అమెరికా ట్రెజరీని పరిపుష్టం చేయాలన్న బలమైన లక్ష్యంతోఉన్నారు. ప్రవాసుల కారణంగానే అమెరికన్లకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్న భావనఅక్కడి అమెరికన్లలో నెలకొన్న తరుణంలోట్రంప్ విధానాలువారికి ఎంతో ఆమోదయోగ్యంగా కనిపిస్తున్నాయి. కానీ ట్రంప్ వలసదారులపై మరిన్నిఅస్త్రాలు ఎక్కుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్లిష్టకాలంలో భారత్ తనకున్న సంబంధాలను అమెరికావద్ద ప్రస్తావిస్తేతప్ప ప్రవాసులకు ఎదురయ్యే ముప్పు నుంచి తప్పుకోలేని పరిస్థితి ఎదురవుతుంది. ●

# తుర్కియే, అజర్‌బైజాన్‌ల పర్యాటకం కుదేలు



**యేచన్ చంద్రశేఖర్**

పాకిస్థాన్ ప్రేరేపిత లష్కర్ ఏ తోయిషిబా అనుబంధ సంస్థగా చెప్పబడుతున్నది రెజిస్టెంట్ ఫ్రంట్ పహల్గామ్‌లో జరిపిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక పర్యాటకుల ప్రాణాలు పొట్టనబెట్టుకున్న తరువాత భారతదేశం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్" నేపథ్యంలో తుర్కియే అజర్‌బైజాన్‌లు పాకిస్థాన్‌కు బాహాటంగా మద్దతు ప్రకటించాయి. అంతేకాదు, తుర్కియేఅందించిన మూడు నుండి నాలుగు వందల డ్రోన్‌లను భారతదేశంలోని సైనిక పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ ప్రయోగించింది. లడఖ్‌లోని లేహ్ నుండి గుజరాత్‌లోని సర్ క్రీక్‌వరకు మొత్తం పశ్చిమ సరిహద్దులో 36ప్రదేశాలలో భారత గగనతలంలోకి చొరబడి డ్రోన్‌లను ప్రయోగించారని భారత ప్రభుత్వం ప్రత్యేక పత్రికా సమావేశంలో తెలిపింది. పాకిస్థాన్ పంపిన దాదాపు 400 డ్రోన్లలో, చాలా వాటిని భారత సైన్యం సమర్థవంతంగా కూల్చివేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఫోరెన్సిక్ నిపుణుల ప్రాథమిక అధ్యయనం ప్రకారం ఇవి తుర్కియేకి చెందిన 'సిస్ గార్డ్ సోంగర్" డ్రోన్లుగా తేలింది. ఇటీవలి ఘర్షణలలో అజర్‌బైజాన్ పాకిస్థాన్‌కు సైనిక సహాయం అందించినట్లు ప్రత్యక్ష ఆధారాలు లేనప్పటికీ, దౌత్యపరంగా కాశ్మీర్ సమస్యపై ఆ దేశం వైఖరిని బహిరంగంగా సమర్థించింది.భారతదేశం దాడికి పూనుకోక ముందే తుర్కియే వైమానిక దళం విమానం నగరంలో దిగిన కొద్ది రోజులకే తుర్కియే నావికాదళం యుద్ధనౌక కరాచీ ఓడరేవుకు చేరుకుంది. ఇది భారతదేశానికి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. తుర్కియే రాష్ట్ర ప్రసారకర్త టిఆర్‌టి వరల్డ్ భారత వ్యతిరేక కథనాలను విస్తృతం చేస్తోందని, ముఖ్యంగా కాశ్మీర్ పరిస్థితికి సంబంధించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆరోపిస్తూ మే 14, 2025న టిఆర్‌టి వరల్డ్ అధికారిక ఎక్స్ ఖాతాను భారత దేశం బ్లాక్ చేసింది. ఆగస్టు 2019లో ఆర్టికల్ 370 రద్దు సమయంలో తరువాత కూడా అంతర్జాతీయ వేదికలపై, ముఖ్యంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్ పదే పదే కాశ్మీర్ సమస్యను లేవనెత్తిన విషయం మనకు తెలుసు. ఇదిలా ఉంటే, గత ఐదు సంవత్సరాలలో భారత్ తుర్కియే దేశాల మధ్య వాణిజ్యం గణనీయంగా వృద్ధి చెందడంతో పాటు 2022-23లో ద్వైపాక్షిక వాణిజ్యం 13.8 బిలియన్ డాలర్లకు చేరింది. భారత్ నుండి ఎగుమతులు 6.65 బిలియన్ డాలర్లకు తుర్కియే నుండి దిగుమతులు 3.78 బిలియన్ డాలర్లకు చేరుకున్న పరిస్థితులలో భారత్‌కు వ్యతిరేకంగా తుర్కియే పాకిస్థాన్‌తో అంటకాగడాన్ని భారతీయులు జీర్ణించుకోలేకపోయారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసే ప్రమాదముందని తుర్కియే విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొనడంతోపాటు పాకిస్థాన్‌కు సైనిక మద్దతు అందించడం, అజర్‌బైజాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ కూడా ఇస్లామాబాద్‌కు మద్దతుగా పాకిస్థాన్ ప్రజలతో సంఘీభావంగా ఉంటూ, అమాయక బాధితుల కుటుంబాలకు మేము సంతాపం తెలియజేస్తున్నాము,గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాము" అని ఒక ప్రకటన విడుదల చేయడం భారతీయులను తీవ్ర అసహనానికి గురిచేసింది. భారతదేశం,పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో వ్యాపారులు టర్కిష్ ఆపిల్‌లను బహిష్కరించడంతో తుర్కియేని నిషేధించాలనే ధోరణి ఊపందుకుంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌పాక్ మధ్య ఇటీవల తలెత్తిన ఉద్రిక్తతల నడుమ తుర్కియే పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు అందించిన నేపథ్యంలో, దేశవ్యాప్తంగా తుర్కియేని నిషేధించు" అన్న ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ 11.76 టన్నుల ఆపిల్‌లను దిగుమతి చేసుకుంది. ఇందులో పూణే మార్కెట్‌కు రూ.1,000 నుండి 1,200 కోట్ల వరకు దిగుమతి అయ్యాయి. కాగా తుర్కియే పాకిస్థాన్‌కు మద్దతు అందించిన నేపథ్యంలో పూణేలో వ్యాపారులు తుర్కియే ఆపిల్‌లను బహిష్కరించడం ద్వారా నిర్ణయాత్మక చర్య తీసుకున్నారు.





దీంతో స్థానిక మార్కెట్ల నుండి తుర్కియే ఆపిల్‌లు ఒక్కసారిగా అదృశ్యమయ్యాయి. కేవలం వ్యాపారులే కాదు పౌరులు కూడా ఈ ఉద్యమంలో చేరడం గమనార్హం. ఈ బహిష్కరణ నగర పండ్ల మార్కెట్‌ను గణనీయంగా ప్రభావితం చేస్తుందని భావిస్తున్నారు. అంతేకాదు, పూణేలోని వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ కమిటీ మార్కెట్‌లో ఆపిల్ వ్యాపారి సుయోగ్ జెండే ఇటీవలి రోజుల్లో తుర్కియే ఆపిల్‌లకు డిమాండ్ గణనీయంగా తగ్గిందని ధృవీకరించారు. తుర్కియే దిగుమతులకు బదులుగా హిమాచల్,ఉత్తరాఖండ్, ఇరాన్ మరియు ఇతర ప్రాంతాల నుండి ఉత్పత్తులను స్వీకరిస్తున్నామని ఈ నిర్ణయం తమ దేశభక్తికి నిదర్శనం అని ఆయన అన్నారు. స్థానిక వినియోగదారులు కూడా ఈ బహిష్కరణకు మద్దతు తెలుపుతూ మన దగ్గర ఎంచుకోవడానికి చాలా ఆపిల్ రకాలు ఉండగా మన శత్రుదేశానికి మద్దతు అందించే దేశం నుండి మనం ఎందుకు కొనుగోలు చేయాలి?" అని అంటున్నారు. పూణేతో పాటు ముంబై ఇతర ప్రధాన నగరాల్లోని వ్యాపారులు తుర్కియే ఆపిల్స్ నిల్వచేయడం మానేసి, వాటి స్థానంలో ఇరాన్, వాషింగ్టన్, న్యూజిలాండ్ సహా హిమాచల్‌ఉత్తరాఖండ్ వంటి భారతీయ రాష్ట్రాల నుండి ఉత్పత్తులను సేకరిస్తున్నారని టైమ్ ఆఫ్ ఇండియా నివేదిక ఏజెన్సీలను ఉటంకిస్తూతెలిపింది. తుర్కియే ఆపిల్స్ బహిష్కరణ ముమ్మరం కావడంతో, రిటైల్ ఆపిల్ ధరలు కిలోకు రూ. 20నుండి30 దాకా పెరిగినట్లు మరియు 10 కిలోల కార్టన్ల హోల్‌సేల్ ధరలు రూ. 200 నుండి 300 వరకు పెరిగినట్లు తెలుస్తోంది. తుర్కియేను బహిష్కరించండి" అనే హ్యాష్‌ట్యాగ్ తరహా పిలుపు కేవలం సామాజిక మాధ్యమాల ఆగ్రహానికి మాత్రమే పరిమితం కాలేదు. పూణేలోని పండ్ల మార్కెట్లతోపాటు ఇది ఉదయపూర్‌లోని పాలరాయి యార్డుల వరకు దావానలంలా వ్యాపించింది. భారతదేశ పాలరాయి కేంద్రమైన ఉదయపూర్ నుండి తుర్కియే దిగుమతుల పట్ల తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. ఉదయపూర్ మార్బుల్ ప్రాసెసర్స్ అసోసియేషన్, భారతదేశానికి అతిపెద్ద పాలరాయి సరఫరాదారు అయిన టర్కీ నుండి దిగుమతులను పూర్తిగా నిలిపివేయాలని పిలుపునిచ్చిందని ప్రముఖ వార్తా సంస్థ ఏఎన్ఐ నివేదించింది. తుర్కియే పాలరాయిపై నిషేధం కోరుతూ తాము ప్రధానమంత్రికి లేఖ రాసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సురానా ఏఎన్ఐకి తెలిపారు.ప్రతిసంవత్సరం భారతదేశం దిగుమతి చేసుకునే పాలరాయిలో దాదాపు 70శాతం అంటే రూ. 2,500 నుండి 3,000కోట్లకు పైగా విలువైన 14 నుండి 18 లక్షల టన్నుల పాలరాయిని తుర్కియే నుండే సరఫరా అవుతుందని మనలో ఎంతమందికి తెలుసు? ఇటీవలి సంవత్సరాలలో తుర్కియే అజర్‌బైజాన్ రాజధాని బాకుకు భారత పర్యాటకుల తాకిడి బాగా పెరిగింది. తుర్కియే సాంస్కృతిక పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రకారం, 2014లో 119,503 మంది భారతీయ పర్యాటకులు ఆ దేశాన్ని సందర్శించగా, గత సంవత్సరం దాదాపు 62.2మిలియన్ల విదేశీ పర్యాటకులు సందర్శించారని అందులో 3,30,000 మంది భారతీయులు అని,ఇది గత సంవత్సరంతో పోలిస్తే 20.7 శాతం అధికమని తెలిపింది. తమ దేశ పర్యాటకరంగ ఆదాయం 2024లో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 61.1బిలియన్ డాలర్లకు చేరుకుందని, ఇది అంతకు ముందు సంవత్సరం కంటే 8.3శాతం అధికమని తుర్కియే పర్యాటక బోర్డుతెలిపింది. ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం, గత సంవత్సరం తుర్కియే సందర్శించిన భారతీయ సగటు సందర్శకుల ఖర్చు 972 డాలర్లుగా నమోదైంది. ఈ లెక్కన భారత పర్యాటకులు తుర్కియేని బహిష్కరిస్తే, ఆదేశానికి దాదాపు 291.6మిలియన్ డాలర్ల ప్రత్యక్ష నష్టంతో పాటు భారతీయ వివాహాలు, కార్పొరేట్ కార్యక్రమాలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను రద్దు చేసుకుంటే పరోక్షంగా మరింత ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. మరో పక్క, భారతదేశం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సైనిక చర్యను ఖండిస్తూ తుర్కియే అజర్‌బైజాన్ దేశాల విదేశాంగమంత్రిత్వ శాఖలు చేసిన ప్రకటనలను తప్పుబడుతూ, భారతదేశం నుండి తుర్కియే అజర్‌బైజాన్‌లకు ప్రయాణాన్ని బహిష్కరించాలని విస్తృతంగా ఆన్‌లైన్లో ప్రచారం చేపట్టగా అది ఆశించిన ప్రభావాన్ని చూపింది. దేశవ్యాప్తంగా వేలాది మంది తుర్కియే అజర్‌బైజాన్ దేశాలకు తమ ప్రయాణ ప్రణాళికలను రద్దుచేసుకోగా, టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫారమ్‌లు ట్రావెల్ ఆపరేటర్లు ఈ దేశాలకు బుకింగ్‌లను నిలిపివేశారు. ●

# గుంటూరు వార్త





శనివారం గుంటూరులో తిరంగా యాత్రను ప్రారంభించిన కేంద్ర మంత్రి పెమ్మసాని తదితరులు

## అత్తోట హార్దీకి మంత్రి లోకేష్ అభినందన

గుంటూరు, మే 17, ప్రభాతవార్త ప్రతినిధి: గుజరాత్ వడోదరలో ఇటీవల జాతీయ స్థాయి మాస్టర్ స్పెల్లర్ పోటీల్లో ఉతనతమ అవార్డును కైవసం చేసుకున్న అత్తోట హార్దీకి హృదయపూర్వక శుభాభినందనలు అంటూ రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కొల్లూరుకుచెందిన హార్దీ పిన్నవయసులో అసాధారణమైన సవాళ్లను ఎదుర్కొనడంలో ప్రతిభను చాటారని తెలిపారు. హార్దీ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు మంత్రి లోకేష్ అభినందనలు తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

బాపట్ల,మే16,ప్రభాతవార్త: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర సమాచార శాఖ, గృహ నిర్మాణాల శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం వేమూరులో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుతగా వేమూరులోని నందమూరి బసవ తారక రామా బస్ షెల్టర్ లోని

**మంత్రి కొలుసు పార్థసారథి**



ఎన్టీఆర్ విగ్రహానికి జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు వేమూరు శాసనసభ్యులు పూలమాలవేసి నివాళులర్పించారు. బస్సు షెల్టర్ నుండి ఆపరేషన్ సింధూర్ తిరంగా యాత్ర ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ బస్సు షెల్టర్ నుండి రైల్వే గేట్ సెంటర్ వరకు నిర్వహించారు. రైల్వే గేట్ సెంటర్లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు వేమూరు శాసనసభ్యులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ సెంటర్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడ నుండి స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో జిల్లా ఇన్చార్జి మంత్రి, వేమూరు శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, బాపుడా చైర్మన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డును పరిశుభ్రం చేశారు, రైతులకు వ్యవసాయ సాగు



యంత్రాలను అందించారు.పర్యావరణ పరిరక్షణకు గాను చెట్లను నాటారు. డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది మానవహారాన్ని ఏర్పాటు చేశారు. మానవహారం ఏర్పాటు చేసిన సిబ్బంది, జిల్లా అధికారులు మరియు పట్టణ ప్రజలతో ఆయన స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎన్టీఆర్ కళావేదికలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతినెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈనెల ఎండ తీవ్రతను తగ్గించుటకు తీసుకోవాల్సిన చర్యలు అనే అంశంపై నిర్వహించుకుంటున్నామని ఆయన అన్నారు. స్వర్ణ ఆంధ్ర




స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రెండు కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామన్నారు. దేశ సరిహద్దులలో ఆపరేషన్ సింధూర్ లో పాల్గొని ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు,ప్రాణాలకు తెగించి పోరాడిన త్రివిధ దళాలకు అండగా ఉన్నామంటూ తిరంగా ర్యాలీ నిర్వహించడమైనదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత నిబంధనతో, ప్రాముఖ్యతతో రాష్ట్రంలో 175 నియోజకవర్గాలలో ఈరోజు నిర్వహించడమైనదని ఆయన అన్నారు. ఆపరేషన్ సింధూరి కార్యక్రమంలో సాయుధ దళాలు, జవాన్లు చూపిన ధైర్య సాహసాలకు మన దేశ ప్రతిష్టను ఇనుమడించే విధంగా వారు పోరాడిన తీరుకు భారత దేశ ప్రజలందరూ బాసటగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. మేమున్నాం మీ వెనుక అనే ధైర్యాన్ని కలిగించాల్సి ఉందన్నారు. కాల్పుల విరమణ నియమాలను ఉల్లంఘించి పాకిస్తాన్ చేసిన దాడుల్లో 23 సంవత్సరాల మన రాష్ట్ర యువకుడు మురళి నాయక్ వీరమరణం పొందారని ఆయన తెలిపారు. అదేవిధంగా అనేకమంది ఈ దాడుల్లో వీరమరణం పొందారని వారికి నివాళులర్పిస్తూ, వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, బాసటగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ, పెహల్గాం లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు ఆయన నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మన దేశ జవానులు శత్రుదేశానికి గుక్క తిప్పుకోకుండా వారిని పూర్తిస్థాయిలో మెడలు వంచి చాలా బలమైన జవాబు ఇచ్చిందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు పరిపాలన దక్షతో చేపట్టిన కార్యక్రమంలో ముఖ్యమైన కార్యక్రమం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అని ఆయన అన్నారు. మన ఇంటి,వీధి, గ్రామ, పట్టణ, వార్డు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం తో పాటు ఇటీవల పెహల్గాం గ్రామంలో యాత్రికలపై ఉగ్రదాడికి సంబంధించి నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవరాలిని నియోజకవర్గంలో సింధూర్ తిరంగా ర్యాలీగా జరుపుకున్నామని ఆయన అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన విధంగా స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఆయన అన్నారు. ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో మన భావితరాలు ఎదగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు బాపుడా చైర్మన్ శలగల రాజశేఖర్ బాబు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## నిందితులపై చార్జిషీట్ దాఖలు పరచటంలో జాప్యం --బాధితుని ఆవేదన

గుంటూరు విద్య ,మే 17,ప్రభాతవార్త : స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు వంటరి ఏసుబాబు మాదిగ పై కొందరు వ్యక్తులు 2024జూలై 11వ తేదిన కులం పేరుతో నానా దురా ్భషలాడారు.ఆ మేరకు ఏసుబాబు మాదిగ పోలీసులకు ఫిర్యాదు చేశారు దీనితో 193/2024 నెంబరుతో ఎఫ్ఐఆర్ నమోదైంది.కేసు విచారణ జరిగింది,నిందితులను గుర్తించారు.కానీ లాలాపేట పోలీసులు నిందితులపై చార్జిషీటు సకాలంలో దాఖలు చేయకుండా జాప్యం చేయడంపై బాధితుడు ఏసుబాబు మాదిగ ఆవేదన చెందుతున్నారు.ఈ మేరకు ఆయన లాలాపేట డిఎస్పీ కి లిఖితపూర్వక అర్జీ ద్వారా ఏసుబాబు మాదిగ తన ఆవేదనను వక్తంచేశారు.చార్జి షీటును సకాలంలో దాఖలు చేయాలని నిందితుల ద్వారా నాకు ప్రాణహాని ఉందని పోలీసులకు గతంలో విన్నవించుకున్నప్పుడు,వారు విచారణలో కూడా ప్రాణహాని ఉందనే విషయం నిజమని రుజువైన విషయాన్ని ఆ లేఖలో ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు.చార్టషీటు విషయంలో త్వరితగతిన తగిన చర్యలు తీసుకోవాలని తగు న్యాయం చేయాలని ఏసుబాబు మాదిగ ఈ సందర్భంగా డిఎస్పీకి విన్నవించుకున్నారు.

# దేశంలోనే తెనాలి మునిసిపాలిటీ గర్వకారణం

## -పారిశుద్ధ్యంపై అవగాహన పెంచటమే లక్ష్యం
## -తెనాలిలో 'స్వచ్ఛ ఆంధ్ర'లో మంత్రి 'నాదెండ్ల'

గుంటూరు, మే 17, ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతోనే అందరం కలిసికట్టుగా చేసే కార్యక్రమం 'స్వచ్ఛాంధ్ర' అని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 7 గంటలకు తెనాలి పట్టణం బుర్రిపాలెం రోడ్డులోని శివాజీ చౌక్ వద్ద నుంచి బయలు దేరి రాములవారి గుడి మీదుగా మహాత్మాగాంధీ కూరగాయలమార్కెట్ వరకు మునిసిపల్ అధికారులు, సిబ్బంది చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను మంత్రి పరిశీలించారు. అవ్వతాత, అమ్మ ఎలా ఉన్నారు? అంటూ మంత్రి నాదెండ్ల ప్రతిఒక్కరనినీ పలకరిస్తూ వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. తెనాలి బండ్లమూడి వారి వీధిలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మంత్రి స్వయంగా సైడు కాలువల్లోని చెత్తను తొలగించారు. మహాత్మా గాంధీ కూరగాయల మార్కెట్ , చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల వద్ద నుంచి రావి టవర్స్ వరకు మునిసిపల్ సిబ్బంది చేపడుతున్న పారిశుద్ధ్య పనులను మంత్రి పరిశీలించారు. ప్రతిఒక్కరూ బాధ్యతతో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు. తెనాలి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. పట్టణంలోని డంపింగ్‌యార్డును సంవత్సరాల నుంచి నిర్లక్ష్యంగా వదిలేశారని, దాన్ని అక్కడ నుంచి



మునిసిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య పనుల్లో మంత్రి నాదెండ్ల



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తరలించేందుకు గాను ప్రతి రోజు 75 నుంచి 95 మెట్రిక్ టన్నుల తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎపుడూ అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునే ఉద్దేశ్యంతో ప్రతివారంలో ఒక్కో సచివాలయం పరిధిలో అధికారులు ఇంటింటికీ వెళ్లాలని, వారికి మార్గదర్శకం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. చెత్తనుంచి సంపద సృష్టించటం ద్వారా సర్క్యులర్ ఎకానమీ సాధ్యం అవుతుందని చెప్పారు. స్వర్ణ ఆంధ్ర-2047 సంకల్పంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రతినెలా 3వ శనివారం రోజు జరుపుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రతి కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు నెలనెలా ఒక్క థీమ్ ఎంచుకుని నిర్వహిస్తామని మంత్రి నాదెండ్ల తెలిపారు. మార్పు ఒక్కరోజు కోసం కాదని నిరంతర ప్రక్రియలా కొనసాగాలన్నారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలు, యువత, స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎక్కడికక్కడ



వార్డుల్లో పర్యటనలో భాగంగా వృద్ధురాలిని పరామర్శిస్తున్న మంత్రి నాదెండ్ల


ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రయాణం నిరంతరం సాగాలని, ఇది ఒక్కరోజు కార్యక్రమం కాదని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. 'స్వర్ణ ఆంధ్ర-2047' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతిఒక్కరూ భాగస్వామిగా మారాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు.

## నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఏపి ఈ ఏపి సెట్ పరీక్షలు

గుంటూరు విద్య,మే 17,ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా ఏపి ఈఏపి సెట్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి.అగ్రికల్చర్ ఫార్మసీ విభాగాలకు మే 19,20 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి.ఇంజనీరింగ్ విభాగానికి 21వ తేది నుంచి 27వ తేది వరకు మొత్తం 14సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి.ఈ పరీక్షలకు మొత్తం 3,62,418మంది హాజరుకానున్నారు.వీరిలో వ్యవసాయం ఫార్మసీ కోర్సులకు సంబంధించి 81,814మంది, ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి 2,80,578మంది,రెండింటికి సంబంధించి 912మంది విద్యార్థులు హాజరుకానున్నారు.వీరి కొరకు 143పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం సెషన్ 9నుంచి 12గంటల వరకు,మధ్యాహ్నం సెషన్ 2నుంచి 5గంటల వరకు జరగనున్నాయి.విద్యార్థులను పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందుగానే ఆయా పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతిస్తారు.జెఎన్‌టియుకె ముచ్చటగా ఏపిఈ ఏపి సెట్టును తొమ్మిదోసారి నిర్వహిస్తుంది.

## మహాప్రస్థాన సేవాసమితి సహకారంతో గ్యాస్ ఆధారిత దహణ వాటిక ఏర్పాటు


గుంటూరు తూర్పు, మే 17 ప్రభాతవార్త : మహాప్రస్థాన సేవాసమితి స్ఫూర్తితో నగరంలోని స్మశానవాటికలలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



అన్నారు. శనివారం బొంగరాల బీడులోని హిందూ స్మశానవాటికలో ఏర్పాటు చేసిన గ్యాస్ ఆధారిత దహన వాటికను, ఫ్రీజర్ రూమును నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ స్మశానవాటిలో ఆధునిక వసతులను ఏర్పాటు చేశారన్నారు. బొంగరాలబీడులో రూ.99 లక్షలతో దాతల సహకారంతో గ్యాస్ ఆధారిత దహణ వాటికను ఆధునిక వసతులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్.సజీల, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఈఈ సుందర్‌రామిరెడ్డి, వై.లక్ష్మణరావు, అంకమ్మచౌదరి, విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకు భరోసా జనసేన సభ్యత్వ నమోదు : బోనబోయిన

గుంటూరు తూర్పు, మే 17 ప్రభాతవార్త : జనసేనపార్టీ సభ్యత్వ నమోదుకు సంబంధించిన కిట్లు పంపిణీ కార్యక్రమం జనసేన పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ



ఇన్‌ఛార్జి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ దేశంలో ఏ రాజకీయ పార్టీ కూడా చేయని విధంగా కార్యకర్తల సంక్షేమాన్ని ఆలోచించి ప్రతి కార్యకర్త కుటుంబానికి భరోసా విధంగా సభ్యత్వ నమోదుతో పాటు రూ.5 లక్షల బీమా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ప్రతి కార్యకర్తకు భరోసా నింపే విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని రూపొందించిన విధానాన్ని చూస్తేనే పవన్‌కళ్యాణ్ కి కార్యకర్తల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఎటువంటిదో తెలియజేస్తుందన్నారు. వాలంటీర్లు అందరూ ఎంత చక్కగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారో అదే విధంగా కిట్ల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయాలని గాదె వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షులు, జనసేన పార్టీ నగర నాయకులు, జిల్లా కమిటీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## తిరంగా యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు తూర్పు, మే 17 ప్రభాతవార్త : తిరంగా యాత్ర కార్యక్రమాన్ని కేంద్ర సహాయకమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెనాలిలో శనివారం ప్రారంభించారు. బిజెపి రాష్ట్ర సెక్రటరీ నూకల మధుకర్, పౌరసరఫరాలశాఖామంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్,



ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, జిల్లా బిజెపి అధ్యక్షులు తిరుపతిరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర సహాయ కమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ భారతదేశాన్ని భయపెట్టాలని, ఐక్యతను చెడగొట్టాలని ఉగ్రవాదులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టామన్నారు. అల్లర్ల ద్వారా మత విద్వేషాలను రెచ్చగొట్టడం దారుణమన్నారు. దృఢ సంకల్పంతో ప్రధాని నరేంద్రమోడీ ముందుకెళ్తున్నారని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ అందరికీ ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వల్లూరి జయప్రకాష్, గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో యుద్ధప్రాతిపదికన సౌకర్యాలు: పెమ్మసాని

గుంటూరు తూర్పు, మే 17 ప్రభాతవార్త : గుంటూరు జిజిహెచ్‌లో యుద్ధప్రాతిపదికన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కేంద్ర సహాయకమంత్రి పెమ్మసాని చంద్రశేకర్ అన్నారు. శనివారం జరిగిన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్యశాలలో 60 ఏసిలు కావాలని, శంకర్ విలాస్ నిర్మాణంలో తొలగించిన ప్రహరీగోడ నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. వీల్‌చైర్స్, ఎలక్ట్రికల్ ప్యానల్స్‌ను అందించాలని హాస్పటల్ సిబ్బంది కోరారు. అలాగే 150 బెడ్స్ ఉన్న క్యాన్సర్ హాస్పటల్‌ను విస్తృతం చేస్తున్నామన్నారు. తులసి రామచంద్రప్రభు అందించిన సర్వీస్ బ్లాక్ త్వరలో శంఖుస్థాపన చేస్తామన్నారు. నూరుశాతం ఆహార పదార్థాలు హాస్పటల్‌లోనే అందించాలన్నారు. వీల్‌చైర్స్‌ను దాతలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్ అహ్మద్, బి.రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ భార్గవతేజ, హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ఎస్.వి.రమణ, డిఎం అండ్ హెచ్ఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS

FOR SALE

★ East facing 1 BHK G+2 Floor, 100 Sq.yards Independent House Sale in Bikshavati Bazaar, Tenali. 8919486321.

(Ro.No.6103)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

పల్నాడు జిల్లా వార్త



## వైసిపి హయాంలో జరిగిన మున్సిపల్ ఉద్యోగుల అవినీతిపై టిడిపి కౌన్సిలర్ల పోరాట ఫలితమే

# 10మంది ఉద్యోగుల సస్పెన్షన్ : టిడిపి కౌన్సిలర్ల బృందం

చిలకలూరిపేట,మే17,ప్రభాతవార్త: వైసిపి ప్రభుత్వ హయంలో చిలకలూరిపేట మున్సిపాలిటిలో మాజీమంత్రి విడదల రజిని మార్గదర్శకత్వంలో వారి వ్యక్తిగత సహాయకులు, వారి కుటుంబసభ్యులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలలో కీలకమైన స్థానాలలో వారికి చెందిన ఇక్కుర్తి గంగాభవాని, గురుబ్రహ్మంను నియమించారని టిడిపి కౌన్సిలర్ల బృందం శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. వీరిలో గంగాభవాని పురపాలక సంఘానికి జమ కాబడిన ప్రజాధనాన్ని కొల్లగొట్టి స్వంత అవసరాలకు దారి మళ్లించారు. మొత్తం రూ34లక్షల 397లను వారి స్వంతానికి వాడుకున్నారు. ఈ విషయంపై ప్రతిపక్ష టిడిపి నాయకుడు గంగా శ్రీనివాసరావు, టిడిపి కౌన్సిలర్లు జంగా సుజాత, కొత్తకుమారి, పాములపాటి శివకుమారి, కూనల ప్రమీల, కంచర్ల కరుణ, రాయని హరిత, కె లక్ష్మీతిరుమలలు కౌన్సిల్ సమావేశాలలో పలుమార్లు దారిమళ్లిన సోమ్ముపై ఆరోపణలు చేసి ఉన్నతాధికారులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమీషనర్‌కు స్వయాన అప్పుడు వైసిపిలో ఉన్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కూడా దీనిపై విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. కమీషనర్ సమాధానం తెలుపుతూ విచారణ జరిపిస్తాము కానీ, ఆరోపిస్తున్న స్థాయిలో దుర్వినియోగం కాలేదని, ఏది ఏమైనా దుర్వినియోగమైన ప్రజాధనాన్ని తిరిగి మున్సిపల్ ఖజానాలో జమచేయిస్తామని భాద్యులపై చర్యలు తీసుకుంటామని, విచారణ జరిపిస్తామని సమావేశంలో ప్రకటించారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే విడదల రజిని వారి మరిది గోపిలు జోక్యం చేసుకొని అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా నిలిపివేశారు. తదుపరి జరిగిన రెండు మూడు కౌన్సిల్ సమావేశాలలో దానికి సంబందించిన ఊసే లేకపోవడంతో అప్పటి పల్నాడుజిల్లా జాయింట్ కలెక్టర్ ఎ శ్యాం ప్రసాద్‌కు గ్రీవెన్స్‌లో పిర్యాదు చేసినా నాటి వైసిపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని టిడిపి కౌన్సిలర్లు తెలిపారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ఘటనకు సంబంధించి నేడు పురపాలక సంఘంలో ఎన్నడూ లేనివిధంగా 10మంది ద్యోగులు, 5గురు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇరువురు ఉద్యోగులు చేసిన అవినీతి నేడు ఇతర అధికారుల మెడకు చుట్టుకుంది. 10మంది మున్సిపల్ ఉద్యోగులు ఈ సంఘటనలో సస్పెండ్ కాగా 5గురు అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నది. చిలకలూరిపేట మున్సిపల్ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున అధికారులపై చర్యలు తీసుకున్న ఘటనలు ఇప్పటివరకు జరగలేదు. మాజీమంత్రి విడదల రజిని పాపాల పుట్ట పగిలి ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని, దీంట్లో భాగస్వామ్యులైన అధికారులు తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని అన్నారు. మాజీమంత్రి రజిని అధికారాన్ని అడ్డుపెట్టుకొని రైతులను, దళితులనుమోసగించి సహజ వనరులను దోపిడి చేయడమే కాకుండా, మున్సిపల్ ఖజానాకు జమకావాల్సిన ప్రజాధనాన్ని దారి మళ్లించి తమ ఖజానాను నింపుకున్నారని టిడిపి కౌన్సిలర్లు ఆరోపించారు. తప్పు చేయని అధికారులు భయపడవలసిన అవసరం లేదని, నిజాయితీగా పనిచేసే అధికారులకు తమ నాయకుడు ప్రత్తిపాటి అండగా నిలుస్తారని వారు తెలిపారు. మున్సిపల్ ఆస్థుల తాకట్టు వ్యవహారంపై కూడా విచారణ కోరనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.



జాయింట్ కలెక్టర్ ఎ శ్యాం ప్రసాద్‌కు మున్సిపల్ ఉద్యోగుల అవినీతిపై పిర్యాదు చేస్తున్న టిడిపి కౌన్సిలర్లు (ఫైల్ )



కలెక్టర్ కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి కౌన్సిలర్లు ( ఫైల్ ఫోటో)

## సిఆర్ క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ

చిలకలూరిపేట,మే17,ప్రభాతవార్త: సిఆర్‌క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని సిఆర్‌క్లబ్ ఓపెన్ థియేటర్‌లో శుక్రవారం రాత్రి ఉభయ తెలుగురాష్ట్రాల నాటికపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ నాటిక పోటీలను చిలకలూరిపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు, ఒయాసిస్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ జ్యోతి ప్రజ్వలను చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఆర్ క్లబ్ ఉపాధ్యక్షులు, చిలకలూరిపేట కళాపరిషత్ అధ్యక్షులు చెరుకూరి కాంతయ్య, సిఆర్ క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, టివి, రంగస్థల నటులు మల్లాది శివన్నారాయణ, టివి రంగస్థల నటులు జరుగుల రామారావు, సిఆర్ క్లబ్ కోశాధికారి మక్కెన నరసింహారావు, కళాకారులు షేక్ జమాల్‌భాషా, గోరంట్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మూడు నాటికలను వివిధ సంస్థల ఆధ్వుర్యంలో ప్రదర్శించారు. తొలి నాటికగా రైతే రాజు నాటికను ప్రదర్శించారు. ఈ నాటిక ప్రధానాంశం టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందినా, మనిషి జీవించడానికి పిడికెడు ఆహారం అవసరం, దానిని పండించే రైతు పడే ఆవేదనకు తార్కాణం రైతే రాజు నాటిక. దేశాన్ని కాపాడే జవాన్, దేశ ప్రజల కడుపునింపే కిసాన్, వీరిద్దరు భరతమాతకు రెండు కళ్లలాంటి వారు. కల్తీ విత్తనాలు, మందులు, మద్దతుధర మోసాలు, ప్రకృతి విపత్తులు, ఇవన్నీ అన్నదాతకు శత్రువులే వీటన్నింటిపై పోరాడి పంట పండించిన, దానికి ధర నిర్ణయించుకోలేని స్థితి. రైతులు జీవితం, బాధలు, సమాజంలో వారి స్థానం, పాలకులు, ప్రజలు వారిపై చూపుతున్న నిర్లక్ష్యం గురించి ప్రశ్నించే కథాంశమే రైతే రాజు నాటిక. కంచర్ల సూర్యప్రకాష్ రచన, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన ఈ నాటికను కళాంజలి హైదరాబాద్ వారు ప్రదర్శించారు. రెండవ నాటికగా మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్, చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం నాటిక. ఈ నాటిక ఇతివృత్తం. తన బిడ్డను డాక్టర్, ఇంజనీర్‌ని కాకుండా దేశానికి అన్నం పెట్టే రైతును చేస్తానంటూ ఓ కన్నతల్లి తీసుకున్న నిర్ణయాన్ని నిరూపించే మా ఇంట్లో మహాభారతం నాటిక. విద్య,ఉద్యోగం లేని ఓ యువకుడికి వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తి 40 ఎకరాలు ఉన్నా, ఉద్యోగం లేదని సంబంధాలు కుదరవు. దీనితో పెళ్లిళ్ల పేరయ్య ఆయుధాలతో కులాంతర వివాహం చేస్తాడు. ఆ తరువాత విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆగ్రహంతో కులంకాదు, గుణం ముఖ్యమనే సందేశాన్ని అందిస్తారు. యువకుడు వాసును వివాహం చేసుకున్న నవీనా తన బిడ్డను వ్యవసాయ రంగంలోకి నడిపించి రైతును చేసే సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తానని చెప్పడంతో ఈ నాటిక ముగిస్తుంది. ఈ నాటికకు మద్దుకూరి రవింద్రబాబు రచన, దర్శకత్వం వహించారు.

మూడవ నాటికగా మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మస్వరూపం నాటికను ప్రదర్శించారు. ఈ నాటిక ఇతివృత్తం. నిర్మలమైన మనసుంటే ప్రపంచమంతా ప్రేమమయంగా నిలయంగా దర్శనమిస్తుందని చాటి చెప్పే కథాంశమే బ్రహ్మస్వరూపం నాటిక. ప్రతిభాక క్షణ రూపంలో విధివిధానం కలిసొచ్చి కాంతియుత జీవితంలో ఊహించని కష్టాలు వచ్చినప్పుడు యుగమేదైనా, ధర్మస్థానకు సాక్షాత్తు బ్రహ్మస్వరూపుడే స్వయంగా ప్రత్యక్షమవుతాడని గొప్ప సందేశంతో ఈ నాటిక ముగిస్తుంది. ఈ మూడు నాటికలను చిలకలూరిపేట ప్రాంతంలోని కళాభిమానులు, కళాపోషకులు ఆసాంతం తిలకించి ప్రశంసలు కురిపించారు.









## రోటరి ఉచిత వైద్యశాలకు రూ 15వేలు విరాళం అందించిన రోటరి డైరెక్టర్ తేళ్ల సుబ్బారావు



చిలకలూరిపేట,మే17,ప్రభాతవార్త: చిలకలూరిపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశాలకు మందుల కొనుగోలు నిమిత్తం రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు శనివారం రూ15వేలు విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఉచిత ఆరోగ్యకేంద్ర నిర్వాహకులు దండా లక్ష్మీనారాయణకు తేళ్ల సుబ్బారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆళ్ల వేమనరెడ్డి, ఉప్పుటూరి ప్రసాద్, క్లబ్ ట్రైనర్ గళ్ల సాంబశివరావు, క్లబ్ మాజీ అధ్యక్షులు కందిమళ్ల అంజిబాబులు పాల్గొన్నారు.

## క్లీన్ అండ్ గ్రీన్‌గా నరసరావుపేటే లక్ష్యం : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, మే 17 ప్రభాతవార్త : జిల్లా కేంద్రమైన నరసరావుపేటను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచడమే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛఆంధ్ర - స్వర్ణఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు చేసిన ర్యాలీని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ జశ్వంత్‌రావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న చలివేంద్రంలో మంచినీటి పంపిణీతో పాటు మజ్జిగ పంపిణీ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సాంప్రదాయేతర శక్తివనరుల వినియోగం పెంచుకోవాలన్నారు. మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన వాతావరణం కలుగుతుందన్నారు. అదే విధంగా మున్సిపల్ కమిషనర్ జశ్వంత్‌రావు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను బహిష్కరించాలన్నారు. పర్యావరణహితమైన జూట్ బ్యాగులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సభ్యులు, ఆర్.పి.లు., మున్సిపల్ ఇంజనీర్, డిఈ, టిపిఓ, సచివాలయం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



## శిక్షణా తరగతులను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్



నరసరావుపేట, మే 17 ప్రభాతవార్త : వేసవి శిక్షణా తరగతులను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. వేసవి శిక్షణా శిబిరాలకు అవసరమైన క్రీడా సామాగ్రిని క్రీడాకారులకు కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం కలెక్టరేట్‌లో అందజేశారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జిల్లా క్యాంప్ ఇన్‌ఛార్జిలకు శిక్షణా శిబిరాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. యువత శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉండేందుకు శిబిరాలు దోహదపడతాయన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ప్రతిభ చూపినవారు జాతీయస్థాయి క్రీడలలో పాల్గొని పతకాలు సాధించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉండే ప్రతిభావంతులను వెలికి తీసేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు తెలియజేశారు. క్యాంప్ ఇన్‌ఛార్జిలతో పాటు కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర - స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ

నరసరావుపేట, మే 17 ప్రభాతవార్త : జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ మహాత్మాగాంధీ, వెల్ఫేర్ ఆర్.ఐ. ఎల్.గోపినాథ్, హోంగార్డు ఆర్.ఐ. ఎస్.కృష్ణ, యువరాజ్ పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ విధులు నిర్వహించే చోట పరిశుభ్రంగా ఉంచితే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. శ్రమదాన కార్యక్రమాలలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఖచ్చితంగా పాల్గొనాలని సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో అవరణలలో వ్యర్థాలను తొలగించాలని, అవగాహన పెంచేలా కార్యక్రమాలు ఉండాలని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అన్నారు.



## మండలంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర ప్రారంభించిన ఎంపిడిఓ



నరసరావుపేట, మే 17 ప్రభాతవార్త : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వచ్ఛంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపిడిఓ టి.వి.కృష్ణకుమారి ఆధ్వర్య ంలో నిర్వహించారు. అల్లూరివారిపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఎంపిడిఓ కృష్ణకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. వేసవికాలంలో రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతల నుండి తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా టోపీ ధరించడం, అత్యవసర పనులకు సంబంధించి ఉదయాన్నే కార్యక్రమాలను పూర్తి చేసుకోవాలని ఎంపిడిఓ టి.వి. కృష్ణకుమారి సూచించారు. డిప్యూటీ ఎంపిడిఓ నాగానంద్, ఎస్‌బిఎం ఎం.ఆర్.సి. టి.అయ్యప్పరెడ్డి, పంచాయితీ కార్యదర్శి అశోక్, గ్రామ పెద్దలు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన

నరసరావుపేట టౌన్, మే 17 ప్రభాతవార్త : హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కళాజాతర బృందాలు కార్యక్రమాన్ని నిర్వహించాయి. గాయత్రి కల్చరల్ సొసైటీ, నాగరాజు కళాజాత బృందం బస్టాండ్ ఆవరణలో హెచ్‌ఐవిపై అవగాహన కల్పిస్తూ నాటక ప్రదర్శన చేశారు. ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. 2017 నుండి ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.ఆనంద్‌బెంజిమెన్ అన్నారు. డిఎస్ఆర్‌సి కౌన్సిలర్స్ వనజాక్షి, ఎన్జీవోస్ ఉదయ్‌రాజ్, మీరా, మేరీ, శివరాజు, నాగలక్ష్మి, జయ, ఈశ్వర్, కళాజాత బృంద సభ్యులు పాల్గొన్నారు.

## ఈశ్వర్ కళాశాల ఆధ్వర్యంలో నీరు - మీరు కార్యక్రమం

నరసరావుపేట టౌన్, మే 17 ప్రభాతవార్త : ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నీరు - మీరు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కళాశాల కార్యదర్శి కరీమ్, డైరెక్టర్ మస్తాన్‌షరీఫ్‌లు మాట్లాడుతూ నీటి వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రచారం చేసినట్లు తెలియజేశారు. సివిల్, అగ్రికల్చర్, మెకానిక్ విభాగాల విద్యార్థులు గ్రామంలో మొక్కలు నాటి వర్షపునీటి సేకరణ, కాలుష్య నివారణపై వివిధ అంశాలను వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

## నగల షాపులో బంగారం చోరీ

నరసరావుపేట క్రైం, మే 17 ప్రభాతవార్త : ప్రముఖ నగల షాపులో గుర్తు తెలియని ముగ్గురు మహిళలు బంగారు నగలను చోరీ చేశారు. సిసిపుటేజ్‌లలో చోరీ దృశ్యాలు వైరల్‌గా మారాయి. ముగ్గురు మహిళలు షాపులోకి ప్రవేశించి కేడియం కమ్మలు, బుట్టలు కావాలని, మోడల్స్ చూపాలని సిబ్బందిని కోరారు. సిబ్బంది మోడల్స్ చూపే సమయంలో కేడియం కమ్మలను బుట్టలతో సహా మాటల్లో పెట్టి కాజేశారు. నాన్ కేడియం కమ్మలను కొట్టేసిన కమ్మల స్థానంలో పెట్టి అక్కడి నుండి పరారయ్యారు. నెంబర్ ప్లేట్ లేని ఆటోలో ఆ ముగ్గురు మహిళలు వెళ్ళడంతో ఈ ముఠా చోరీలకు పాల్పడేవారుగా యజమానులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

యడ్లపాడు, మే 17, ప్రభాతవార్త : ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతిరోజు మీ ఇంటి ముందుకు వచ్చే క్లాప్ మిత్రాలకు తడిచెత్త, పోడిచెత్త ఇవ్వాలని గ్రామాలలో ఎండవేడి తగ్గించటానికి వాతావరణ సమతుల్యమునకు ఎక్కువగా మొక్కలను నాటాలని, గృహాములు, కార్యాలయ ముల కప్పులపై కూలెంట్ తెలుపు పేయింటు వేసుకోనవలెనని, పక్షులు, పశువులకు వేసవి కాలములో త్రాగునీరు కొరకు తొట్లు, నీటితో ఉంచిన గిన్నెలు ఏర్పాటు చేయవలెనని, ఎండవేడిమి తట్టుకొనేలా కాటన్ దుస్తులు ధరించాలని జిల్లా గ్రామ పంచాయితీ అధికారి నాగేశ్వరనాయక్ తెలిపారు. యడ్లపాడు పంచాయితీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన స్వర్ణ అంధ్ర సచ్చ అంధ్ర ప్రోగ్రాం బీట్ దా హీట్ థీమ్ కార్యక్రమంలో అయన ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమములో భాగంగా గ్రామంలోని విద్యార్థులకు బీట్ దా హీట్ వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు. స్థానిక ప్రజలతో ర్యాలీ మరియు స్వచ్ఛ అంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. స్థానికంగా ఏర్పాటు చేయబడిన చలివేంద్రం మరియు చెత్త నుండి సంపద తయారీ కేంద్రంను సందర్శించి అక్కడ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రహ్మణ్యం, ఎంపీడివో హేమలతాదేవి, ఇవోపిఆర్‌డి జాకీర్ హుస్సేన్, గ్రామ సర్పంచ్ కారుచోల హేమ, త్రాగునీటి సంఘం అధ్యక్షులు రాఘవయ్య, ఉపసర్పంచ్ హరిబాబు, స్థానిక వైద్యులు భరద్వాజ్, పంచాయితీ సెక్రటరీ శశికళ, ఎస్‌హెచ్‌జి మహిళలు, అశావర్కర్‌లు, గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## మున్సిపాలిటీలో అవినీతి చేసిన ఉద్యోగులపై చర్యలు చేపట్టిన ప్రభుత్వ ఉన్నతాధికారులు :

### విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, టిడిపి నాయకులు



చిలకలూరిపేట,మే17,ప్రభాతవార్త: వైసిపి ప్రభుత్వ హయంలో చిలకలూరిపేట మున్సిపాలిటీలో మున్సిపల్ షాపుల అద్దె వసూలు చెల్లింపులలో అధికారులకు తెలియకుండా కాంట్రాక్ట్ పద్దతిపై నియమితులైన ఇద్దరు ఉద్యోగులు మున్సిపల్ షాపుల అద్దెదారులు చెల్లించిన సొమ్మును మున్సిపల్ ఖజానాకు జమచేయకుండా రూ 34లక్షల 397లు తమ స్వంత అవసరాలకు వాడుకున్నట్లు తేలిందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని శనివారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలియచేశారు. ఈ అవినీతికి పాల్పడిన గంగా భవానినుంచి రూ13లక్షలు రికవరీ చేసినట్లు, మిగిలిన మొత్తాన్ని కూడా ఆమె వద్దనుంచి ప్రభుత్వం రికవరీ చేయడమే కాకుండా చేసిన తప్పుకు తగిన రీతిలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని చైర్మన్ వివరించారు. గంగా భవానిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే క్రిమినల్ కేసు పెట్టినట్లు చైర్మన్ తెలిపారు. ఈ అవినీతిపై అప్పుడు కౌన్సిల్ సమావేశాలలో పలు మార్లు తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు గంగా శ్రీనివాసరావుతో పాటు ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు తన దృష్టికి తేవడం జరిగిందన్నారు. దీనిపై విచారణ జరపాలను తాను సమావేశంలో మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించడం జరిగిందని ఈ సందర్భంగా వివరించారు. ఈ పన్నును వసూలుచేసే ఉద్యోగి డబ్బు చెల్లించినవారికి డమ్మీ రశీదులు ఇవ్వడం జరగటంతో కొంతకాలం అధికారుల దృష్టికి రాలేదని అన్నారు. ఆ తరువాత దానిని టిడిపి కౌన్సిలర్లు గుర్తించి రూ34.397లక్షలు దుర్వినియోగం అయినట్లు కౌన్సిల్ సమావేశంలో చెప్పడం జరిగిందన్నారు. దీనిపై అధికారులు సరిగా నిర్ణయం తీసుకోకపోవడంతో, టిడిపి కౌన్సిలర్లు అప్పటి జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై మున్సిపల్ ఉన్నతాధికారులు ఆ కాలంలో సరిగా, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ విషయాన్ని పూర్తిస్థాయిలో విచారణ చేసి దీనికి భాద్యులైన 10మంది ఉద్యోగులను సెస్పెండ్ చేయడం జరిగిందన్నారు. 5గురు రాష్ట్రస్థాయి ఉద్యోగులపై కూడా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులు చేసిన అవినీతి కారణంగా 10మంది ఉద్యోగులు, 5గురు అధికారులు బలి కావలసి వచ్చిందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో టిడిపి అధికార ప్రతినిధి మురకొండ మల్లిఖార్జునరావు, టిడిపి నాయకులు షేక్ అజారుద్దిన్, షేక్ జానీభాషాలు పాల్గొన్నారు.

## నాదెండ్లలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

నాదెండ్ల,మే17,ప్రభాతవార్త: నాదెండ్ల గ్రామంలో మండల తహసిల్దార్, మండల యంపిడిఓల ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై గ్రామంలో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఆలపాటి వెంకటరమణ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పలు అంశాలను ప్రజలకు వివరించారు. ఎండ తీవ్రత, వడగాల్పుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. పశువుల తొట్టెలకు నీళ్ల నింపటం, చలివేంద్రాల సందర్శన, నిర్వహణ పరిశీలన, మొక్కలు నాటడం, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞతో పాటు పలు కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి నిర్మల లక్ష్మీకుమారి, గ్రామ సర్పంచ్ మొగిలి నాగలక్ష్మీ, పంచాయితీ కార్యదర్శి మక్కెన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ

చిలకలూరిపేట,మే17,ప్రభాతవార్త: రాజకీయాలలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తకు అండగా ఉంటున్న పార్టీ జనసేన పార్టీ అని ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం చిలకలూరిపేట సమన్వయకర్త తోట రాజారమేష్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలోని రజక కమ్యూనిటీ హాల్‌నందు నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పార్టీలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటున్నారని, నీతి నిజాయితీలతో పార్టీ నడిపిస్తున్న గొప్ప నాయకుడు అని అన్నారు. అనంతరం క్రియాశీలక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, క్రీయాశీలక సభ్యులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో సంక్షేమ పండుగ : నాగోతు శౌరయ్య



నరసరావుపేట, మే 17 ప్రభాతవార్త : రాష్ట్రంలో సంక్షేమ పథకాల పండుగ ప్రారంభమైందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపిపి నాగోతు శౌరయ్య అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జూన్ 12వ తేదీ నుండి సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున ప్రజలకు అందించేందుకు పొలిట్‌బ్యూరో, మంత్రివర్గ సమావేశాలలో ఇప్పటికే చంద్రబాబునాయుడు ప్రకటించారని తెలిపారు. జూన్ 12న లక్ష మందికి వితంతువులకు పింఛన్లు, బడులు తెరిచే లోగా తల్లుల ఖాతాలలో తల్లికి వందనం, డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా మూడు గ్యాస్ సిలెండర్ల డబ్బులకు సంబంధించి ముందుగానే డబ్బులు ఎకౌంట్‌లకు జమ కావడం జరుగుతుందని తెలియజేశారు. త్వరలోనే సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను సైతం విడుదల చేస్తామని ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య వివరించారు.

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పరామర్శ



నరసరావుపేట, మే 17 ప్రభాతవార్త : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గంలో శనివారం పర్యటించారు. స్థానిక లింగంగుంట్ల పరిధిలోని గాంధీనగర్‌లో మృతిచెందిన దండా సత్యనారాయణరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబసభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ఇవ్వాలన్నారు. శానిటనీ ఇన్‌స్పెక్టర్‌గా సత్యనారాయణరెడ్డి అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

# రేషన్ సక్రమంగా ఇవ్వకపోతే చర్యలు : తహశీల్దారు

మాచర్ల, మే 17 ప్రభాతవార్త: ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే రేషన్ సరకులు సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు తప్పవని చౌకడిపో డీలర్లను తహశీల్దారు కిరణ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల



నియోజకవర్గ స్థాయిలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సాక్షాత్తు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి రేషన్ సరకులు ప్రజలకు సక్రమంగా అందడం లేదని జిల్లా కలెక్టరు దృష్టికి తెచ్చినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో డీలర్లకు పలు సూచనలు చేశారు. రేషన్ పంపిణీ చేయలేదని తమకు ఫిర్యాదు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్ల స్థలాలకు అర్హులు అర్జీ పెట్టుకోవచ్చన్నారు. ఆయా సచివాలయాల్లో అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. రేషన్‌కార్డులో మార్పులు చేర్పుల కోసం ప్రభుత్వం అవకాశమిచ్చిందన్నారు. నూతన కార్డు కోసం, ఇప్పటికే ఉన్న కార్డులో అదనంగా సభ్యుల చేర్పులు చేసుకోవచ్చన్నారు. మరణించిన, వివాహం అయిన కుటుంబ సభ్యుల తొలగింపు, విభజన చేసుకోవచ్చన్నారు. కార్డుల్లో ఆధార్ నమోదు నంబరు సరిచేసుకోవడం, రేషన్ కార్డును ఒక చోట నుంచి మరోచోటికి మార్చుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. రేషన్‌కార్డు ఉన్నవారికి విద్య, వైద్యం, ఆరోగ్యం అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు తప్పనిసరి అని పేర్కొన్నారు. మాచర్ల మండలం, టౌన్ పరిధిలో 31 వేల రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. రేషన్‌కార్డు దారులు ఏమైనా సమస్యలు డీలర్లకు సూచిస్తే వాటి పరిష్కారానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రమణ, ఆర్ఐ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయాలి**

రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవాలంటే ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయాలని పలువురు డీలర్లు తహశీల్దారుకు విన్నవించారు. అడ్రస్ మార్పు, ఫోన్ నంబరు యాడింగ్, ఈకేవైసీ తదితర సమస్యలు పరిష్కారం కాకుండా రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల సమయంలో ఇబ్బందులు వస్తాయని వివరించారు. అటువంటి వారి జాబితాను తమకు అందిస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి ఆధార్ క్యాంపుల ఏర్పాటుకు కృషి చేస్తానని తహశీల్దారు వివరించారు.

**ఉద్యోగాల్లో చేరిన వారి పేర్లు తొలగించాలి**

ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి పథకాలతో విద్యను అభ్యసించి ఉద్యోగాలు సాధించిన వారి పేరు రేషన్‌కార్డుల్లో ఉండటం వల్ల రేషన్ అందడం లేదని, వారి పేరు తొలగించాలని పలువురు కుటుంబ సభ్యులు కోరుతున్నారని డీలర్లు ఎమ్మార్వో దృష్టికి తీసుకొచ్చారు. ఉద్యోగాలు చేసే పిల్లలను సాకుగా చూపించి తమ రేషన్‌కార్డులను తొలగించి, ఇతర కుటుంబ సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా సాయం చేయాలని కోరారు. స్పందించిన తహశీల్దారు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అటువంటి వారి జాబితాను సిద్ధం చేసి, ప్రభుత్వం అవకాశం ఇస్తే వారి ప్రక్రియను చేపట్టవచ్చన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం



రెంటచింతల, మే 17 ప్రభాతవార్త: మండల పరిధిలోని పాల్వాయి జంక్షన్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. జంక్షన్ సమీపంలోని నర్సరీ సమీప కాలువ వద్ద ఓ మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలంలో మృతదేహం పక్కన మద్యం, వాటర్ బాటిళ్లు, పురుగుమందు డబ్బా ఉండటంతో సదరు వ్యక్తి పురుగుమందు కలుపుకొని సేవించి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. వ్యక్తి వయసు 45 సంవత్సరలు, నలుపురంగు షర్టు, ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృతునికి సంబంధించిన ఆధారాలు లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నూతన రేషన్‌కార్డుల మంజూరుపై అవగాహన

గురజాల, మే 17 ప్రభాతవార్తః పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం తహశీల్దార్ నగేష్ రేషన్ షాపు డీలర్లకు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశమై నూతన రేషన్‌కార్డుల మంజూరుపై అవగాహన కల్పించారు. అలాగే ఈకేవైసీ, మ్యాపింగ్, అడ్రస్ మార్పులు, కుటుంబసభ్యుల నమోదు, తొలగింపు తదితర అంశాలను వివరించారు. ఈ సమావేశంలో అధికారులు, డీలర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

## కారంపూడి మండలంలో స్వచ్ఛాంధ్ర దినోత్సవం



కారంపూడి, మే 17 ప్రభాతవార్త: కారంపూడి మండలంలో స్వచ్ఛాంధ్ర దినోత్సవం శనివారం నిర్వహించారు. మే నెలలో 'బీట్ ద హీట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో ఎండ తీవ్రతకు తీసుకోవాల్సిన చర్యల గురించి గ్రామ పంచాయతీల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు. గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద గ్రీన్‌మ్యాట్ల ఏర్పాట్లు, పశువులకు నీటి తొట్ల ఏర్పాటు, వైద్య ఆరోగ్య శాఖ సూచనలు, జాగ్రత్తలు వివరించారు. స్థానిక కారంపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రీన్ మ్యాట్ ఏర్పాటుతోపాటు, చెట్లను నాటారు. ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాల వద్ద గ్రీన్ మ్యాట్లు, మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ కసిన్యానాయక్, వైద్యులు రమ్య, సీహెచ్ఓ మల్లయ్య, వెలుగు సిబ్బంది, హౌసింగ్ ఏఈ రాజేష్, లాలునాయక్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్తు సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్పెల్‌బీ పరీక్షలో జాతీయస్థాయి రెండోర్యాంకు సాధించిన ప్రీతమ్‌చౌదరి

కారంపూడి, మే 17 ప్రభాతవార్త: చెన్నైలో నిర్వహించిన స్పెల్‌బీ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్ట్‌లో కారంపూడికి చెందిన జి.ప్రీతమ్‌చౌదరి నేషనల్ లెవల్‌లో రెండో ర్యాంకు సాధించాడు.



జి.ప్రీతమ్ చౌదరి కారంపూడి మండల వైకాపా నాయకులు కొంగర సుబ్రహ్మణ్యం మనుమడు. ప్రీతమ్ చెన్నైలోని ద్విశ్రామ్ అకాడమీలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్ట్‌లో జాతీయస్థాయిలో రెండో ర్యాంకు సాధించడం పట్ల ప్రతీమ్ తండ్రి జి.రఘుపతి, తల్లి కృష్ణచైతన్యతోపాటు తాతయ్య కొంగర సుబ్రహ్మణ్యం, అమ్మమ్మ ఇందిరాదేవీ, బంధువులు అభినందించారు.

## మోడీ ప్రభుత్వం ప్రజాధనాన్ని కార్పోరేషన్ వ్యవస్థలకు దోచి పెడుతుంది : సిపిఐ

బెల్లంకొండ, మే 17 ప్రభాతవార్త : మోడీ ప్రభుత్వం ప్రజాధనాన్ని కార్పోరేషన్ వ్యవస్థలకు దోచి



పెడుతుందని సిపిఐ నాయకులు మునగోటి శ్రీనివాసరావు అన్నారు. బెల్లంకొండ మండల పరిధిలోని మన్నే సుల్తాన్‌పాలెంలో గ్రామశాఖ మహాసభను శనివారం నిర్వహించారు. సభకు పొన్నూరు వెంకట్రావు అధ్యక్షత వహించారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ మాట్లాడారు. మౌలిక సమస్యల పరిష్కారం కోసం సిపిఐ కృషి చేస్తుందని తెలిపారు. ప్రజల పక్షాన నిలిచే పార్టీ సిపిఐ అని మునగోటి శ్రీనివాసరావు తెలిపారు.

## బ్యాటరీ దొంగల అరెస్ట్

చిలకలూరిపేట, మే17, ప్రభాతవార్త: మండలంలోని బొప్పూడి గ్రామ పరిధిలో హెచ్‌పి పెట్రోల్‌బంకు వెనుకఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేసి ఉన్న రెండు బ్యాటరీలను దొంగిలించినట్లు ఆ టిప్పర్ యజమాని గణపవరం గ్రామానికి చెందిన మలిశెట్టి శ్రీనివాసరావు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ జి అనిల్‌కుమార్ కేసు నమోదు



చేసుకొని రెండు గంటల వ్యవధిలోనే దొంగతనానికి పాల్పడిన సయ్యద్‌బాబు (ఒంగోలు), షేక్ హాఫీజ్‌భాషా (నడిగడ్డపాలెం) చూండురు మండలం అను వారిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలు ఇద్దరిని స్దానిక కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

## టిడిపి సీనియర్ నాయకుడు గాదె బాలశౌరిరెడ్డి మృతి



నాదెండ్ల, మే17, ప్రభాతవార్త: మండలంలోని తూబాడు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు గాదె బాలశౌరిరెడ్డి (84) శనివారం మృతిచెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన తుది శ్వాస విడిచారు. ఆదివారం ఆయన అంత్యక్రియలు జరగనున్నట్లు కుమారుడు ఇన్నారెడ్డి తెలిపారు. బాలశౌరిరెడ్డి మృతిపట్ల స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి, జిడిసిసిబి మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు జగన్నాథరెడ్డి, యన్నం వెంకట్రామిరెడ్డి, నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, నల్లమోతు హరిబాబు, గంగా శ్రీనివాసరావు, మామిళ్లపల్లి పోతురాజు, గుర్రం నాగపూర్ణచంద్రరావు, గొట్టిపాటి రామారావులు సంతాపం వెలిబుచ్చారు.

## తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి

సత్తెనపల్లి, మే 17 ప్రభాతవార్త : పట్టణంలో శనివారం తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ హాజరయ్యారు. నియోజకవర్గ పరిశీలకులు జయప్రకాష్‌తో పాటు వివిధ వర్గాల ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరమరణం పొందిన జవాన్లకు జోహార్లు




తెలిపారు. మహిళల నుదుట సింధూరాన్ని తుడిచిన ఉగ్రవాదులకు ఆపరేషన్ సింధూర్ పేరుతో త్రివిధ దళాలు బదులిచ్చాయని తెలిపారు. పాకిస్ధాన్ కుట్రలు సాగబోవని సైనికులు గట్టి జవాబు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ ఉగ్రవాదంపై చేస్తున్న పోరాటానికి తమవంతు మద్దతును కూటమి ప్రభుత్వం అందిస్తుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఎల్లినేడి రామస్వామి, భీమినేని వందనాదేవి, పార్టీ శ్రేణులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లతో సమావేశం



సత్తెనపల్లి, మే 17 ప్రభాతవార్త : ఆటో డ్రైవర్లతో సి.ఐ. నాగమల్లేశ్వరరావు శనివారం సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తప్పక కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సి.ఐ. నాగమల్లేశ్వరరావు వివరించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దన్నారు. రోడ్డు భద్రత నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్.ఐ.లు పవన్‌కుమార్, సంధ్యారాణి పాల్గొన్నారు.

## సత్తెనపల్లి రెవిన్యూ డివిజన్ రీ సర్వే



సత్తెనపల్లి, మే 17 ప్రభాతవార్త : సత్తెనపల్లి రెవిన్యూ డివిజన్ రీ సర్వే పై జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. సివిల్ సప్లయ్స్, రెవిన్యూ సమస్యలకు సంబంధించి మాట్లాడారు. ఏ ఒక్కటి ఆలస్యం కాకుండా ప్రజలకు సేవలు అందించాలన్నారు. సివిల్ సప్లయ్స్ విధానంలో ఆరోపణలు రానివ్వకుండా చూడాలన్నారు. రేషన్ బియ్యాన్ని సక్రమంగా అందించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే సూచించారు.

## ఘనంగా కలశయాత్ర



అమరావతి, మే 17 ప్రభాతవార్త : మండలంలోని పొందుగల గ్రామంలో అఖిలవిశ్వగాయత్రి పరివార్ శాంతికుంజ్ ఆధ్వర్యంలో శోభకలశయాత్ర శనివారం జరిగింది. పండిత శ్రీరామశర్మ మాతా భగవతిదేవి జన్మ శతాబ్ది సందర్భంగా కార్యక్రమం జరిగింది. రామకృష్ణ శాంతి ఆశ్రమం వరకు జరిగిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 2400 ప్రమిదలతో దీపయజ్ఞం జరుగుతుందని, మహాయజ్ఞానికి భక్తులు తరలిరావాలని రామకృష్ణ శాంతి ఆశ్రమ నిర్వాహకులు కోరారు.

## మజ్జిగ పంపిణీ చేసిన కొమ్మాలపాటి

పెదకూరపాడు, మే 17 ప్రభాతవార్త : టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రంలో చైతన్యసమితి ఆధ్వర్యంలో



కార్యక్రమం జరిగింది. రేపల్లెకు చెందిన శౌరిబాబు వర్ధంతి సందర్భంగా వారి కుటుంబసభ్యులు మజ్జిగ పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. జనచైతన్య సమితి కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షులు ఆర్తిమళ్ళ రమేష్, వైద్యాధికారి డాక్టర్ ఉడుముల వెలుగొండారెడ్డి, మాజీ ఎంపిపి బెల్లంకొండ రాంగోపాలరావు, జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు పాల్గొన్నారు.

## తడిసిన ముద్దైన పసుపుకొమ్ములు


అమరావతి, మే 17 ప్రభాతవార్త : మండల పరిధిలోని మల్లాది గ్రామంలో 20 ఎకరాలలో సాగు చేసిన పసుపుకొమ్ములు నీటిపాలయ్యాయి. రైతు కోటి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ రెండున్నర



ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని పసుపుకొమ్ములను సాగు చేసినట్లు తెలిపారు. పండించిన పంట ఉడకబెట్టి ఆరబెట్టడం జరిగిందన్నారు. అకాల వర్షం రావడంతో పసుపుకొమ్ములు పూర్తిగా తడిసిపోయాయన్నారు. క్వింటా పసుపుకొమ్ములు రూ.12 వేలు ధర పలుకుతున్నట్లు రైతు కోటి వెంకట సుబ్బారావు తెలిపారు. వీటి ధర రూ.లక్ష వరకు ఉంటుందని సుబ్బారావు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకొని న్యాయం చేయాలని ఆయన కోరారు.

## మెగా మెడికల్ క్యాంపును ప్రజలు సద్వినియోగించుకోవాలి

కొల్లిపర, మే 17 ప్రభాతవార్త: మెగా మెడికల్ క్యాంపును మండల ప్రజలు సద్వినియోగించుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మీ అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్



కార్యాలయంలో విజయలక్ష్మీ మాట్లాడుతూ ఆదివారం మండల కేంద్రం కొల్లిపర కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నారన్నారు. ఈ మెడికల్ క్యాంపుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించనున్నట్లు చెప్పారు. మెడికల్ క్యాంపులో సాధారణ శస్త్ర చికిత్సలు, స్త్రీ సంభంధిత విభాగం, చిన్నపిల్లల వైద్య పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, కళ్ళు, దంతాలు, గుండెకు సంభందిత మొదలగు విభాగాలలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి, ఈవోపిఆర్‌డి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## త్రికోటేశ్వరస్వామి ఆలయంలో జీ.వీ దంపతుల పూజలు

వినుకొండ, మే17, ప్రభాతవార్త: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు ఆయన సతీమణి లీలావతి దంపతులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ



సందర్భంగా ఆలయ అర్చకులు, దేవాదాయ అధికారులు పూర్ణకుంభంతో జీ.వీ దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. లోక కళ్యాణార్ధం ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసినట్లు జీ.వీ దంపతులు తెలిపారు. కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెనతో పాటు పలువురు నేతలు పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

## రేషన్ సరుకులు పంపిణీ చేయని డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు: తహశీల్దార్ సురేష్

వినుకొండ, మే17, ప్రభాతవార్త: పేద ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని లేదంటే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని మండల తహశీల్ధార్ సురేష్ హెచ్చరించారు. మండల తహశీల్ధార్ కార్యాలయంలో తహశీల్ధార్ సురేష్



ఆధ్వర్యంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమీక్ష, సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్ధార్ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో డీలర్లు అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్డుదారులకు సక్రమంగా అన్ని సరుకులు పంపిణీ చేయాలని చెప్పారు. నూతన కార్డుల మంజూరు, మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించి సమాచారం అందించాలని తెలిపారు.

## స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్రపై అవగాహన ర్యాలీ

నూజెండ్ల, మే17, ప్రభాతవార్త: స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బీట్ ద హీట్ ప్రోగ్రాం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఈ అల్లాభక్షు గ్రామస్తులకు అవగాహన




కల్పించారు. అనంతరం స్వర్ణాంధ్ర ర్యాలీ చేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయరాజు, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, పంచాయతీ కార్యదర్శులు నాగూర్, లాలు, బాలకోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి లబ్ధిదారునికి రేషన్ సరుకులు అందజేయాలి

నూజెండ్ల, మే17, ప్రభాతవార్త: మండలకేంద్రమైన నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో మండల రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో మండల తహశీల్ధార్ రమేష్‌కుమార్ సమీక్ష, సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన



మాట్లాడుతూ గ్రామాల్లో లబ్ధిదారులైన ప్రతి ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్నారు. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చు అని తెలిపారు. రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో డిటి బాల వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ..కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


రేపల్లె(నిజాంపట్నం), మే 17, ప్రభాతవార్తః రాష్ట్రం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రగా మారాలంటే ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు పట్టణ ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. మనం మన ఇంటిని శుభ్రంగా ఉంచటమే




కాకుండా వీధులను, గ్రామాలను శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా డస్ట్‌బిన్‌లలో వేయాలని కోరారు. పురపాలక సంఘం నుంచి వచ్చే చెత్తబండిలో మాత్రమే మన ఇంటిలోని తడిచెత-పొడిచెత్త వేయాలని తెలిపారు. మనం మన వ్యక్తిగత పరిశుభ్రతకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో అంతే ప్రాధాన్యత గ్రామాలకు ఇవ్వాలన్నారు. రాష్ట్రం స్వర్ణాంధ్రగా మారాలంటే ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని అప్పుడే రాష్ట్ర స్వర్ణాంధ్రగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, కమీషనర్ సాంబశివరావు, తహశీల్ధార్ మోర్ల శ్రీనివాసరావు, జనసేన నాయకుడు దేవగిరి శంకర్, బిజెపి నాయకుడు వాకా ప్రసాద్, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేశ రక్షణలో నిమగ్నమైన సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

నిజాంపట్నం, మే 17, ప్రభాతవార్తః దేశ రక్షణలో నిమగ్నమైన, ప్రాణాలర్పిస్తున్న సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య, అగ్నికుల క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ, తహశీల్ధార్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపిడిఓ నాగలక్ష్మీలు కొనియాడారు. సైనికులు




నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీని శనివారం మండల కేంద్రమైన నిజాంపట్నం తహశీల్ధార్ కార్యాలయ ఆవరణ నుంచి మెయిన్‌బజార్, బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వానికి సవాల్‌గా నిలిచిన ఉగ్రవాదులను, ముష్కరులను తుదముట్టించటంలో మన భారత్ మన దేశం అనే నినాదంతో సరిహద్దుల్లో ఉన్న వీర సైనికులు చేసిన వీరోచిత పోరాటం వెలకట్టలేనిదన్నారు. దేశ సరిహద్దుల్లో నిద్రాహారాలు సక్రమంగాలేకపోయినా దేశ రక్షణలో నిరంతరం కాపలా కాస్తున్న దేశ సైనికులకు అభివందనం అంటూ నినదించారు. ఉగ్రవాదులను సంహరించటంలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబాలకు దేశ ప్రజలు ఎన్నడూ అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మాజీ సైనికుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.


## ఎండ తీవ్రత పట్ల అవగాహన అవసరం

పొన్నూరు, మే 17, ప్రభాతవార్త: ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎండలను ఎదుర్కొనేందుకు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ప్రత్యేకాధికారి కె.కన్నబాబు సూచించారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్య క్రమంలో భాగంగా పట్టణంలో జరిగిన కార్యక్రమంలో కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎండల తీవ్రత దృష్ట్యా వయస్సు పైబడినవారు, చిన్న పిల్లలు ఆరోగ్య రీత్యా ఇంటి నుండి బయలకు రావద్దని సూచించారు. అవసరమైన పనిమీద బయటకు రావాలనుకుంటే జాగ్రత్తలు తప్పని సరిగా పాటించాలన్నారు. ఎక్కువగా నీటిని తాగాలన్నారు. మజ్జిగ, ఓఆర్ఎస్ తదితర ద్రావకాలను సేవించాలన్నారు. ఎండకు రావాల్సి వస్తే తలపై టోపి పెట్టుకోవడంతోపాటు తలకు తలగుడ్డ చుట్టుకోవాలన్నారు. గొడుగు లాంటివి ఉపయోగించడం ద్వారా ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్, గుంటూరు బస్టాండ్ వద్ద ఆర్యవైశ్య సంఘం, అన్ని వర్తక సంఘాల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, పట్టణ ప్రణాళికాధికారి రఘురాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, డిఇ వెంకయ్య, రెవెన్యూ ఆఫీసర్ తోట వెంకటేశ్వరరావు, టిపిఎస్ పుసుకూరి రాఘవరావు, సిటిమిషన్ మేనేజర్ హనుమాన్‌నాయక్, పట్టణ సర్వేయర్ సిహెచ్ శ్రీనివాసరాజు, నాయకులు ఆకుల సాంబశివరావు, పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, నన్నపనేని బాలకృష్ణ, షేక్ కరీముల్లా, బండ్లమూడి బాబూరావు, మాదల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




## విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకుడికి డాక్టరేట్

పొన్నూరు, మే 17, ప్రభాతవార్త: చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ధరంసోత్ భూపాల్‌నాయక్ అనే అధ్యాపకుడికి సీఎస్ఈ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫెడరేటెడ్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ప్రైవసీ, సెక్యూరిటీ అండ్ ట్రస్ట్ ఇన్ వెహికులర్ నెట్‌వర్క్స్ అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలిపారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని అడ్వాన్స్‌డ్ సీఎస్ఈ డిపార్టుమెంట్‌కు చెందిన ప్రొఫెసర్ దొండేటి వెంకటేశులు గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈయన తన పరిశోధనలో భాగంగా 2 ఎస్‌సీఐ, 1 స్కోపస్ పేపర్లు పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ధరంసోత్ భూపాల్ నాయక్‌ను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.



## డంపింగ్ యార్డును పరిశీలించిన ప్రత్యేకాధికారి

పొన్నూరు, మే 17, ప్రభాతవార్త: పట్టణ ప్రజలు తడి,పొడి చెత్తలను వేర్వేరుగా మునిసిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలని జిల్లా ప్రత్యేకాధికారి కె.కన్నబాబు కోరారు. పురపాలక సంఘ పరిధిలోని డంపింగ్‌యార్డును శనివారం జిల్లా ప్రత్యేకాధికారి కన్నబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త వేరు చేసే విధానిన్న పరిశీలించారు. తడిపొడి చెత్త వేర్వేరుగా అందించడం ద్వారా చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాల ద్వారా ఎరువును తయారు చేయవచ్చన్నారు. దీని వల్ల మునిసిపాలిటీకి కొంత ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రజలందరూ పట్టణాన్ని పచ్చదనంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. చెత్తా చెదారాలను రోడ్లపై, కాలువల్లో పడవేయకుండా మునిసిపల్ పుష్‌కార్టు లకు అందజేయాలన్నారు. డంపింగ్‌యార్డులో నూతనంగా ఏర్పాటు చేసే స్వర్ణాంధ్ర పార్కును ఆయన పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## వేడిని ఓడించండి-ఆరోగ్యాన్ని కాపాడుకోండి

పొన్నూరు, మే 17, ప్రభాతవార్త: ప్రస్తుతం వేసవి తాపాన్ని తట్టుకొనే విషయంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఓ ఎ.ఉమాదేవి సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వేడిని ఓడించడంపై అనే థీముతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఉమాదేవి మాట్లాడుతూ వేడిని ఓడించండి-ఆరోగ్యాన్ని



కాపాడుకోండి అనే నినాదంతో ముందుకు సాగారు. మండలంలోని అన్ని గ్రామా పంచాయితీలలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఉమాదేవి మాట్లాడుతూ మనిషి శరీరంలో, పర్యావరణంలో కావలసిన వేడిని మించి అధిక వేడి చేరడం వల్ల సాధారణ పరిస్థితుల్లో మార్పులు జరిగి అనారోగ్యం ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. ఎండ తీవ్రత, వేడి ఒత్తిడి యొక్క ప్రమాద కారకాలు తప్పుకునేందుకు పాటించాల్సిన అంశాలను వివరిస్తూ వేడి తీవ్రత లేని సమయాల్లో పలుచని కాటన్ దుస్తులు దరించి పనిచేసుకోవాలన్నారు. తహశీల్దార్ శ్రీనివాసశర్మ మాట్లాడుతూ ఎండ తీవ్రత వల్ల వడదెబ్బ తగిలినట్లు గ్రహిస్తే తప్పని సరిగా వైద్యులను సంప్రదించాలన్నారు. ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరీ ముఖ్యంగా ముసలివారు, చిన్న పిల్లలు తప్పని సరిగా ఉష్ణోగ్రతలు పెరిగే సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెల్లవద్దని సూచించారు.

## డ్రోన్ టెక్నాలజీ పై ఫోటోగ్రఫీ విద్యార్థులకు అవగాహన

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మే 17,ప్రభాతవార్త : వర్సిటీలోని ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేఘాలయ రాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ సలహాదారుడు,నక్ష ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మేఘాలయ జిఐఎస్ అండ్ యు.ఏ.వి. సెంటర్ సలహాదారుడు ఎఎన్‌యు రిటైర్ ప్రొఫెసర్ వై.కిషోర్ డ్రోన్ టెక్నాలజీలో మెళకువలను నేర్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఏరియల్ వెహికల్ స్‌లో డిజిసిఏ రూల్స్, రెగ్యులేషన్స్, యుఏవి (డ్రోన్స్) అప్లికేషన్స్, యుఏవి బేస్డ్ రిమోట్ సెన్సింగ్, గూగుల్ ఎర్త్ ఇంజన్ ఉపోద్ఘాతాలను వివరించారు. యు.ఏ.వి.డేటా ప్రాసెసింగ్ టెక్నిక్స్, యుఏవి ఫోటోగ్రఫీ మరియు రిమోట్ సెన్సింగ్ మధ్య వ్యత్యాసాలు గురించి, హాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ ఏరియల్ మ్యాపింగ్‌లపై అవగాహన కల్పించారు. విభాగాధిపతి డాక్టర్ కె.జ్యోతిర్మయి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఫోటోగ్రఫీ అధ్యాపకులు డాక్టర్ సి.హెచ్.విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

### ఎమ్మెల్యే నరేంద్ర వర్మ


బాపట్ల,మే16,ప్రభాతవార్త:ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత, పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతను జీవనశైలిలో ఒక భాగంగా అలవర్చుకునే దిశగా అవగాహన పెంచుకోవాలని ఇళ్లు, పరిసర ప్రాంతాలలో మొక్కలు పెంచుట ద్వారా వాతావరణ ఉష్ణోగ్రతలు తగ్గించుటకు కృషిచేయాలని స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఈ నెలలో బీట్ ది హీట్ నినాదంతో నిర్వహించారు. శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణం మూర్తి నగరం లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్, డిఆర్ఓ గంగాధర్ గౌడ్ తో ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా మే నెలలో వేడిని తగ్గించండి ఇతివృత్తానికి అనుగుణంగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర దివాస్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ స్థిరత్వం, సమాజ వాతావరణం స్థితిస్థాపనను ప్రోత్సహించే దిశగా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ మూడవ శనివారం వేడి ప్రభావాలను తగ్గించడానికి ప్రజల్లో అవగాహన పెంచేందుకు మొక్కలను నాటాలని ఆయన అన్నారు. మే నెల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నట్లు వాతావరణ శాఖ తెలుపుతుందని వృద్ధులు, పిల్లలు, కార్మికులు, బహిరంగ కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న పని ప్రదేశాలు, ఇండ్ల కాలనీలో ఇతర నిర్మాణ పనులు జరుగుతున్న ఆయా ప్రాంతాలలో డ్వామా సంబంధిత శాఖల అధి కారులు చలి వేంద్రాలు, షెడ్ నెట్లు ఏర్పాటు, వైద్య శిబిరాలను నిర్వహించారన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు తక్కువ ఆదాయ గృహాల పైక




ప్పులపై సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్లను ప్రోత్స హించడం ద్వారా ఇండోర్ ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. భౌగోళిక మార్పుల కారణంగా వాతావరణంలో విపరీతంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, బాపట్ల తాహశీల్దార్ సలీమా, మున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి, కూటమి నాయకులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతే ప్రగతికి మెట్లు

కొల్లిపర,మే 17 ప్రభాతవార్త: పరిసరాలు పరిశుభ్రతే ప్రగతికి మెట్లని ఈవోపిఆర్‌డి భార్గవ్ అన్నారు. శనివారం మండలంలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, అత్తోట తదితర గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర..స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు ..ప్రజా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించి పరిసరాలు పరిశుభ్రత గురించి అవగాహన కలిగించారు. అదే విధంగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ..రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో అధికారులు పరిశుభ్రం చేసారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆదినారాయణరెడ్డి, డిప్యూటి తహశీల్దార్ ఉప్పాల రాజేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## వైద్యుల సలహాలతో మందులు వాడుకోవాలి

కొల్లిపర,మే 17 ప్రభాతవార్త: బీపీ ఉన్నవారు వైద్యుల సలహాలతో నిత్యం మందులు వాడుకోవాలని మండల వైద్యాధికారి సుబ్బారావు అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపరలో ప్రపంచ బీపీ దినోత్సవం సందర్భంగా వైద్యాధి కారులు, ఆరోగ్యసిబ్బంది సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సంద



ర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎఎన్ఎం లక్ష్మి, మణెమ్మ, ఆశా కార్యకర్తలు మల్లీశ్వరి, పద్మ, ప్రేమకుమారి, వాణి తదితరులు పాల్గొన్నారు.

## తెల్ల పలుకురాయి (కాడ్జ్) ఖనిజ సంపదను కొల్లగొడుతున్న వైనం!

ఎ కొండూరు, మే 17, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు మైలవరం నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయలు ఖరీదు చేసే ప్రభుత్వ ఖనిజ సంపద తెల్లపలుకురాయి (క్వాడ్జ్) కొందరు వ్యక్తులు ఎ కొండూరు మండలం కంభంపాడు కోడూరు, గంపలగూడెం మండలం, రెడ్డిగూడెం మండలాల్లో తెల్ల పలుకురాయి (కాడ్జ్) క్వారీలను నిబంధనలకు విరుద్ధంగా క్వారీలను బాగా లోతుగా తవ్వించడం అలాగే పేలుడు బ్లాస్టింగ్ వల్ల ఇంకా ఇతర నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తుండటం వల్ల ఆయా క్వారీ పరిసరాల రైతులు, పశువుల కాపరులు సమీపంలో కాలనీ గృహాల్లో నివాసం ఉండే బడుగు జీవులు శబ్ద ధ్వని వాయు కాలుష్యం వల్ల పొల్యూషన్‌తో తమకు శ్వాసకోశ ఊపిరితిత్తుల జబ్బులు, క్షయ, క్యాన్సర్ లాంటి జబ్బులు, కిడ్నీ జబ్బులు సోకుతున్నాయని పలువురు దళిత గిరిజనులు బిసి వర్గాల పూజలు ఆరోపించారు. ఈ పలుకురాయి క్వారీల నుండి అధికలోడుతో టిప్పర్లపై చెన్నయ్ లాంటి రాష్ట్రాలకు ఈ తెల్లపలుకు నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడు కొందరు పాత పర్మిషన్‌లనే వినియోగించుకోవడం తదితర చట్ట విరుద్ధ రవాణా పనులతో ప్రభుత్వ ఖజానాకు తీవ్రంగా సొమ్ము నష్టం జరుగుతుందని అయినా ప్రభుత్వ మైనింగ్, రెవిన్యూ పోలీస్ ఆర్‌టిఏ రోడ్డు రవాణా ట్రాన్స్‌పోర్ట్ అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోకుండా ఉదాసీన వైఖరి అవలంబిస్తుందని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా ఈ తిరువూరు మైలవరం నియోజకవర్గాల్లో నడుస్తున్న కాడ్జ్ తెల్లపలుకు రాయి క్వారీల నిర్వాహణపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుని ప్రభుత్వ ఖనిజ సంపదను ప్రజా ధనాన్ని కాపాడాలని పై నియోజక వర్గాల ప్రజలు రైతులు పశు యజమానులు కాపరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పార్టీ పటిష్టతకు ఐకమత్యంతో కృషి చేద్దాం!

### -నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు, మే 17, ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పూర్తిస్థాయిలో పటిష్టపరిచేందుకు నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో కృషి చేద్దామని నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలం, వేజండ్ల గ్రామంలోని చిన్ని కృష్ణారెడ్డి కళ్యాణ మండపంలో చేబ్రోలు మండల పార్టీ సమావేశం శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఎంతో మంచి చేసినప్పటికీ, చేసిన మంచిని ప్రజల్లోకి



తీసుకెళ్లడంలో విఫలమయ్యామని అందుకే ఓటమి చెందడం జరిగిందన్నారు. కార్యకర్తలను కూడా పార్టీ విస్మరించినట్లు పార్టీ అధిష్టానం గుర్తించిందన్నారు. వైకాపా అధినేత జగన్మోహనరెడ్డి రానున్న కాలంలో కార్యకర్తలకు ఏ మేరకు మేలు చేయాలో ఆలోచించి ఆ మేరకు చేస్తామని భరోసా ఇచ్చారన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో తీసుకెళ్ళాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బోర్లాపడిందన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పార్టీని పటిష్టపరిచేందుకు పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి మండల, పట్టణ పార్టీ కమిటీలను నూతనంగా ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేస్తున్నారన్నారు. మండల పార్టీ నాయకుడిని ఎన్నుకునే సమయంలో అన్ని గ్రామాలకు సంబంధించిన నాయకుల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించి పార్టీ అధ్యక్షుడిని, ఇతర పార్టీ బాద్యులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. రానున్న కాలంలో మనందరం కలిసి పార్టీని పటిష్ట పరుద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అందరి సమక్షంలో ఏకగ్రీవంగా చేబ్రోలు మండల అధ్యక్షుడిగా ఆళ్ళ శ్రీరామిరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరరెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు, గోవిందరాజులు, కొక్కిలిగడ్డ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత అంటే కేవలం శుభ్రత మాత్రమే కాదు - మన అభివృద్ధికి పునాది


బాపట్ల,మే16,ప్రభాతవార్త: భావితరాల ఆరోగ్యకరమైన వాతావరణమే లక్ష్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లు, కార్యాలయాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం జిల్లా పోలీసులు నిర్వహించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని చెత్త,



వ్యర్థాలను తొలగించి పరిసరాలు పరిశుభ్రం చేశారు. గుణపం, పారలు, చీపురులు చేతబట్టి పిచ్చి మొక్కలు తొలగించారు. చెట్లకు పాదులు తీసి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలలో 3వ శనివారం నిర్వహించబడుతుందన్నారు. స్వచ్ఛత అంటే కేవలం శుభ్రత మాత్రమే కాదు - అది మన అభివృద్ధికి పునాదని, శుభ్రమైన పరిసరాలు మన ఆరోగ్యాన్ని కాపాడతాయన్నారు. పోలీస్ స్టేషన్, కార్యాలయాల పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. పరిశుభ్రమైన పర్యావరణం మానసిక ప్రశాంతతను పెంచుతుందన్నారు. ఇది పోలీస్ సిబ్బంది పనితీరుపై కూడా సానుకూల ప్రభావం చూపుతుందన్నారు. ప్రస్తుతం వేసవి కాలం కనుక సహజమైన చల్లదనం కోసం టెర్రస్ లపై ఆకర్షణీయమైన, ఆరోగ్యకరమైన మొక్కలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పక్షుల దాహార్తి తీర్చేందుకు గోడలు, టెర్రస్ లపై చిన్న మట్టి పాత్రలలో పక్షులు తాగేవిధంగా నీటిని ఏర్పాటు చెయ్యాలన్నారు. భూమిపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, వర్షాలు పడేందుకు చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మనం ఇప్పుడు నాటే చెట్లు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఇస్తాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం సామాజిక బాధ్యతగా భావించి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఎఆర్ డిఎస్పీ పి.విజయసారది, ఎస్బి ఇన్స్పెక్టర్ నారాయణ, ఆర్.ఐ మోలుద్దీన్ ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## చోరీలకు పాల్పడే వ్యక్తి అరెస్ట్

బాపట్ల,మే17,ప్రభాతవార్త: ఇళ్లలో చోరీలకు పాల్పడే వ్యక్తిని చాకచక్యంగా పట్టుకున్నామని వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజ్ అన్నారు. శనివారం వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాటాడుతూ సుమారు సంవత్సరం క్రితం స్టువర్టుపురం గ్రామం పెద్ద గ్యాంగ్ కి చెందిన దేవర కిరణ్మయి తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగిందని తన యొక్క నాంతాడు దొంగిలించ బడినదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజు దర్యాప్తు చేయటం జరిగిందన్నారు. స్టువర్టుపురం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు కలిసి మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో పెద్ద గ్యాంగ్ కి చెందిన దేవర ప్రవీణ్ ఇంట్లోకి ప్రవేశించి నాన్తాడు దొంగిలించి ప్రస్తుతం అందులో ఇద్దరు నాటు సారాయి కేసులో జైలులో ఉండగా వారికి బెయిల్ వేయడానికి ఖర్చుల నిమిత్తం వారు దొంగిలించిన నాన్తాడుని తాకట్టు పెట్టడానికి వెళ్లే క్రమంలో అందులోని మూడవ ముద్దాయి అయిన స్టువర్టుపురం గ్రామం పెద్ద గ్యాంగ్ కి చెందిన మాదిగాని రామచంద్ర కుమార్ అలియాస్ ప్రేమ్ చంద్ అలియాస్ పెద్ద పప్పుని వెదుళ్ళపల్లి ఎస్సై గత రాత్రి అరెస్టు చేసి నాన్తాడుని రికవరీ చేశామన్నారు. ముద్దాయిని శనివారం కోర్టులో హాజరు పరిచామన్నారు. మిగిలిన నలుగురు ముద్దాయిలు పరారీలో ఉన్నారని తెలిపారు.



## ఆర్టీసీ డ్రైవర్లు,కండక్టర్లకు క్యాష్ రివార్డ్ అందజేత


బాపట్ల,మే17,ప్రభాతవార్త:డిపోలో అత్యధిక ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లకు, అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు కు క్యాష్ అవార్డులనుడిపో మేనేజర్ బి. శ్రీమన్నారాయణ అందజేశారు. శనివారం స్థానిక బాపట్ల కొత్త బస్టాండ్ లో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభను నిర్వహించారు. ఈ అభినందన సభలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న డిపో మేనేజర్ బి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ



డిపోలో అత్యధిక ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లకు, అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు కు క్యాష్ అవార్డు అందజేసి అభినందనలు తెలిపారు. అవార్డులను అందించటం వలన వారిలో పోటీతత్వం పెరగటంతో పాటు డిపోలకు ఆదాయం సమకూర్చే విధంగా కృషి చేస్తారన్నారు. బాపట్ల డిపో ను ఉద్యోగులు కార్మికులు సమన్వయంతో కృషిచేసి అభివృద్ధి బాటలో నడిపించాలని ఆయన తెలిపారు.

## నియోజకర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులుగా ఎగుసుపల్లి నాగిరెడ్డి

గుంటూరు విద్య,మే 17,ప్రభాతవార్త : వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాలతో, బలసాని కిరణ్‌కుమార్ ఆశీస్సులతో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సిపి వాణిజ్య విభాగం అధ్యక్షులుగా ఎగుసుపల్లి నాగిరెడ్డి నియామకం జరిగింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు నాయకులు అభినందించారు. వైసీపీలో నాగిరెడ్డికి సముచిత స్థానం దక్కిందని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతానికి వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు జరిగిన నాగిరెడ్డి నియామకం పార్టీ కార్యకర్తల్లో మరింత జోష్‌ను నింపిందని పలువురు నాయకులు అన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ నన్ను ప్రత్తిపాడు నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులుగా నియమించిన వైఎస్ జగన్మోహనరెడ్డి కి బలసాని కిరణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులుగా 100శాతం న్యాయం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిని పలువురు అభినందించారు.



18-5Pg5.qxd:18-5Pg5.qxd 01/01/01 6:44 AM Page 1



# గుజరాత్ ఎంఎన్‌రేగాలో భారీ స్కాం

## రూ.250 కోట్లమేర నిధుల మళ్లింపు

## మంత్రి కుమారుడు సహా నిందితుల అరెస్టు



**అహ్మదాబాద్, మే 17:** రూ.71 కోట్ల ఎంఎన్‌రేగా కుంభకోణం గుజరాత్ గ్రామీణాభివృద్ధి వ్యవస్థను కుదిపేసింది, రాష్ట్ర పంచాయతీ మరియు వ్యవసాయ మంత్రి బచు ఖాబాద్ కుమారుడు బల్వంత్ ఖాబాద్ సహా నిందితులను అరెస్టు చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పథకంలో భారీ అవకతవకలకు సంబంధించిన ఈ కుంభకోణం దాహోద్ జిల్లాలోని ధన్‌పూర్ మరియు దేవ్‌గఢ్ బరియా తాలూకాలలో బయటపడింది. అరెస్టును ధృవీకరిస్తూ, దాహోద్ డిప్యూటీ ఎస్పీ జగదీష్ భండారి వివరాలు తెలిపారు. ధన్‌పూర్ మరియు దేవ్‌గఢ్ బరియాలో ఎంఎన్‌రేగా కుంభకోణానికి సంబంధించి బల్వంత్ ఖాబాద్ మరియు అప్పటి తాలూకా అభివృద్ధి అధికారి (టిడిఒ) దర్శన్ పటేల్‌లను అరెస్టు చేశామన్నారు. ఈకేసులో మంత్రి చిన్న కుమారుడు కిరణ్ ఖాబాద్ పరారీలో ఉన్నాడు. ఈ కుంభకోణం మధ్యలో కేవలం కాగితాలపై ఉన్న కల్పిత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రోడ్లు, బండ్లు మరియు ఇతర ప్రజా పనుల యొక్క బాగా వ్యవస్థీకృత నెట్‌వర్క్ ఉంది. ఎంఎన్‌రేగా కింద గిరిజన ఉపాధి కోసం ఉద్దేశించిన నిధులను నకిలీ సర్టిఫికెట్లు మరియు నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా మళ్లించారని, ఆ డబ్బును మంత్రి కుమారులతో సంబంధం ఉన్న ఏజెన్సీలకు మళ్లించారని ఆరోపణలు ఉన్నాయి. దేవ్‌గఢ్ బరియా మరియు ధన్‌పూర్ తాలూకాలలో ప్రాజెక్టు అమలులో పెద్ద అవకతవకలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) డైరెక్టర్ బిఎంపటేల్ గుర్తించిఆడిట్‌కు ఆదేశించడంతో మోసం బయటపడింది, బల్వంత్ మరియు కిరణ్ ఖాబాద్ నడుపుతున్న రాజ్ కన్స్ట్రక్షన్ మరియు రాజ్ ట్రేడర్స్ అనే సంస్థలు ఈ మోసాలకు పాల్పడ్డాయి. వీరిద్దరూ ముందస్తు బెయిల్ కోరుతూ ముందస్తు ఆధారాలను పొందారు. 2021 మరియు 2025 మధ్య, కువా, రెధానా మరియు సిమామోయి వంటి గ్రామాలను పూర్తయిన ఎంఎన్‌రేగా ప్రాజెక్టుల లబ్ధిదారులుగా తప్పుగా గుర్తించారు. దేవ్‌గఢ్ బరియా నుండి 28 మంది మరియు ధన్‌పూర్ నుండి ఏడుగురు 35 మంది మెటీరియల్ సరఫరాదారులు స్థానిక అధికారుల సహాయంతో నకిలీబిల్లులు సృష్టించినట్లు అధికారులు కనుగొన్నారు. ఆడిట్‌లలో కనిపించని లాగ్‌లు, ఉనికిలో లేని పని ప్రదేశాలు మరియు విస్తృతమైన డాక్యుమెంట్ ఫోర్జరీ బయటపడింది.సుమారు రూ.160 కోట్ల మోసపూరిత క్లెయిమ్‌లు పరిశీలనలో ఉన్నాయి. మరింత లోతుగా ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటు చేయబడింది. ఇప్పటివరకు, దేవ్‌గఢ్ బరియాలో రూ.60.90 కోట్ల నకిలీ బిల్లులు మరియు ధన్‌పూర్‌లో రూ.10.10 కోట్ల నకిలీ బిల్లులను ట్రాక్ చేశారు. ప్రతిపక్ష నాయకుడు అమిత్ చావ్డా గతంలో ముఖ్యమంత్రికి రాసిన లేఖలో ఈ కుంభకోణం గురించి హెచ్చరించారు, ఈ మోసం దాదాపు రూ.250 కోట్లుగా అంచనా వేశారు. మంత్రి రాజీనామా చేయాలని మరియు రాష్ట్ర స్థాయిలో క్రిమినల్ దర్యాప్తును డిమాండ్ చేశారు.ఒత్తిడి పెరుగుతున్నప్పటికీ, మంత్రి బచు ఖాబాద్ మౌనంగా ఉన్నారు మరియు అధికార బిజెపి నుంచి ఎటువంటి అధికారిక స్పందన లేదు. ప్రతిపక్షాలు మరియు పౌర సమాజం నుండి తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. ఒక సాధారణ ఆడిట్‌గా ప్రారంభమైన ఆడిట్ గుజరాత్‌లో అతి పెద్ద సంక్షేమ కుంభకోణాలలో ఒకటిగా పేలిపోయింది, ఇది పాతుకుపోయిన అవినీతిని బహిరంతం చేసింది మరియు ప్రభుత్వ జవాబుదారీతనంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసింది.



# సత్తా చాటిన భారత్ వైమానిక రక్షణ వ్యవస్థలు

## 600లకుపైగా పాకిస్థాన్ డ్రోన్లు కూల్చివేత

**న్యూఢిల్లీ, మే 17:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సైనిక దాడుల్లో భారత వైమానిక రక్షణ వ్యవస్థలు సత్తా చాటాయి. 600కు పైగా పాకిస్థాన్ డ్రోన్లను ఇవి కూల్చివేశాయి. భారత రక్షణ స్థావరాలకు ఎటువంటి నష్టం జరగకుండా కాపాడాయి. మే 7న పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ధ్వంసం చేసింది. దీనికి ప్రతిస్పందనగా భారత్ సరిహద్దులోని నగరాలను పాకిస్థాన్ సైన్యం లక్ష్యంగా చేసుకున్నది. భారత సైనిక స్థావరాలపై దాడుల కోసం వందలాది డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించింది. కాగా, భారత వైమానిక రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా వాటిని అడ్డుకున్నాయి. 600కు పైగా పాకిస్థాన్ డ్రోన్లను కూల్చడంతోపాటు ధ్వంసం చేశాయి. పాక్ డ్రోన్లను అడ్డుకునేందుకు విస్తృతమైన వైమానిక రక్షణ గొడుగును భారత సైన్యం అమలు చేసింది. నియంత్రణ రేఖ (ఎల్‌ఒసి) నుంచి అంతర్జాతీయ సరిహద్దు (ఐబి) వరకు పలు కీలక ప్రాంతాల్లో వెయ్యికిపైగా ఎయిర్ డిఫెన్స్ గన్స్‌ను మోహరించింది. ఎల్-70 ఎయిర్ డిఫెన్స్ గన్, జు-23 ఎంఎం గన్, శిల్కా గన్ సిస్టమ్ వంటివి ఇందులో ఉన్నాయి. అలాగే పెద్ద వైమానిక ముప్పును ఎదుర్కొనేందుకు 750కు పైగా స్వల్పశ్రేణి ఉపరితలం నుంచి గాలిలోకి ప్రయోగించే క్షిపణి (ఎస్ఎఎం) వ్యవస్థలను కూడా భారత సైన్యం మోహరించింది. మరోవైపు భారత భూభాగంలోకి ప్రవేశించిన ప్రతి వైమానిక లక్ష్యాన్ని పర్యవేక్షించడం, ట్రాక్ చేయడం, ఎయిర్ డిఫెన్స్‌ను యాక్టివేట్ చేయడం కోసం ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఆకాశ్ తీర్ వ్యవస్థ ఎంతో కీలకంగా వ్యవహరించింది. ఈ ఇంటిగ్రేటెడ్ ఏరియల్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఎసిసిఎఫ్) ను కొన్ని నెలల కిందటే ఆకాశ్ తీర్ ప్రాజెక్టు కింద వైమానిక దళంలోకి చేర్చినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. నిర్దిష్టమైన పనితీరును ప్రదర్శించినట్లు వివరించారు.

# తుర్కియే యాపిల్స్ బ్యాన్ చేయండి

## వాషింగ్టన్ యాపిల్స్‌పై సుంకం రాయితీ వద్దు

## హిమాచల్ యాపిల్ సాగుదారుల డిమాండ్



**చండీఘర్, మే 17:**హిమాచల్‌ప్రదేశ్‌లోని యాపిల్ సాగుదారులు తుర్కియే యాపిల్లను బ్యాన్‌చేయాలని డిమాండ్ చేసారు. దేశ ఆర్థిక వ్యవస్థలో యాపిల్ సాగుదారులు కీలకంగా ఉన్నారని, ఒక్క హిమాచల్‌నుంచే యాపిల్ ఆర్థికవ్యవస్థకు ఐదువేల కోట్లవరకూ అందిస్తున్నారని, అందువల్ల దేశీయ ఉత్పత్తులను ఆదరించే వీలుగా తుర్కియే యాపిల్లను పూర్తిగా నిషేదించాలని వారు డిమాండ్‌చేస్తున్నారు. అలాగే వాషింగ్టన్ యాపిల్స్ పైనా దిగుమతి సుంకాలను తగ్గించాలని, ఎలాంటి మినహాయింపులు ఇవ్వకూడదని వారు కోరుతున్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాక్ సైనిక మద్దతుతోపాటు డ్రోన్లసాయం అందించడంపై ఇప్పటికే తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ బాయ్‌కాట్ తుర్కియే పిలుపునిచ్చిన వర్తక వాణిజ్యసంఘాలకు తోడు ఇపుడు హిమాచల్ యాపిల్ సాగుదారులు కూడా తోడయ్యారు. సంయుక్త కిసాన్‌మంచ్ కన్వీనర్ హరిష్ చౌహాన్ మాట్లాడుతూ తాము త్వరలోనే హిమాచల్ గవర్నర్ శివప్రతాప్ శుక్లానకలిసి చర్చలు జరపనున్నట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీ గవర్నర్‌ను కలుస్తామన్నారు. అలాగేప్రధాని నరేంద్ర మోడీకి కూడా ఒక వినతిపత్రం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్రం టర్కిష్ యాపిల్స్ దిగుమతులను వెంటనే నిలిపివేయాలని కోరతామన్నారు.

ఇరాన్‌నుంచి కూడా యాపిల్ పండ్లను దిగుమతిచేసుకోవద్దని, వాషింగ్టన్ యాపిల్స్ పైనా దిగుమతిసుంకాలను తగ్గించవద్దని రైతులు డిమాండ్‌చేసారు. వివిధ దేశాలనుంచి దిగుమతి అవుతున్న యాపిల్స్‌పై కనీస దిగుమతిధరలు కిలోకు 100గా ఉన్నాయి. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం కిలోకు రూ.50 చొప్పున సుంకం ఛార్జిచేస్తామని ప్రకటించింది. జులై మధ్యస్తం నుంచి హిమాచల్‌లో యాపిల సీజన్‌ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది గత ఏడాదికంటే ఎక్కువ రావచ్చని 2.18 కోట్ల బాక్సులు పైబడి ఉంటుందని హారీష్ చౌహాన్ తెలిపారు. తుర్కియే, ఇరాన్‌లనుంచి దిగుమతి చేసుకుంటున్నందున దేశీయ యాపిల్ సాగు దార్లకు విపరీత నష్టం వాటిల్లుతోందని, తుర్కియే యాపిల్ కిలో 60 నుంచి 65కు అమ్ము తుంటే ఇరాన్ యాపిల్స్ కిలో 38 నుంచి 40 కే లభిస్తున్నాయని గుర్తుచేసారు. అదే హిమాచల్ యాపిల్ ఉత్పత్తి వ్యయం కిలోకు 40గా ఉందని, బెస్ట్‌క్వాలిటీ యాపిల్‌ను మార్కెట్‌లో రూ.50 నుంచి 60కి మించకుండా విక్రయిస్తున్నట్లు తెలిపారు.

1.29 మెట్రిక్ టన్నులు తుర్కియేనుంచి దిగుమతి అయ్యాయని గత ఏడాది మాత్రం 1.11 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గినట్లు చౌహాన్ వివరించారు. ఇరాన్‌నుంచి 1.07 లక్షల టన్నులు దిగుమతి అవుతున్నాయన్నారు. ఇప్పటికే తాము కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్‌ను కలిసి సమస్యలు వివరించినట్లు హరీష్ చౌహాన్ వెల్లడించారు.

# ముంబయి ఎయిర్‌పోర్టులో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదుల అరెస్టు!



**ముంబయి, మే 17:** ముంబయి విమానాశ్రయంలో ఐసిస్ స్లీపర్ సెల్ మెంబర్స్ అని భావిస్తున్న ఇద్దరిని ఎన్ఐఎ అరెస్టు చేసింది. ఇండోనేసియా జకార్తా నుంచి మళ్లీ భారత్‌లోకి ప్రవేశిస్తున్న అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్ వాలా, తల్హాఖాన్‌లను రెండో నంబరు టెర్మినల్ వద్ద ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారు. అనంతరం ఎన్ఐఎ వారిని అరెస్ట్ చేసింది. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్, సిరియా ఐసిస్ స్లీపర్ సెల్ విభాగంతో వీరికి సంబంధాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇద్దరు నిందితులను ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నారు. ఐసిస్ సానుభూతి పరులైన వీరు 2023లో ఉగ్రవాదుల కోసం పుణేలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ ఐఇడి, ఇతర పేలుడు పదార్థాలు తయారు చేసినట్లు గుర్తించారు. అదే కేసులో 8 మంది ఐసిస్ సానుభూతిపరులను అరెస్టు చేయగా వీరిద్దరు మాత్రం ఎన్ఐఎ కళ్లుగప్పి ఇండోనేషియా పారిపోయారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఐఈడీలు తయారుచేసిన ప్రదేశంలోనే బాంబు తయారీ వర్క్‌షాపులు కూడా నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. వారిపై ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. వారి సమాచారం ఇస్తే ఒక్కొక్కరికి మూడు లక్షలు ఇస్తామని ఎన్ఐఎప్రకటించింది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం, హింస, ఉగ్రవాదం ద్వారా దేశంలో ఇస్లామిక్ పాలనను స్థాపించాలన్న ఐసిస్ ఎజెండా కోసం వీరు పనిచేసినట్లు అధికారులు తెలిపారు. భారత్‌లో శాంతి, మత సామరస్యాన్ని దెబ్బతీయాలని కుట్ర పన్నారని వివరించారు అరెస్ట్ చేసిన అనుమానిత ఐసిస్ స్లీపర్ సెల్ సమయంలోనే మరోవైపు, దాదాపు రెండేళ్లుగా పరారీలో ఉన్న వీరు భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తల సమయంలోనే ఎందుకు ముంబయి వచ్చారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్ఐఎ అధికారులు పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో నిర్మూలించాలనే కేంద్ర ప్రభుత్వం లక్ష్య సాధన కోసం ఎన్ఐఎ తీవ్రంగా ప్రయత్నిస్తోందని వెల్లడించారు. కాగా, భారత్ ఐసిస్ కార్యకలాపాలను నిర్వీర్యం చేయడంలో ఈ అరెస్టులు కీలక ముందడుగు అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పహల్గాం పాశవిక దాడి చేసిన ఉగ్రవాదుల కోసం ఎన్ఐఎ బృందాలు జమ్ముకశ్మీర్ అంతటా జల్లెడ పడుతున్నాయి. స్థానిక అధికారులతో కలిసి ఉత్తరకశ్మీర్‌లోని కుప్వారా, శ్రీనగర్, గందేర్‌బాల్, బారాముల్లా వంటి 10 ప్రదేశాల్లో సోదాలు చేపట్టారు.

# న్యాయమూర్తులు సామాజిక వాస్తవాలు విస్మరించకూడదు

## చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్




**న్యూఢిల్లీ, మే 17:** న్యాయమూర్తులు సామాజిక వాస్తవాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సత్కార కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, సామాజిక వాస్తవాలను అర్థం చేసుకోవడంలో, వాటికి ప్రతిస్పందించడంలో న్యాయమూర్తుల పాత్రను నొక్కి చెప్పారు. ఇటీవలే 52వ చీఫ్‌జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టిన బీఆర్ గవాయ్‌ను బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సత్కరించింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ మానవ అనుభవాల సంక్లిష్టతను విస్మరిస్తూ, నేటి న్యాయవ్యవస్థ చట్టపరమైన విషయాలను కఠినమైన నలుపుతెలుపు పదాలతో చూడకూడదని చెప్పారు. న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టడానికి మొదట్లో నేను చాలా సంకోచించాను. కానీ మా నాన్న ఓ విషయం చెప్పారు. న్యాయవాదిగా ఉండడం వల్ల బాగా డబ్బులు వస్తాయి. కానీ న్యాయమూర్తిగా పనిచేయడం వల్ల సామాజిక, ఆర్థిక న్యాయం పట్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కున్న దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి వీలు కలుగుతుందని మా తండ్రి నొక్కి చెప్పారు. అందుకే మా నాన్న సలహాకు కట్టుబడి ఉండాలని నిర్ణయించుకున్నానని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. జస్టిస్ బీఆర్ గవాయ్ హైకోర్టు న్యాయమూర్తిగా 22 సంవత్సరాలు, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 6 సంవత్సరాలు పనిచేశారు. న్యాయవ్యవస్థలో ఉన్నవారు ఒంటరిగా ఉండాలని, ప్రజలతో సంబంధాలు పెట్టుకో కూడదు అనే భావాలను చీఫ్ జస్టిస్ గవాయ్ తోసిపుచ్చారు. న్యాయమూర్తులు అందరితో కలిసి ఉండాలని చెప్పారు. న్యాయ నియామకాల్లో మహిళలకు, అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం పెరగాలని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, వివిధ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు హాజరైన ఓ ముఖ్యమైన సమావేశాన్ని జస్టిస్ గవాయ్ గుర్తు చేసుకున్నారు. ఆ సమావేశంలో ఇప్పటి వరకు న్యాయవ్యవస్థలో ప్రాతినిధ్యం లేని, తక్కువ ప్రాతినిధ్యం ఉన్న వర్గాలకు చెందిన అభ్యర్థులకు సరైన అవకాశం కల్పించాలని జస్టిస్ చంద్రచూడ్ కోరారు. అత్యంత నైపుణ్యం ఉన్న మహిళా న్యాయవాదులను కచ్చితంగా గుర్తించి, ప్రోత్సహించాలని చీఫ్ జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ ప్రయత్నం కచ్చితంగా విజయవంతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థలోని ఖాళీల భర్తీ సమస్యను కూడా జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. సరిపడ న్యాయమూర్తులు లేకపోవడం వల్ల పెండింగ్ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. నియామకాలను వేగం వంతం చేయడంలో సహకార విధానాన్ని అవలంభించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# భారత్ సమాచారాన్ని పాక్‌కు అందించిన విద్యార్థి అరెస్టు!

**న్యూఢిల్లీ, మే 17:** పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై హర్యానాలో ఓ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పటియాలలోని ఖల్సా కళాశాలలో దేవేంద్రసింగ్ ధిల్లాన్ పొలిటికల్ సైన్స్ చదువుతున్నాడు. మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టోల్ చిత్రాలను పోస్టు చేశాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతడిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతేడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్‌కు వెళ్లి అక్కడి ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధికారులతో భారత్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు అంగీకరించాడు. అందుకు పాక్ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బు ముట్టచెప్పినట్లు తెలిపాడు. పటియాలా మిలిటరీ కంటోన్మెంట్‌కు సంబంధించిన చిత్రాలను సైతం అతడు పాక్ అధికారులకు అందించాడు. దేవేంద్రసింగ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ దర్యాప్తుకు పంపించాం. డబ్బు లావాదేవీలకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నాం. దీనిపై పూర్తి దర్యాప్తు కొనసాగుతోంది. ఇక ఇటీవల పాకిస్తాన్ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తున్న ఒక వ్యక్తిని సైతం పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా పని చేస్తున్న రవీంద్రకుమార్ ఓ అమ్మాయి వలపు వలలో చిక్కి భారత సైన్యం ఆయుధాలకు సంబంధించి సున్నితమైన సమాచారాన్ని పాక్ అధికారులకు చేరవేశాడు. దీంతో పాటు గగన్‌యాన్ ప్రాజెక్టు వివరాలను అందించినట్లు విచారణలో తేలింది. పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఐఎస్ఐ సభ్యులతోనూ అతడు నేరుగా టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడయింది.

# ఇటలీ పిఎం మెలోనికి మోకాలిపై కూర్చొని అల్బేనియా ప్రధాని స్వాగతం



**టిరానా, మే 17:** అల్బేనియా రాజధాని టిరానాలో ఐరోపా రాజకీయ కమ్యూనిటీ సదస్సు జరిగింది. ఈ సమావేశానికి యూరోపియన్ యూనియన్ దేశాల నేతలు హాజరయ్యారు. అయితే, ఈ సదస్సుకు విచ్చేసిన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అల్బేనియా దేశ ప్రధాని ఎడి రమా స్వాగతం పలికిన తీరు ఆసక్తికరంగా మారింది. మోకాలిపై కూర్చొని ఎడి.. ఆమెను ఆహ్వానించారు. మెలోనీ కారు దిగి వేదిక వద్దకు వస్తుండగా అల్బేనియా ప్రధాన మంత్రి ఎడి మోకాలిపై కూర్చొని చేతులు జోడించి నమస్కారం చెబుతూ స్వాగతం పలికారు. వర్షంలోనూ ఆయన పలికిన ఈ ఆత్మీయ ఆహ్వానానికి మెలోనీ ఫిదా అయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కాగా మెలోనీ తన 'ఇటాలియన్ సిస్టర్' అని చెప్పే ఎడి రమా ఆమె ఎప్పుడు కనిపించినా సరే ఇలాగే పలకరిస్తారు. ఈ యేడాది జనవరిలో మెలోనీ పుట్టినరోజు నాడు ఓ సదస్సులో కలిసిన ఎడి.. ఆమెకు మోకాలిపై కూర్చొని స్కార్ఫ్‌ను కానుకగా ఇచ్చారు. ఇటాలిన్ భాషలో ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అప్పుడు కూడా వీరి విడియో నెట్టింట తెగ చక్కర్లు కొట్టింది.


# గడువు దాటితే అమెరికా నుంచి బహిష్కరణ

## కీలక అడ్వైజరీ జారీ చేసిన భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం

**న్యూఢిల్లీ, మే 17:** నిర్దేశిత గడువు దాటి అమెరికాలో ఉంటున్నవారిని ఉద్దేశించి భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఈ అంశంలో ఉల్లంఘనకు పాల్పడితే కలిగే తీవ్ర పరిణామాలను స్పష్టంగా వెల్లడించింది. బహిష్కరణ ముప్పు తప్పదని, అదేవిధంగా భవిష్యత్తులో అమెరికాకు ప్రయాణంపై శాశ్వత నిషేధం ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఎంబసీ పోస్టు పెట్టింది. పర్యాటక, విద్యార్థి, వర్క్ పర్మిట్స్ సహా వివిధ వీసాలపై అమెరికాలో నివసిస్తోన్న భారతీయులను ఉద్దేశించి ఈ హెచ్చరిక చేసింది. అమెరికా ప్రయాణంపై నిషేధం పడితే భవిష్యత్తులో అక్కడ చదువు, వృత్తి వ్యక్తిగత అవకాశాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది. నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత ఏవైనా అనుకోని పరిస్థితుల కారణంగా దేశాన్ని వీడటంలో ఇబ్బందులు ఏర్పడితే చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోకుండా ఉండేందుకోసం యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. కాగా అమెరికాలో గడువుకు మించి ఉంటున్నవారు తక్షణమే దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని అక్కడి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం గతంలో హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. అమెరికాలో 30 రోజులకు నిబంధనలకు మించి నివసిస్తున్న వారు ఖచ్చితంగా ఫెడరల్ గవర్నమెంట్ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్షలు విధిస్తారు. అందుకే ఇప్పుడే సొంతంగా వెళ్లిపోండి అని గతంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నిబంధనలు పాటించకపోతే తక్షణమే దేశం నుంచి పంపిచేస్తామని పేర్కొంది. అంతేకాదు ఫైనల్ ఆర్డర్ అందుకొన్న వారు ఒక్కరోజు అధికంగా ఉంటే రోజుకు 998 డాలర్ల ఫైన్, సొంతంగా వెళ్లిపోకపోతే 1,000 నుంచి 5000 డాలర్ల ఫైన్ విధించనున్నారు. జైలు శిక్షను కూడా విధించే అవకాశం ఉందని, వారికి భవిష్యత్తులో చట్టపరమైన మార్గంలో కూడా అమెరికాలోకి ప్రవేశం లభించదని చెప్పింది.

# భారత్ క్షిపణుల దెబ్బ తగిలింది

## పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ అంగీకారం



**ఇస్లామాబాద్, మే 17:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో దాయాది పాకిస్థాన్ వణికిపోయింది. మన మిలిటరీ దాడులు ఆ దేశ వైమానిక దళాన్ని చావుదెబ్బ కొట్టాయి. శత్రువుల కీలక వైమానిక స్థావరాలను మన క్షిపణులు ధ్వంసం చేశాయి. అయితే, ఈ నష్టంపై ఇన్నాళ్లు బుకాయిస్తూ వస్తోన్న పాక్ తాజాగా దాన్ని అంగీకరించింది. భారత క్షిపణుల దెబ్బ తమకు తగిలిందని స్వయంగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ధ్రువీకరించారు. శుక్రవారం రాత్రి ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ షెహబాజ్ ఈ విషయాన్ని వెల్లడించారు. మే 9-10 మధ్య రాత్రి సమయంలో రావల్పిండిలోని నూర్‌ఖాన్‌సహా ఇతర వైమానిక స్థావరాలపై భారత్ దాడి చేసినట్లు పాక్ ప్రధాని అంగీకరించారు. ఇందుకు సంబంధించిన విడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

**ఆ సమయంలో ఈత కొడుతున్నా: షెహబాజ్**

'ఆ రోజు తెల్లవారుజామున ప్రార్థనలు ముగించుకుని ఈత కొట్టేందుకు వెళ్లా. నా సెక్యూర్డ్ ఫోన్ మాత్రమే తీసుకెళ్లా. రెండుసార్లు మోగింది. ఆర్మీ ఛీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ లైన్‌లో ఉన్నారు. ఫోన్ ఎత్తగానే భారత్ దాడులు చేస్తున్న విషయాన్ని చెప్పారు. వాటిని ఎదుర్కొనేందుకు వైమానిక దళం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతోపాటు చైనా యుద్ధ విమానాలను కూడా వినియోగిస్తోందని మునీర్ తెలిపారు' అంటూ షెహబాద్ వివరించారు. అయితే, భారత్‌పై పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లు కూలిపోయిన విషయాన్ని మాత్రం ఆయన చెప్పకపోవడం గమనార్హం. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సైనిక స్థావరాలు, పౌర నివాసాలను లక్ష్యంగా చేసుకుని పాక్ దాడి చేసింది. దీంతో న్యూఢిల్లీ ప్రతిదాడికి దిగింది. అత్యంత కచ్చితత్వంతో పాక్‌లోని దాదాపు డజను సైనిక స్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. ఇందులో ఆ దేశానికి అత్యంత కీలకమైన పాక్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ ఉన్న చక్లాలలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌తో పాటు సర్గోదా, భోలారీ వైమానిక స్థావరాలున్నాయి. దాడుల్లో ఇవి ధ్వంసమైన తీరు ఉపగ్రహ చిత్రాల్లో బయటికొచ్చింది. పాక్ వాయుసేనకు చెందిన దాదాపు ఐదోవంతు మౌలిక వసతులు, ఫైటర్‌జట్లు భారత్ దాడిలో ధ్వంసమైనట్లు సమాచారం.

# పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించేందుకు ఎంపిల బృందం



**న్యూఢిల్లీ, మే 17:** ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై తీసుకుంటున్న దౌత్య చర్యల్లో భాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు ఎంపిల పేర్లను శనివారం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. ఎంపిలు శశిథరూర్(కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్ (బిజెపి), బైజయంత్ పాండా (బిజెపి) సంజయ్ కుమార్ ఝా (జెడియు), కనిమొళి (డిఎంకె), సుప్రియా సూలే (ఎన్సీపి, ఎస్పీ), శ్రీకాంత్ శిండే (శివసేన) విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో అయిదు దేశాలకు వెళతాయి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం విపక్షాలతో చర్చలు జరిపి బృంద సభ్యులను ఎంపిక చేసింది. వీరు మే 22న విదేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏ విధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. వీరు ముఖ్యంగా అయిదు అంశాలను ప్రపంచ దేశాలకు వివరించనున్నారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు. పాక్ బెదిరింపులకు దీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరణ. భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత. ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే ఖచ్చితంగా లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్తాన్ అనుసరిస్తున్న పాత్రను దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును వివరించడం. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్, పాక్‌పై అనేక దౌత్య చర్యలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం రద్దు, పాక్ పౌరులను తిరిగి స్వదేశానికి పంపడం, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవడం వంటి చర్యలు చేపట్టింది. అనంతరం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసి, ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం విదేశాల రాయబారులు, మంత్రులకు ప్రత్యేక బ్రీఫింగ్ ఇచ్చింది.

# బిన్‌లాడెన్ ఆపరేషన్ తరహాలోనే 'సిందూర్': ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



**లక్నో, మే 17:** ఆపరేషన్ సిందూర్‌పై భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉగ్రవాది బిన్ లాడెన్‌ను అమెరికా వేటాడి అంతమొందించిన ఘటనతో ఆపరేషన్ సిందూర్‌ను పోల్చారు. భారత్ మునుపెన్నడూ లేని విధంగా పాకిస్థాన్‌లోకి చొచ్చుకొని వెళ్లి మరీ ఉగ్రమూకలను ఏరిపారేసిందని చెప్పారు. 2 మే 2011న అమెరికా దళాలు ఇదే విధంగా వ్యవహరించాయని లాడెన్ పేరు ప్రస్తావించకుండా ధన్‌ఖడ్ మాట్లాడారు. ప్రపంచానికి తెలిసేలా భారత్ చేసి చూపించింది. శాంతియుత వాతావరణానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఉగ్రవాదుల్ని తుదముట్టించడం ద్వారా ఒక గ్లోబల్ బెంచ్ మార్క్‌ను సెట్ చేసిందని ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ధన్‌ఖడ్ అన్నారు.

భారత్ ఎంతో కచ్చితత్వంతో దాడులు చేసిందని, ఉగ్ర శిబిరాలకు మాత్రమే నష్టం వాటిల్లిందని చెప్పారు. అమెరికా చరిత్రలో అత్యంత విషాద ఘటనగా మిగిలిన ఘటన వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై 11 సెప్టెంబర్ 2001లో (9/11) అల్‌ఖైదా జరిపిన ఉగ్రదాడి. ఈ దాడిలో దాదాపు మూడువేల మంది ప్రాణాలు కోల్పోయారు.

# వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

## - పట్టువస్త్రాలు సమర్పించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



**ఉరవకొండ, మే 17 ప్రభాతవార్త** అనంతపురం జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఉరవకొండ మండల పరిధిలోని పెన్నహోబిళ క్షేత్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామివార్ల బ్రహ్మ రథోత్సవం స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం వైశాఖ శుద్ధ బహుళ పంచమి శనివారం సాయంత్రం అత్యంత వైభవంగా, నేత్రపర్వంగా జరిగింది. ఈనెల 9వ తేది శుద్ధ ద్వాదశి శుక్రవారం నుండి ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాతం, మహాభిషేకం, అలంకరణ, బలిహరణ, మంగళహారతి కార్యక్రమాల కొనసాగాయి. ఉదయం రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మేళతాళలు మంగళవాయిద్యాల నడుమ రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రధానాలయంలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు పట్టువస్త్రాలతో ఘనంగా సత్కరించి శ్రీవారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నృసింహస్వామివారి ఉత్సవమూర్తులను మంత్రి పయ్యావుల కేశవ్ మోస్తూ మేళతాళాల నడుమ ప్రత్యేకంగా ముస్తాబుచేసిన రథంవద్దకు తీసుకురాగా రథంలో ప్రతిష్టించి బ్రాహ్మణులు మడుగుతేరు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా మంత్రి పయ్యావుల కేశవ్ రథాన్ని లాగారు. సాయంత్రం రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులు నమో నారసింహ అంటూ బ్రహ్మరథాన్ని (ధూళోత్సవం) నిర్వహించారు. ఉద్భవలక్ష్మి ఆలయంవద్ద నుండి ప్రధాన ఆలయమున్న కొండచుట్టూ రథాన్ని లాగి తిరిగి యథాస్థానానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమం అరగంటపాటు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు, సీఎఫ్‌వో డి.పాండురంగారెడ్డి, తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీచార్, గుండురావుస్వామి, వాసుస్వామి, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ జిల్లా జైలు సూపరింటెండెంట్ హంసా పాల్ బదిలీ

**విజయవాడ,మే17,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని జిల్లా జైలు సూపరింటెండెంట్ హంసా పాల్ బదిలీ అయ్యారు. ఆయన్ని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి బదిలీ చేసారు.దాంతో పాటు నెల్లూరులోని శిక్షణ కేంద్రానికి అటాచ్ చేశారు. జైళ్లశాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్లుగా ఉన్న మహ్మద్ ఇర్ఫాన్, కాంతారాజ్, వెంకటరెడ్డిలను అదనపు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పించారు. మహ్మద్ ఇర్ఫాన్‌ను విజయవాడ కారాగారానికి, కాంతారాజ్‌ను గుంటూరు, వెంకటరెడ్డిని చిత్తూరు జైలుకు బదిలీ చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం విజయవాడ జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న హంసా పాల్ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విధేయుడిగా ముద్రపడ్డారు. గతంలో అక్రమాస్తుల కేసులో జగన్ బృందం చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్నప్పుడు పాల్ అక్కడ జైలర్‌గా ఉన్నారు. జగన్ పాలనలో జరిగిన అక్రమాలకు సంబంధించిన కేసుల్లో నిందితులు విజయవాడ జైలులోనే రిమాండ్‌లో ఉన్నారు. దీంతో ఇక్కడి పర్యవేక్షకుడిని బదిలీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# పచ్చని చెట్లను పెంచుదాం, ఎండ వేడిమిని అధిగమిద్దాం..

## ఎన్టీఆర్‌జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి

**విజయవాడ,మే17,ప్రభాతవార్త ప్రతినిధి:** స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, పచ్చదనానికి ప్రాధాన్యతనిచ్చి చెట్లను పెంచడం ద్వారా ఎండ వేడిమిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ) ఎన్‌టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో "బీట్ ద హీట్" నినాదంతో సత్యనారాయణపురం సర్కిల్ 2 కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమానికి భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ) ఎన్‌టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై స్వచ్ఛత కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి అనంతరం మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాల విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. ప్రభుత్వ పరంగా చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతులను చేసి వాటిని విజయవంతం చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమన్నారు. ఎండ వేడిని అధికమించేందుకు చెట్లను నాటి సంరక్షించడమే ఏకైక మార్గం అన్నారు. సాధారణంగా పట్టణాలలో ఎక్కువ శాతం భూమి కాంక్రీట్ తో కప్పబడి ఉంటున్న కారణంగా మొక్కలు పెరిగే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. అందువల్ల పట్టణ ప్రాంతంలోని ప్రజలు అధిక వేడిమి బారిన పడతారన్నారు. దీనిని అధికమించేందుకు ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రైవేట్ స్థలాలలో కూడా మొక్కలను నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.




బీట్ ద హీట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్‌జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి

# సేంద్రియ ఎరువుల గుంతలపై అవగాహన కల్పించండి : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** పారిశుద్ధం సమస్యకు చెక్ పెట్టేందుకు సేంద్రియ ఎరువుల గుంతల(కంపోస్ట్ పిట్)పై పెద్దఎత్తున ప్రజలకు అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ జిల్లాకలెక్టర్ లక్ష్మీశ అన్నారు.మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు దోహదం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో తొలివిడత లక్ష్యమైన 17 వేల గుంతలకు అంచనాలు రూపొందించాలన్నారు. వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. శనివారం జిల్లాలోని జి.కొండూరులో సేంద్రియ ఎరువుల గుంతల తవ్వకం కార్యక్రమాన్ని కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో సేంద్రియ ఎరువుల గుంతలను ప్రజలు ఎలాంటి ఖర్చు లేకుండా ఏర్పాటు చేసుకోవచ్చన్నారుఏ. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండు రకాల గుంతలు అందుబాటులో ఉన్నాయన్నారు.. టైప్2లో మీటరు వ్యాసంతో 3 అడుగుల లోతుగల గుంతలను రెండింటిని వాటికి తవ్వినమట్టిని ఒక అడుగు వదిలి చుట్టూ గుట్టగా వేయాలన్నారు,. దీనికి రెండు పనిదినాలు కల్పిస్తారు. ఇంటివద్ద వంట గది వ్యర్థాలతో ఇతర ఇంటి వ్యర్థాలతో వీటిని నింపి ఒక గుంత నిండిన తరువాత రెండో గుంత ఉపయోగించడం జరుగుతుంది. టైప్ 1 కంపోస్టు పిట్ పశువులు కలిగిన ఇళ్లు లేదా పశువుల షెడ్ల వద్ద ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. 1.5 మీ. పొడవు, 1.5 మీటర్ల వెడల్పు, 3 అడుగుల ఒకటి లేదా రెండు గుంతలను పశువులు కలిగిన ఇళ్ల వద్ద/పశువుల షెడ్ల వద్ద ఏర్పాటు చేసుకుంటారు వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చేందుకు నిర్మాణం చేయడం జరుగుతుందని, ఒక గుంత నిర్మాణానికి మూడు పనిదినాలు చొప్పున రెండింటికీ ఆరు పనిదినాలు కల్పిస్తారు. ఈ గుంతల ద్వారా పశు వ్యర్థాలను, పశువుల పేడ వంటివాటిని ఇందులో వేసి కంపోస్టుగా మార్చవచ్చు. దీనివల్ల పారిశుద్ధం మెరుగుపడటంతో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటుందన్నారు. కంపోస్టు పిట్‌లతో సరైన విధానంలో వివిధ వ్యర్థాలు పూర్తిస్థాయి సేంద్రియ ఎరువుగా మారుతుందని, వీటిని మనం రసాయన ఎరువుల జోలికి పోకుండా ఆరోగ్యకరంగా ఎరువును పొలాలకు ఉపయోగించుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశవివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు.మిగిలిన వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.రాము, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీపీవో పి.లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రక్తపోటు శిభిరాన్ని కలెక్టర్ లక్ష్మీశపారంభించి రక్తపోటు పరీక్షలను చేయించుకున్నారు.

# లిక్కర్ స్కామ్ పూర్తిగా రాజకీయ ప్రేరేపితం

## జగన్ అరెస్టే లక్ష్యంగా దీన్ని సృష్టించారు : మాజీ మంత్రి పేర్ని నాని



**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కర్ స్కామ్ పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, జగన్ అరెస్టే లక్ష్యంగా దీన్ని సృష్టించారని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) తెలిపారు. వైకాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పేర్ని మీడియాతో మాట్లాడారు. ఒక్క ఆధారం కూడా లేకుండా సాక్షుల స్టేట్‌మెంట్లతో కేసు నడిపిస్తున్నారని, స్కిల్ స్కామ్ కేసులో జైలుకు పంపారన్న కక్షతోనే చంద్రబాబు కుట్రను నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఎపి లిక్కర్ స్కామ్ రాజకీయ ప్రేరేపితమని అత్యున్నత న్యాయస్థానం బెయిల్ రిజక్టు ఆర్డర్‌లోనే స్పష్టంగా పేర్కొనడం కూటమి కక్షసాధింపులకు నిదర్శనమని తెలిపారు. కృష్ణమోహన్‌రెడ్డి, ధనంజయరెడ్డి బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన ఆర్డర్‌లో ప్రస్తావించిన అంశాలను చూస్తే ఈ విషయం తేటతెల్లమవుతోందన్నారు. ఇది పూర్తిగా తప్పుడు కేసని అన్నారు. ధనంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి ఇద్దరూ ఎవరికీ లబ్ధి కలిగించాలని సిఫార్సు చేయలేదని అన్నారు. ఈ కేసులో ఆధారాలు లేవని విచారణ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ తప్పుకున్నారని, ఆనంతరం అనుకూల అధికారిని తీసుకొచ్చారని పేర్కొన్నారు. భారతీ సిమెంట్స్‌ను అమ్మేశారని, అయినా దానితో సంబంధం ఉందని జగన్‌పై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రిటైర్డ్ ప్రభుత్వాధికారులు కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డిల బెయిల్ పిటీషన్లను తిరస్కరిస్తూ సుప్రీంకోర్ట్ ఇచ్చిన ఆర్డర్‌లో ప్రస్తావించిన అంశాలను చూస్తే ఈ విషయం తెట్టతెల్లమవుతోందని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయి జైలుకు వెళ్ళిన చంద్రబాబు దానికి ప్రతిగా కక్షతోనే ఈ తప్పుడు కేసును సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి తప్పుడు కేసులతో వైయస్ జగన్‌ను భయపెట్టాలని అనుకోవడం వారి అవివేకమని అన్నారు. తాజాగా కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డిల బెయిల్‌ను సుప్రీంకోర్ట్ తిరస్కరించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ఆర్డర్‌లో ఈ కేసు రాజకీయ ప్రేరేపితంగా కనిపిస్తున్నప్పటికీ ఏపీ ప్రభుత్వ వాదనలు కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నదని పదేపదే చెబుతున్నారు కాబట్టి, న్యాయస్థానాలు పోలీస్ విచారణలో తలదూర్చకూడదనే కారణంతో బెయిల్ ఇవ్వడం లేదని చెప్పారు. అంటే సుదూరంలోని సుప్రీంకోర్ట్ న్యాయస్థానానికి కూడా ఇది రాజకీయ ప్రేరేపిత, కక్షసాధింపు కేసు అని అర్థమయ్యింది. కానీ ఇక్కడ ఉన్న మీడియాకు మాత్రం పొరపాటున ఇది కక్షసాధింపు అని కనిపించదు. ఎందుకంటే రాష్ట్రంలో సర్వం చంద్రబాబు మయం అయిపోయింది. సాధారణంగా ఎక్కడైనా ఒక పిటీషన్ వస్తే దానిపై ఏ విచారణా సంస్థ అయినా ఒక్కో ఆధారాన్ని సేకరిస్తూ, దానిని బట్టి ఎవరి పాత్ర దానిలో ఉందో నిర్ధారించుకుంటూ ముందుకు సాగుతారు. కానీ లిక్కర్ కేసులో వైయస్ జగన్ లక్ష్యంగా కేసును మొదలుపెట్టారు. ఎక్కడా ఒక్క సాక్ష్యం, ఒక్క ఆధారం లేకుండానే ఎవరినో పట్టుకోవడం, వారిని బెదిరించడం వారి వాఙ్మూలంతో మరొకరిపై కేసు నమోదు చేయడం చేస్తున్నారు. స్కిల్ స్కామ్‌లో రూ. 370 కోట్ల ప్రజాధనంను లూటీ చేసిన ఘటనలో చంద్రబాబు ఆధారాలతో సహా దొరికిపోయారు. నాడు ఏలేరు స్కామ్ నుంచి నేడు స్కిల్ స్కామ్ వరకు దేనిపైనా విచారణ ముందుకు సాగనివ్వకుండా ఆయన తన పరపతిని, డబ్బును వినియోగించి స్టేలు తెచ్చుకుని కొనసాగుతున్నారు

## రైలు ప్రయాణికుల మొబైల్స్ చోరీలపై ఆర్‌పిఎఫ్ డేగ కన్ను!

### ఆపరేషన్ అమానత్ కింద మొబైల్ రికవరీలు

**గుంతకల్లు రైల్వే,మే 17,ప్రభాతవార్త** రైలు ప్రయాణికుల రక్షణ,భద్రతలపై రైల్వే రక్షకదళం(ఆర్‌పిఎఫ్) డేగ కళ్లతో ప్రత్యేక దృష్టి సారించింది. దక్షిణ మధ్య రైల్వేలోని రైల్వే రక్షణ దళం ప్రయాణికులకు గణనీయమైన సేవలను అందించే దిశలో భాగంగా ఆపరేషన్ అమానత్ కింద ప్రయాణికులు కోల్పోయిన మొబైల్ ఫోన్లను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శోధించి గుర్తించడం ద్వారా తిరిగి పొందడానికి డిజిటల్ సాధనాలను సమర్థవంతంగా తన ప్రయత్నాలను విస్తృతంగా విస్తరించింది. ఏప్రిల్ 3న సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సిఇఐఆర్) పోర్టల్‌కు యాక్సెస్ ఇచ్చిన తర్వాత, ఆర్పీఎఫ్ సైబర్ సెల్ వెంటనే రంగంలోకి దిగింది. తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని స్పష్టమైన ఫలితాలుగా మార్చింది. రైలు మదద్ ద్వారా సంఘటనను నివేదించి నమోదు చేసినప్పుడు మాత్రమే కోల్పోయిన సొత్తును రికవరీ చేయడానికి ఆర్‌పిఎఫ్ అధికారం ఉంది. ఈకేసులో ఫిర్యాదుదారు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ అభివృద్ధి చేసిన సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఐఎంఈఐ ఆధారిత ట్రాకింగ్, పోయిన లేదా దొంగలించబడిన పరికరాలను బ్లాక్ చేయడానికి వీలవుతుంది. అయితే ఆర్‌పిఎఫ్ ప్రత్యేక సైబర్ సెల్ జోన్ వ్యాప్తంగా రికవరీ ఆపరేషన్లను నడపిస్తున్నది. విజయవాడ డివిజన్ నుంచి ఏప్రిల్ 13న మొదటి ఫిర్యాదు నమోదైంది. అప్పటి నుంచి ఆర్‌పిఎఫ్ సైబర్ సెల్ దక్షిణ మధ్య రైల్వేలో మొత్తం 123 ఫిర్యాదులను పరిష్కరించింది.




# వ్యక్తిగత లాభం కోసం కాకుండా సమాజోద్ధరణకై విద్యను ఉపయోగించాలి

## ఆవిష్కరణ ఫలాలు అట్టడుగు స్థాయి వరకు చేరాలి

## రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

## ఘనంగా జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవం

**అనంతపురం సిటీ, మే 17 ప్రభాతవార్త** విద్యార్థులు తమ విద్యను వ్యక్తిగత లాభం కోసం కాకుండా సమాజోద్ధరణకై ఉపయోగించాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సూచించారు.జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవం ఎన్టీఆర్ ఆడిటోరియంలో జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ ప్రొ.హెచ్.సుదర్శనరావు అధ్యక్షతన నిర్వహించారు.జేఎన్టీయూ కులపతి హోదాలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరుకాగా,ఐఐటి కాన్పూర్ సివిల్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్. మాధవ్ ముఖ్యఅతిథిగా.పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లారెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా.సత్యనారాయణ చావకు గౌరవ డాక్టరేట్ ను రాష్ట్ర గవర్నర్ ప్రధానం చేశారు..అదే విధంగా 26 మంది విద్యార్థులకు 41 బంగారు పథకాలను గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అందజేశారు అన్ని విభాగాలలో ప్రతిభ చూపి పూజిత్ కుమార్ రెడ్డి అత్యధికంగా ఆరు బంగారు పథకాలు,సుప్రజా నాలుగు బంగారు పతకాలను అందుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ 21వ శతాబ్దపు సవాళ్ళ, అవకాశాలకు యువతను సిద్ధం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యా సంస్కరణలకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. జాతీయ విద్యా విధానం (విని) 2020 అమలు ద్వారా కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో నాలుగు సంవత్సరాల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు, ప్రవేశ నిష్క్రమణ ఎంపికలు, బహుళక్రమశిక్షణా కోర్సులు మరియు ఎంపికఆధారిత క్రెడిట్ వ్యవస్థలను ప్రవేశపెట్టిందన్నారు..రొటీన్ లెర్నింగ్ నుండి నైపుణ్య అభివృద్ధి, విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత ఆవిష్కరణలపై దృష్టి మళ్లిందన్నారు.అనంతపురం జేఎన్టీయూ ఇప్పటికే ఎన్ఈపి 2020 సిఫార్సులను అమలు చేసి దాని ప్రయోజనాలను పొందుతోండటం హర్షించదగ్గ విషయమన్నారు.మీ అభ్యాసం సమాజ భాగస్వామ్యంగా మారనివ్వాలని గ్రామీణ భారతదేశం కోసం స్వచ్ఛందంగా ముందుకు సాగి ఆవిష్కరణలు చేయాలని స్థిరమైన పరిష్కారాలను నిర్మించాలని సూచించారు.ఈ గ్రామాల భూమిలో, మీ ప్రభావం కార్పొరేట్ బోర్డు గదులను దాటి అట్టడుగు స్థాయి వరకు చేరుకోవాలని ఆకాంక్షించారు."చీమను చూసి క్రమశిక్షణను నేర్చుకో, భూమిని చూసి ఓర్పును నేర్చుకో, చెట్టును చూసి ఎదుగుదల నేర్చుకో, ఉపాధ్యాయుని చూసి సుగుణాలను నేర్చుకో" అని భారత మాజీ రాష్ట్రపతి భరతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ ఒక సందర్భంలో మాట్లాడారని విద్యార్థులకు గుర్తు చేశారు.ప్రపంచం మీ ఆలోచనలు, మీ నాయకత్వం, మీ కరుణ కోసం ఎదురు చూస్తోందని ధైర్యంగా వినయంతో ముందుకు సాగండని సూచించారు.అదే విధంగా జేఎన్టీయూ అనంతపురం వారసత్వాన్ని గర్వంగా ముందుకు తీసుకెళ్లండని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ స్నాతకోత్సవంలో డిగ్రీపట్టాలు అందుకున్న విద్యార్థులు అందరిని గవర్నర్ అభినందనందించారు. ముఖ్యఅతిథిగా హాజరయిన ఐఐటి కాన్పూర్ సివిల్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రొ.ఎంఆర్. మాధవ్ మాట్లాడుతూ ఈ కాన్వకేషన్ మీ ప్రయాణానికి ముగింపు కాదని,కొత్త ప్రారంభమని దేశం యొక్క భవిష్యత్తును రూపొందించే అభ్యాసకులు, నాయకులు, సృష్టికర్తలని సూచించారు.

# తిరుమలలో గొల్లశరభయయాదవ్ విగ్రహం ఏర్పాటుచేయాలి

## - సిఎస్‌కు యాదవ సంక్షేమ ఛైర్మన్ వినతి



**తిరుమల,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కొలువైన ఆలయం తలుపులు తెరిచే సన్నిధిగొల్ల తొలివ్యక్తి శరభైయాదవ్ విగ్రహాన్ని తిరుమలలో ఏర్పాటుచేయాలని రాష్ట్ర యాదవసంక్షేమ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ జి.నరసింహయాదవ్ కోరారు. నేటికీ ఆ దేవదేవుని ప్రథమదర్శనం సన్నిధిగొల్లలకేనని ,అంతటి ప్రాధాన్యత ఉన్న కులంలో శరభైయాదవ్ తొలిసారిగా స్వామివారు తిరుమలకు వేంచేసిన రోజుల్లో పుట్టలో దాగివున్న సమయంలో తొలుత గుర్తించి గోమాత పాలుఇచ్చేలా ఈయన చేసినసేవలు నిదర్శనమన్నారు. దేశంలో అతిపెద్దకులమైన యాదవకులానికి న్యాయం చేయాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. ప్రథమంగా వేంకటేశ్వరస్వామి దర్శనభాగ్యం కలిగి వున్న యాదవ వంశంలో శరభైయాదవ్ సన్నిధి గొల్లఅని, ఈ మేరకు యాదవసంఘం తొలి సమావేశంలో దీన్ని ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపారు. తిరుమలలో తరిగొండ వెంగమాంబ, అనంతాళ్వారు, తిరుమలనంబి,బావాజీ మహంతు స్వామిభక్తులకు మఠాలు, ఉద్యానవనాలు ఉన్నాయని, సన్నిధిగొల్లలకు ఎలాంటి జ్ఞాపకాలు లేవన్నారు. దీన్నిబట్టి తిరుమలలో నిజమైన భక్తుడు శరభైయాదవ్ విగ్రహం ఏర్పాటుకు చూడాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి తమ విజ్ఞప్తి చేస్తామని నరసింహయాదవ్ తెలిపారు. ఈ విషయంపై యాదవసంఘం నాయకులు ఈతమాకుల హేమంత్‌కుమార్‌యాదవ్, చింతాభరణియాదవ్, మునస్వామి యాదవ్ పాల్గొన్నారు.

# స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రపై ప్రజలను చైతన్యవంతులను చేద్దాం : డిఎఫ్ఎస్ఒ ఎ.రవీంద్రరావు



జిల్లా సమాచార, పౌర సంబంధాల కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** పరిసరాలను పరిశుభ్రపరచడంతో పాటు ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా స్వర్ణాంధ్ర -2047 లక్ష్యాలను చేరుకోగలుగుతామని జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి ఎ.రవీంద్రరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర,స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలో గల జిల్లా సమాచార, పౌర సంబంధాల కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి ఎ.రవీంద్రరావు, డా. ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ జె.సుమన్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల డీసీవో ఎ.మురళీకృష్ణలు, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్నారు. బీట్ ది హీట్ ఇతివృత్తంతో ఈ నెల స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జరుపుతున్న నేపథ్యంలో రవీంద్రరావు.. సహచర అధికారులతో కలిసి కార్యాలయ సందర్శకులకు చల్లని తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా పచ్చదనం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమిచ్చి, ప్రజా భాగస్వామ్యంతో స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతి మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, ఆవరణల్లో ప్రత్యేకంగా స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి అధికారి, సిబ్బంది ఇందులో పాల్గొనడం బాధ్యతగా గుర్తెరగాలని అప్పుడే ప్రజలు చైతన్యవంతులై స్వచ్ఛందంగా స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కాగలుగుతారన్నారు. కార్యాలయానికి వచ్చే సందర్శకులకు పచ్చదనం, పరిశుభ్రత గురించి చాటిచెప్పే విధంగా నినాదాలతో కూడిన స్టిక్కర్లను ప్రదర్శించాలన్నారు.

# అసలైన లిక్కర్ స్కాం కూటమి ప్రభుత్వంలోనే ఉంది

## - వైఎస్సార్సీనేత అనంత వెంకటరామిరెడ్డి




**అనంతపురం, మే 17 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న కక్షసాధింపు రాజకీయాలకు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ నాయకులపైనే కాకుండా ఐఏఎస్, ఐపీఎస్‌లపై కూడా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కొందరు అధికారులకు పోస్టింగ్స్ కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. పక్క రాష్ట్రాల వాళ్లు కూడా విస్తుపోయే పరిస్థితి వచ్చిందన్నారు. గతంలో స్కిల్ స్కాంలో చంద్రబాబును సాక్షాధారాలతో అరెస్ట్ చేశారని, ఈ ప్రభుత్వంలో ఏదో ఒక విధంగా జగన్‌పై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారన్నారు. సర్వీస్‌లో ఉన్న వారినే కాకుండా రిటైర్డ్ అయిన అధికారులను కూడా అరెస్ట్ చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ కార్యదర్శిగా పని చేసిన ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, ఓఎస్డీగా పని చేసిన కృష్ణమోహన్‌రెడ్డిని అరెస్ట్ చేయడం కక్షసాధింపు చర్యల్లో భాగమేనన్నారు. లిక్కర్ వ్యవహారంలో ఆధారాలు లేకపోయినా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. 2014 నుంచి 2019 వరకు ఏ డిస్టలరీ ద్వారా మద్యం సరఫరా జరిగిందో అవే డిస్టలరీల నుంచే వైఎస్ జగన్ హయాంలోనూ జరిగాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా అవే డిస్టిలరీలు మద్యం సరఫరా చేస్తున్నాయని తెలిపారు. వైసీపీ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ ఎలాంటి ఆధారాలు లేకపోయినా..తప్పుడు కేసులు పెడుతూ, అందులో అందరి పేర్లు చేరుస్తూ, తప్పుడు సాక్షాలు సృష్టిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చర్యల కారణంగా భవిష్యత్‌లో రాష్ట్రంలో ఏ అధికారీ పనిచేయలేని పరిస్థితిని తీసుకొస్తున్నారన్నారు.

# 23లోగా ఆడిట్ రిపోర్ట్స్, నోడ్యూస్ సర్టిఫికెట్లు సమర్పించండి

## - రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లకు ఎన్నికల అధికారుల ఆదేశం

**గుంతకల్లు రైల్వే,మే 17,ప్రభాతవార్త** రాయలసీమ జిల్లాల పరిధిలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకమండలిలు తమ తమ ఇన్‌స్టిట్యూట్‌లకు సంబంధించిన ఆడిట్ రిపోర్ట్స్,విద్యుత్,వాటర్ బకాయిలకు సంబంధించిన నోడ్యూస్ సర్టిఫికేట్లను ఈ నెల 23లోగా రైల్వే యాజమాన్యానికి సమర్పించాలని సంబంధిత ఉత్తర్వులు జారీ చేశారు. కాలవ్యవధి పూర్తి అయిపోయిన రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లకు త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు డివిజన్ అధికార యంత్రాంగం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. రాయలసీమ,గుంతకల్లు రైల్వేడివిజన్ పరిధిలో పాకాల,గుత్తి,రేణిగుంట, నందలూరు, కడప,గుంతకల్లు,డోన్,రాయచూరులలో రైల్వే ఇన్‌స్టిట్యూట్‌ల నిర్ణీత కాలవ్యవధి పూర్తై మూడు నెలలు అవుతోంది. కాగా 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన తనిఖీ నివేదికలను (ఆడిట్ రిపోర్ట్స్), విద్యుత్, వాటర్ బకాయిలను సంబంధించిన నోడ్యూస్ పత్రాలను(సర్టిఫికేట్) ఈ నెల 23లోగా సమర్పించాలని, ఎన్నికలు అయి కొత్త కమిటీలు ఏర్పడే వరకు ఎలాంటి ఆర్థిక లావాదేవీలకు పాల్పడరాదని ఎన్నికల అధికారులు తమ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రైల్వే యాజమాన్యం జూన్/జూలై మాసాల్లో రైల్వే ఇన్‌స్టిట్యూట్‌ల పాలకమండలిలకు ఎన్నికలు నిర్వహించేందుకు రైల్వే ఎన్నికల అధికార వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి.

# రాకెట్ ప్రయోగాల రాచబాట.. దేశానికి రక్షణకోట



**శ్రీహరికోట (తడ), మే 17 ప్రభాతవార్త** శ్రీహరికోట అనే ఒక దీవి గత ఆరు దశాబ్దాలుగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు గుండెకాయలా మారింది. రాకెట్ ప్రయోగాల రాచబాటగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్న శ్రీహరికోట ప్రస్తుతం దేశ రక్షణకు రక్షణ కోటగా ఎదిగింది. ఆదివారం ఉదయం జరుపుతున్న పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ ద్వారా రక్షణ రంగానికి సేవలు అందించేందుకు ఇఓఎస్09 అనే ఉపయోగాత్మక ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. ఇటీవల దేశ సరిహద్దుల్లో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు, యుద్ధ వాతావరణం నేపథ్యంలో మన రక్షణ రంగానికి సహాయపడే ఉపగ్రహాన్ని ఇక్కడి నుంచి ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే వంద రాకెట్లు ప్రయోగించి చరిత్ర సృష్టించిన ఇస్రో ఆదివారం నాటి ఉపగ్రహంతో మరో చరిత్రకు శ్రీకారంచుట్టనుంది. శ్రీహరికోట పేరు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మార్మోగుతోంది. బుల్లి రాకెట్లతో మొదలై అతిపెద్ద జిఎస్ఎల్‌వి మార్క్3 రాకెట్ల దాకా ఎదిగిన మన షార్ నేడు అంతరిక్షం నుంచి దేశానికి వివిధ సేవలు అందించే ఉపగ్రహాలతో పాటు ఉగ్రవాదుల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టే శక్తివంతమైన ఉపగ్రహం ప్రయోగానికి సిద్ధమైంది. ఇఓఎస్09 అనే ఉపగ్రహం రీశాట్ సిరీస్‌లో ఒకటి. సింథటిక్ అపర్చర్ రాడార్ ఇందులో కీలకమైన పరికరం. అత్యంత శక్తివంతమైన అధునాతన కెమెరాలను ఈ ఉపగ్రహంలో ఉంచి ప్రయోగిస్తున్నారు. 2.4 కిలోవాట్ల పవర్ కలిగిన ఈసుమారు 1700 కిలోల ఉపగ్రహం ఐదేళ్ల పాటు అంతరిక్షం నుంచి దేశానికి రక్షణ రంగ సేవలు అందించనుంది. శ్రీహరికోటలో ఇప్పటికే మొదటి, రెండవ ప్రయోగ వేదికలు ఉన్నాయి.

18-5P□g7exHMNWJQE.qxd:18-5P□g7exHMNWJQE.qxd 01/01/01 7:47 AM Page 1



# వీర జవాన్‌లకు ఒక గుర్తింపు ఇవ్వాలి

## - ప్రాణాలు కోల్పోయిన జవాన్‌లకు రూ. 5 కోట్లు ఇవ్వాలి



**కోవూరు (నెల్లూరు), మే 17, ప్రభాతవార్త :** కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాక్ ఉగ్రవాదుల మూలంగా 26 మంది ప్రాణాలు కోల్పోవడం, అందులో పాకిస్తాన్ పాత్ర పూర్తిగా ఉందని తేటతెల్లమైందని మాజీ మంత్రి , రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి ఉగ్రవాద దాడులకు ప్రధానమంత్రి మోడీ ఆపరేషన్ సింధూర్‌ను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేసి కేవలం 25 నిమిషాల్లోనే ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయడమే కాకుండా వంద మందిపైగా ఉగ్రవాదులను నాశనం చేశారన్నారు. ఇద్దరు మహిళలు ఈ సైనిక పోరాటానికి సారథ్యం వహించడం మహిళా లోకానికే తలమానికం అన్నారు. యావత్ ప్రపంచం ఈ ఆపరేషన్ సింధూర్ ద్వారా భారతదేశానికి ఒక గుర్తింపు వచ్చిందన్నారు. భారత సైన్యం మట్టుపెట్టిన వంద మంది ఉగ్రవాదుల్లో ఐదు మంది ఉన్నారా లేక పరారీ అయ్యారా అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం తేటతెల్లం చేయాలన్నారు. భారతదేశంలో యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు ఒక గుర్తింపు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన పేనర్కొన్నారు. కేవలం 50 లక్షలు ఇచ్చి సరిపెట్టుకోవడం కాదని, కేంద్ర ప్రభుత్వం మూడు కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్లు యుద్ధంలో మరణించిన సైనిక కుటుంబానికి ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన సైనికులకు గుర్తింపు ఇవ్వడమే కాకుండా వారి కుటుంబాలకు ఆసరాగా ఉండాలన్నారు. భారతదేశాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఆపరేషన్ సింధూర్ ద్వారా గుర్తింపు పొందిన ప్రధానమంత్రి మోడీ 20 సంవత్సరాల పాటు ఈ దేశానికి ప్రధానమంత్రిగా ఉండాలని ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని ఈ సందర్భగంఆ పేర్కొన్నారు. కేవలం 25 నిమిషాల్లోనే ఉగ్రవాదుల స్థావరాలను మట్టుపెట్టడంలో మోడీ చూపిన ముందు చూపు ప్రపంచ దేశాలకు వణుకు పుట్టిస్తుందన్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, వైసీపీతో పొత్తు పెట్టుకోవాలని ఉండిందని అనే సమాచారం తనకు వచ్చిందన్నారు. 2019 నుంచి 24 వరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి పార్లమెంట్‌లోనూ,

రాజ్యసభలోనూ ఆ బిల్లులు పాసయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో బీజేపీతో వైసీపీ పొత్తు పెట్టుకుని ఉంటే పరిస్థితి వేరే విధంగా ఉండేదన్నారు. త్వరలో జరగనున్న జమ్లీ ఎన్నికల్లో గానీ, సాధరణ ఎన్నికల్లో గానీ బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని, ఈ విషయాన్ని పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు కూడా తీసుకెళ్తనన్నారు.

# కుప్పంలో 70కోట్లతో ఆధునిక బస్‌స్టేషన్

## - ఆర్టీసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం - 15 నూతన బస్సులు ప్రారంభం - త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు రాక !



ఆర్టీసీ నూతన బస్సుల్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, మే 17 ప్రభాత వార్త** కుప్పంలో రూ. 70 కోట్లతో ఆధునిక బస్‌స్టేషన్ నిర్మాణాలకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారని, అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం ఆర్టీసీ సంస్థ ద్వారా కుప్పం డిపోకు వచ్చిన 15 నూతన బస్సులను ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ కుప్పం డిపోను దేశంలోనే ఆదర్శంగా చేయాలనేది సిఎం చంద్రబాబు కోరిక అన్నారు. అందుకు గాను తగు ప్రణాళికలు రూపొందించామన్నారు. అతిత్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కుప్పం నుంచి వివిధ నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు సైతం అవసరమైన చోట్ల ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ గత వైఎస్సార్సీ హయాంలో కుప్పం డిపో బస్సుల్ని పుంగనూరు, ఇతర ప్రాంతాలకు తరలించి డిపోను భ్రష్టు పట్టించారన్నారు. మరలా సిఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడంతో డిపోకు పూర్వవైభవం వస్తోందన్నారు. కుప్పం డిపోలో ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులో తెచ్చేలా సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు. కుప్పం ప్రాంత అభివృద్ధికి పార్టీలకతీతంగా అందరూ సహకరించాలన్నారు. కుప్పంలో అభివృద్ధి అంటే 2024కు ముందు ఆ తర్వాత అని చెప్పేలా సిఎం చంద్రబాబు కుప్పం ప్రాంత అభివృద్ధికోసం మాస్టర్ ప్లాన్‌కు ఆదేశించారన్నారు. అనంతరం వారు స్వయంగా బస్సుల్ని నడిపి ప్రారంభించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, డా॥ వెంకటేష్, కాణిపాకం వెంకటేష్, జిఎం రాజు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, ఆనందరెడ్డి, మాజీ ఎంపిపి సాంబశివ ం,కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, కడ సభ్యుడు రామచంద్ర, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, సురేష్, వేలు, నేతలు సత్యేంద్రశేఖర్, కన్నన్, మంజు, చెక్కునత్తం మణి, కనకరాజు, డిఎం గోపీనాథ్, జనసేన నరేష్, యూనియన్ల నేతలు పాల్గొన్నారు.

# ఆడపిల్లలను కాపాడుకోవడం మనందరి బాధ్యత!

## - వైద్య, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆగ్రహం



కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన పిసిపిఎన్‌డిటి యాక్ట్-1994 జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం

**చిత్తూరురూరల్, మే 17 ప్రభాతవార్త:** చిత్తూరు నగర నడిబొడ్డున లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతుంటే ఇటు వైద్యశాఖ, అటు స్త్రీ శిశు సంక్షేమశాఖ, ఇతర శాఖల అధికారులు ఏం చేస్తున్నారు! జిల్లాలో అసలు ఏం జరుగుతుందనే సమాచారం అధికారుల వద్ద వుందా! ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన పిసిపిఎన్‌డిటి యాక్ట్-1994 జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొదటి జిల్లా అదనపు జడ్జి ఎస్.రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తమిళ నాడు, కర్నాటక రాష్ట్ర సరిహద్దులో చిత్తూరు జిల్లా వుండటం, జిల్లా కేంద్రం చిత్తూరులో చాలా కాలంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ఇందుకు సంబంధించిన సమాచారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ దృష్టికి రాకపోవడంతో అసలు ఆ శాఖ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారా! లేదా! అని ప్రశ్నించారు. వైద్య ఆరోగ్యశాఖకు క్షేత్ర స్థాయిలో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు అందు బాటులో వున్న ప్పటికీ మొది, రెండు సంతానాల్లో ఆడపిల్లలు వుండి మూడవ సారి ఆ మహిళ గర్భం దాల్చితే ఆ విషయంను ఎందుకు తెలుసుకోలేకపోతున్నారని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశుసంక్షేమశాఖలు కలిసి సిడిపిఓలు, మెడికల్ ఆఫీసర్లతో గత పదేళ్ళుగా ఎప్పుడైనా సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించారా! గర్భిణీ స్త్రీలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అందించే పౌష్టికాహారంను సైతం వారు వచ్చి తీసుకెళ్ళకుంటే వారి ఆరోగ్య పరిస్థితి తెలుస్తోందని, ఈ విషయంలో రెండు శాఖల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కన్పిస్తోందన్నారు. అక్రమ అబార్షన్ల ద్వారా గర్భంలోనే ఆడపిల్లలు మృతి చెందితే సమాజంలో ఆడపిల్లల నిష్పత్తి మరింత తగ్గుతుందన్నారు. జిల్లాలో 2024 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది పురుషులకు 947 స్త్రీలు వున్నారని, ఈ నిష్పత్తి ఇతర జిల్లాలతో పోల్చితే చాలా తక్కువగా వుందన్నారు. జిల్లాలో ప్రధానంగా ఇతర రాష్ట్రాలకు సరిహద్దుగా వున్న నగరి, పలమనేరు, పుంగనూరు, వి.కోట మండలాల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో అనుమతి లేకుండా జరుగుతున్న అబార్షన్‌ల శాతం మిగిలిన మండలాలతో పోల్చితే ఎక్కువ వుందన్నారు. డివిజన్ల వారీగా ఆర్‌ఎంపి డాక్టర్లతో సమావేశాలు నిర్వహించాలని డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణిని కలెక్టర్ ఆదేశించారు. అలాగే మెడికల్ షాపుల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే మందులు ఇవ్వరాదని స్పష్టం చేయాలని డ్రగ్ ఇన్స్‌పెక్టర్లను ఆదేశించారు. అలాగే స్కానింగ్ సెంటర్లను అనధికారికంగా నిర్వహిస్తున్న వారిపై నిఘా వుంచాలని, స్కానింగ్ సెంటర్ల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని మహిళా పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు, జిల్లా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఉషశ్రీ, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కీర్తన, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, ఎస్‌ఐ నాగసౌజన్య, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాజధాని అమరావతి పరిధిలో రెండో దశ ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి విస్తరణలో భాగంగా చేపట్టిన రెండోదశ పూలింగు ప్రక్రియను ప్రభుత్వం నిర్వహిస్తుంది.ఇందుకు సంబంధించి సిఆర్‌డిఏ ఆధ్వర్యంలో గామసభలను అధికారులు పూర్తి చేస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో గ్రామాల రైతులు స్వల్ప అభ్యంతరాల నడుమ పూలింగుకు అంగీకారం తెలుపుతున్నారు ఎటువంటి అడ్డంకులూ లేకుండా భూసమీకరణ ముందుకు సాగాలంటే గతంలో అనుభవం ఉన్న అధికారులను సిఆర్‌డిఏ జిల్లాల పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉన్నతాధికారులతోపాటు 50 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల(ఎస్‌డిసి) అవసరం ఉందని సీఆర్‌డీఏ తెలిపింది. ఈ విషయంలో సీఆర్‌డిఏ నివేదికను అనుసరించి 30 మంది తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీరే పూలింగు సమయంలో కాంపిటెంట్ అథారిగా వ్యవహరించనున్నారు. తొలిగా గతంలో సిఆర్‌డిఏ భూపరిపాలన విభాగం డైరెక్టర్‌గా విశేష అనుభవం ఉన్న చెన్నకేశవులునుడైరెక్టర్‌గా తీసుకుని వచ్చే దిశలో ప్రభుత్వం ఆలోచనల్లో ఉన్నట్లు కొందరు సీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే చెన్నకేశవులు సిఆర్‌డిఎలో పూలింగు ప్రక్రియకు సంబంధించి కార్యాచరణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే ఆయన నియామకంపై స్పష్టమైన ప్రకటన రానున్నట్లు తెలిసింది. గతంలో పనిచేసిన సామర్ధం, రైతులకు అర్ధమయ్యే రీతిలో చెప్పి ఒప్పించగల నేర్పు, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్‌గా చేసిన అనుభవంఉన్న ఐఏఎస్ అధికారి శ్రీధర్‌ను గుంటూరు జిల్లాకు రప్పించే అవకాశం ఉంది.గతంలో ఆయనకు ల్యాండ్‌పూలింగ్ అనుభవం ఉండటంతో తిరిగి సిఆర్‌డిఏ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది.

# కుమ్మరకొండూరులో టపాసులు పేలి పూరిల్లు దగ్ధం

**కలిగిరి (నెల్లూరు), మే 17, ప్రభాతవార్త :** కలిగిరి మండలం కుమ్మరకొండూరులో టపాసులు పేలి పూరిల్లు కాలిపోయిన సంఘటను జరిగింది. బాదితుడు నోటిసుబ్బారెడ్డి తెలిపిన వివరాల మేరకు గ్రామంలో శ్రీపోలేరమ్మతల్లి పొంగళ్లు జరిగాయంటున్నారు. ఈక్రమంలో బక్తులు ఎవరో టపాసులు కాలుస్తుండగా పొరపాటున నిప్పుపడి తమపూరిల్లు కాలిపోయిందన్నారు. ఆసమయంలో తాను ఇంటిలో లేనని గ్రామస్తులే అగ్నిమాపక శిబ్బందికి తెలుపగా మంటలను అదుపు చేయడం జరిగిందన్నారు. ఈప్రమాదంలో వరిదాన్యం, మిర్చి సుమారు రు. 5లోలకు పైగా నష్టంవాటెల్లినట్లు బాదితుడు తెలిపారు. ప్రభుత్వం పరిశీలించి తమను ఆదుకోవాలని బాదితుడు తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్ విజయం ప్రతి భారతీయుడికి గర్వకారణం

## - టిడిపి జాతీయ కోశాధికారి, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, మే 17, ప్రభాతవార్త :** ఉగ్రవాదులపై కేంద్రప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ దిగ్విజయం కావటం, ప్రపంచ దేశాలకు భారత్ సత్తా తెలియటం ప్రతి భారతీయుడికి గర్వకారణమని తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో శనివారం జరిగిన తిరంగా ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘువేంద్ర, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే రాజగోపాల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని వృద్ధి చేసేందుకు చేపట్టిన ఈ యాత్రకు అద్భుతమైన స్పందన లభిస్తోందన్నారు. దేశభద్రతను త్రివిధ దళాలు కాపాడాయని ఈ విజయం మనందరికి అందించిన సైనికులకు రుణపడ్డామన్నారు. మున్సిపల్ చైర్మన్ రాఘువేంద్ర మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారతదేశ కీర్తి మరింతగా విస్తరించిందని, కూటమి ప్రభుత్వం ప్రజల ఆదరాభిమానాలను పొందుతుందని అన్నారు. కార్యక్రమంలో వీరమరణం పొందిన జవానులకు ఘనంగా నివాళులర్పించారు. కాగా కార్యక్రమంలో నేతలు శ్రీరాం ధనుంజయ, నూకల కుమారరాజ, మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధా, ధూళిపాళ లక్ష్మణరావు, కానూరి కిషోర్, బొల్లేపల్లి భోజరాజు, సంగెపు బుజ్జిబాబు, గింజుపల్లి వెంకట్రావు, ఇర్రి నరసింహారావు, నకిరికంటి వెంకట్, కీసర రాంబాబు, మన్నె శ్రీనివాసరావు, మల్లెల కొండ, వేదులాపురి సైదా, కాటగాని నరసింహారావు, రావూరి విశ్వనాథం, కారుపాటి డేవిడ్, రమణ, నాగరాజు, కృష్ణ, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు రాజు, వెంకటేశ్వరరావు, సూర్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ బీట్ ది హీట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘువేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత, నీటి కొరతను నివారించుకోవటం, పర్యావరణాన్ని కాపాడుకోవటం గురించి ప్రజలకు అవగాహన కలిగిస్తూ మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు.

# జెఎన్‌టియూలో డాక్టరేట్ అందుకున్న లారెస్ ల్యాబ్ అధినేత సత్యనారాయణ చావాకు ఎమ్మెల్యే దగ్గుపాటి శుభాకాంక్షలు



**అనంతపురం, మే 17 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న ప్రముఖ పారిశ్రామిక వేత్త, లారస్ ల్యాబ్స్ అధినేత డాక్టర్ సత్యనారాయణ చావాకు అర్బన్ అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవానికి ఛాన్సిలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. జేఎన్టీయూ స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా లారస్ ల్యాబ్స్ అధినేత డాక్టర్ సత్యనారాయణ చావా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన్ని ప్రత్యేకంగా కలిశారు. లారస్ ల్యాబ్స్‌తో పాటు పారిశ్రామిక వేత్తగా సత్యనారాయణ చావా అనేక సేవలందించారని కొనియాడారు. ఆయనందించిన సేవలకు అనంతపురం జేఎన్టీయూ తగిన గుర్తింపునిచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. డాక్టరేట్ అందుకున్న తర్వాత ఆయన్ని కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతపురం వంటి ప్రాంతంలో కూడా మీ సేవల్ని విస్తరించాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై సత్యనారాయణ చావా సానుకూలంగా స్పందించారు.

# దుర్గమ్మ ఆలయంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ



**ఇంద్రకీలాద్రి, మే 17, ప్రభాతవార్త** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో శనివారం స్వచ్ఛ్ భారత్ స్వచ్ఛ్ ప్రతిజ్ఞ నిర్వహించారు. దుర్గమ్మవారి ఆలయం, ఆలయ పరిసరాలు స్వచ్ఛంగా వుంచేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి దేవస్థానం రాజగోపురం వద్ద స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను ఆలయ కార్యనిర్వహాక ఇంజనీర్ కోటేశ్వరరావు, ఏఇఒ ఎన్ రమేష్ బాబులు ఆలయ ఇతరాధికారులు, సిబ్బందితో చేయించారు. అనంతరం ఆలయంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. దుర్గమ్మను దర్శించుకోడానికి వచ్చే విఐపి ప్రోటోకాల్ దర్శనాలను క్రమబద్దీకరిస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. తాజాగా దేవస్థానం రూపొందించిన ఫార్మాట్‌లో పూర్తి వివరాలతో ముందుగా దేవస్థానంకు అందిస్తే అధికారులు పరిశీలించి అనుమతిస్తారన్నారు. పూర్తి పారదర్శకత, ఆలయ భద్రత రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నామని, తప్పక అందరూ అమలు చేయాలన్నారు.

# రాపూరులో చిరు వ్యాపారి దారుణ హత్య

**రాపూరు (నెల్లూరు), మే 17, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరు పట్టణంలో చిరు వ్యాపారం చేసుకునే షేక్ షఫి (50),అనే వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన శనివారం జరిగింది. రాపూరులోని ఫీర్లఛావిడి వీదిలో వున్న షేక్ షఫి వ్యత్తిరిత్యా కూల్ డ్రింక్స్ దుకాణాన్ని నిర్వహిస్తూంటాడు.శుక్రవారం రాత్రి ఆయన రోజులానే దుకాణం మూసుకోని ఇంటికి రాకపోవడంతో వారి కుటుంబసభ్యులు, స్నేహితులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే శనివారం ఉదయం మండలంలోని కండలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తాతిపల్లి గ్రామ సమీపంలో మృతదేహం వుందన్న సమాచారం అందుకున్న ఎస్‌ఐ డి.రామకృష్ణ సంఘటనా స్ధలానికి చేరుకోని సంఘటనా స్ధలాన్ని పరిశీలించారు. మృతదేహంపై కత్తి గాట్లు వుండటంతో పాటు, మెడ కోసి వేసి వుండటం చూసి ఎవరో హత్య చేసి ఇక్కడ పడవేసినట్లు పోలిసులు అభిప్రాయ పడుతున్నారు. అయితే మృతుడు రాపూరుకు చెందిన చిరు వ్యాపారి షేక్ షఫి అని గుర్తించిన పోలీసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్,రాపూరు సిఐ సత్యనారాయణలు సంఘటనా స్ధలానికి చేరుకోని పరిశీలనలు నిర్వహించారు. పోలీస్ క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు కేసు నమొదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విదంగా ఎటువంటి వివాదాలకు వెళ్లకుండా తన పని తాను చూసుకునే షఫిని హత్య చేసారు అని తెలుసుకున్న రాపూరు పట్టణ ప్రజలు భయాందోళనలకు గురైతున్నారు.

# వైద్యఆరోగ్య శాఖ మంత్రి, సత్యకుమార్‌కు నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ బెడద

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ వైద్యరోగ్య శాఖ మంత్రి, బీజేపీ నేత సత్య కుమార్‌ను నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ బెడద వేధిస్తోంది. సత్యకాలం పేరుతో ఎఫ్‌బీ అకౌంట్‌లో అసభ్య పోస్టింగ్‌లు ఉండటంతో మంత్రి కార్యాలయ సిబ్బంది అప్రమత్తమయ్యారు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు విచారించగా ప్రస్తుతం ఆ అకౌంట్ ఇన్ యాక్టివ్‌గా ఉన్నట్లు గుర్తించారు. మంత్రి సత్యకుమార్ పేరుతో కొంత మంది ఫేస్‌బుక్ అకౌంట్‌ను క్రియేట్ చేశారు. ఈ అకౌంట్‌లో గత కొంత కాలంగా బీజేపీకి సంబంధించిన, మంత్రి పాల్గొన్న కార్యక్రమాలకు సంబంధించిన పోస్టింగ్‌లు పెడుతూ వచ్చారు. అయితే ఇప్పుడు మాత్రం అసభ్యకరమైన ఓ ఫోటోను ఆ అకౌంట్‌లో పోస్ట్ చేశారు. దీన్ని గుర్తించిన మంత్రి కార్యాలయం వెంటనే అలెర్ట్ అయ్యింది. ఈ అకౌంట్‌పై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ అకౌంట్‌ను అప్పర్ తిరుపతి నుంచి రన్ చేస్తున్నట్లు అకౌంట్లో పేర్కొన్నారు. ఒక ఫోన్ నెంబర్‌ను కూడా అకౌంట్‌లో ఇవ్వడం జరిగింది. అకౌంట్ విషయంపై మంత్రి కార్యాలయానికి సమాచారం వెళ్లగా.. వెంటనే రీచెక్ చేసుకున్న సిబ్బంది.. అకౌంట్‌పై అప్పటికే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మంత్రులకు ఉన్న మంచి పేరును డీమోర్‌లైక్ చేయడానికి కొంత మంది ఇలా ఫేస్‌బుక్ అకౌంట్, సోషల్ మీడియా అకౌంట్లను నకిలీవి సృష్టించి వారికి చెడ్డ పేరు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని పోలీసులు తెలిపారు. అయితే ఈ నకిలీ అకౌంట్ ప్రస్తుతం ఇన్‌యాక్టివేట్‌లో ఉందని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ఇకపై ఎవరైనా ఇలా నకిలీ అకౌంట్ సృష్టించి సమాజంలో గౌరవ ప్రదమైన హోదాలో ఉన్న వారిని ఇబ్బందులు పెట్టకుండా పోలీసులు కూడా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి పేషీ అధికారులు కోరుతున్నారు.

# విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి విమానాశ్రయాల నుండి అంతర్జాతీయ కనెక్టివిటీని పెంచండి

## - ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి విమానాశ్రయాల నుండి అంతర్జాతీయ కనెక్టివిటీని పెంచాలని ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండిస్ట్రీ ఫెడరేషన్ (ఎపి ఛాంబర్స్) కోరింది. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడుకు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొట్లూరి భాస్కరరావు, బి రాజశేఖర్ శనివారం లేఖ రాశారు. ఎపిలోని మూడు విమానాశ్రయాల్లో అంతర్జాతీయ హోదా ఉందని, పెద్ద విమానాలు దిగగలిగే సదుపాయాలున్నా వాటికి నేరుగా కనెక్టివిటీ కల్పించలేదని పేర్కొన్నారు. ఎపిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడ ఆర్థిక కార్యకలాపాలు, వ్యాపారాలు, పర్యాటక రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం మొదలైన నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాలు పెరిగాయని పేర్కొన్నారు. దుబారు అన్ని గమ్యస్థానాలకు కేంద్రంగా మారిందని, ఈ నేపథ్యంలో విజయవాడ నుండి దుబారుకు నేరుగా విమాన సర్వీసు ఏర్పాటు చేయాలని కోరారు.



ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండిస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొట్లూరి భాస్కరరావు, బి రాజశేఖర్

# మంత్రివర్గ విస్తరణ ముఖ్యమంత్రి అడ్డుకొంటున్నారనడం అవివేకం

## నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** బిజెపి శాసనసభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని,ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి, మంత్రులకు మధ్య పూర్తిస్థాయిలో సమన్వయం ఉందని నాగం కర్నూల్ ఎంపి మల్లు రవి అన్నారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మంత్రి వర్గ విస్తరణను సిఎం అడ్డుకుంటున్నారని అనడం ఆయన అవివేకం అని అభిప్రాయపడ్డారు.అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అద్భుతమైన ప్రగతి తెలంగాణ సాధిస్తుండడం తో వాళ్లకు ఏమి మాట్లాడాలో తెలియక పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శంచారు. బిజెపి రాష్ట్రాల్లో ఎక్కడైనా మహిళకు ఉచిత బస్ సౌకర్యాలు ఉన్నాయా అని నిలదీశారు. బిజెపి పాలకులు సన్న బియ్యం ఇస్తున్నారా?, ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తున్నారా?. 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ ఇస్తున్నారా.? 500 రూపాయలకు గ్యాస్ ఇస్తున్నారా? ఇవేమీ ఇవ్వడానికి బీజేపీ నాయకులకు చేతకాదు అని ఆయన నిష్టూరాలు పలికారు.రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించి యువత కు ఉద్యోగాలు ఇప్పిస్తున్నాము ఇప్పటికే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పెడుతున్న, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్న కూడా బీజేపీ నాయకులకు అవన్నీ కనిపించడం లేదని ఆవేదన చెందారు. మంత్రి వర్గం విడిపోతే ఇవన్నీ ఇలా అభివృద్ధి,

సంక్షేమ పథకాలు ఎలా సాధ్యమో బీజేపీ నాయకులు చెప్పగలరా అని సవాల్ విసిరారు. బిజెపి పార్టీ లో తీవ్రమైన వర్గపోరు ఉంది. అందుకే చాలా కాలంగా బిజెపి అధ్యక్షుల ఎంపిక వాయిదా పడుతుంది అని భాష్యంచెప్పారు.రోజు మీడియాలో ఉండాలంటే కాంగ్రెస్ పైన, ప్రభుత్వంపైన ఏదో ఒక అబద్ధాల ప్రచారం చేయాలన్నది బిజెపి ఎత్తుగడ అని మల్లురవి అభిప్రాయం వ్యక్తం చేశారు..బీజేపీ నాయకులు గోబెల్స్ వారసులన్నారు. వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై, మంత్రివర్గంపై ఎన్ని అవాకులు,చెవాకులు మాట్లాడినా ప్రజలు నమ్మరని మల్లు రవి అన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అక్రమాలు ఎదుర్కోండి - వైకాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతోందని, వైకాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించంచారు.ఎన్డీఏ ఇప్పుడు ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటుందన్నారు.దాంతో స్ధానిక సంస్ధల ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతుందని,దొడ్డిద్రోవన గెలిచేందుకు అరాచకాలు చేస్తుందన్నారు. వాటన్నిటినీ ధీటుగా ఎదుర్కోవాలనితెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయం నుంచి ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో శనివారం మాట్లాడారు. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోవాలని, పేపర్స్ సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. స్థానిక పరిస్థితులపై సూచనలు, సలహాలపై రీజనల్ కోఆర్డినేటర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు.

18-05pg10exHMNWJQEBAKLORSPT.qxd:18-05pg10exHMNWJQEBAKLORSPT.qxd 01/01/01 6:52 AM Page 1



# ఇటాలియన్ టెన్నిస్ ఫైనల్‌కు సిన్నర్

**న్యూఢిల్లీ:** మూడు నెలల డోపింగ్ నిషేధం తర్వాత తిరిగి వచ్చిన జానిక్ సిన్నర్ తన మొదటి టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరుకున్నాడు. రోమ్‌లో జరిగిన సెమీఫైనల్లో అగ్రస్థానంలో ఉన్న సిన్నర్ 1-6, 6-0, 6-3 తేడాతో 12వ ర్యాంకర్ టామీ పాల్‌ను ఓడించాడు. 1976లో అడ్రియానో పనాట్టా తర్వాత రోమ్ ట్రోఫీని గెలిచిన తొలి ఇటాలియన్ వ్యక్తిగా నిలిచేందుకు సిన్నర్ ప్రయత్నిస్తున్నాడు.



అంతకుముందు, అల్కరాజ్ 6-3, 7-6(4) తేడాతో లోరెంజో ముసెట్టిని ఓడించి తన తొలి రోమ్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఈ నెల 18న జరిగే ఫైనల్ అక్టోబర్ తర్వాత సిన్నర్ మరియు అల్కరాజ్ మధ్య జరిగిన తొలి మ్యాచ్ అవుతుంది, అల్కరాజ్ చైనా ఓపెన్ ఫైనల్‌ను మూడో సెట్ టైబ్రేకర్‌లో గెలిచాడు. సిన్నర్‌తో తన కెరీర్ సమావేశాల్లో అల్కరాజ్ 6-4 ఆధిక్యంలో ఉన్నాడు. దీంతో తన అతి పెద్ద ప్రత్యర్థిపై వరుసగా మూడు విజయాలు సాధించాడు. కానీ బీజింగ్‌లో అల్కరాజ్ చేతిలో ఓటమి పాలైన తర్వాత సిన్నర్ ఒక్కసారి కూడా ఓడిపోకపోవడం విశేషం. సరికదా వరుసగా 26 మ్యాచ్‌ల విజయాలతో దూసుకుపోతున్నాడు. తొలుత క్వార్టర్ ఫైనల్స్‌లో కాస్పర్ రూడ్‌ను ఓడించి సిన్నర్ తన స్థాయిని దాదాపు పరిపూర్ణతకు చేరుకున్నాడు. పాల్‌తో జరిగిన మ్యాచ్‌లో, సిన్నర్ మొదటి సెట్‌లో అనవసర తప్పిదాలు చేయగా, అతని అమెరికన్ ప్రత్యర్థి లైన్స్‌లో షాట్‌ల తర్వాత షాట్‌లు కొట్టాడు. కానీ సిన్నర్ త్వరగా మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఇక జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తన మూడవ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత సిన్నర్ తన మొదటి టోర్నమెంట్‌ను ఆడుతున్నాడు.

# చెస్ ఛాంపియన్‌గా ప్రజ్ఞానంద్




## టైబ్రేకర్‌లో వాచియర్-లాగ్రేవ్ ఓటమి

**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్ సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ 2025 ఛాంపియన్‌గా గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద్ నిలిచాడు. అతను అద్భుతంగా ప్రదర్శన ఇచ్చి టైబ్రేకర్‌లో వాచియర్‌లాగ్రేవ్‌ను ఓడించాడు. భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద్ అలిరేజా ఫిరోజా మరియు మాక్సిమ్ వాచియర్‌లాగ్రేవ్‌లపై జరిగిన టైబ్రేక్ ప్లేఆఫ్ మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా సూపర్‌బెట్ చెస్ క్లాసిక్‌ను గెలుచుకున్నాడు. తొమ్మిది రౌండ్ల తర్వాత, ప్రజ్ఞానంద్, వాచియర్‌లాగ్రేవ్ మరియు ఫిరోజా మొత్తం 5.5 స్కోరును సాధించారు. ఫలితంగా, విజేతను టై బ్రేకర్‌లో నిర్ణయించారు. మొదటి రెండు మ్యాచ్‌లు టై బ్రేకర్‌లలో డ్రా అయిన తర్వాత, ప్రజ్ఞానంద మూడవ మ్యాచ్‌లో గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. చివరి రౌండ్ వరకు. పోటీలో ప్రజ్ఞానంద్ చాలా ముందున్నాడు. కానీ లెవాన్ అరోనియన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను డ్రా చేసుకోవడంతో ఫిరౌజా మరియు వాచియర్‌లాగ్రేవ్‌లు తమ చివరి మ్యాచ్‌లను గెలిచి సమం చేశారు. టైబ్రేక్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లు (ప్రజ్ఞానానంద్-ఫిరోజ్జా మరియు వాచియర్ లాగ్రేవ్-ఫిరోజ్జా) డ్రాగా ముగిశాయి. మూడో గేమ్ గెలిచింది. ప్రజ్ఞానంద అద్భుతంగా రాణించి వాచియర్‌లాగ్రేవ్‌ను ఓడించాడు. విజయం తర్వాత, ప్రజ్ఞానంద తన భావాలను వ్యక్తం చేస్తూ, "అద్భుతమైన అనుభవం, బుకారెస్ట్‌లో జరిగిన సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ టోర్నమెంట్‌ను ఇప్పుడే గెలుచుకుంది. నిరంతర ప్రోత్సాహానికి నా బృందం మరియు సహచరులకు ధన్యవాదాలు" అని అన్నాడు. కాగా భారత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్ నాలుగు పాయింట్లతో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. ఇప్పుడు తదుపరి గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్, సూపర్ యునైటెడ్ రాపిడ్ అండ్ బ్లిట్జ్, జూలై 1 నుండి క్రొయేషియాలో జరుగుతుంది.

ఆట

# వన్డేల్లో నో ఔట్

## ముగ్గురి రూటే సెపరేట్

### టీమిండియా సౌరభ్, ఫజల్, భరత్

**న్యూఢిల్లీ:** వన్డే ఫార్మాట్‌లో ఎన్నో అరుదైన రికార్డులు ఉన్నాయి. కొత్తగా కొన్ని నమోదవుతుంటే, ఇప్పటికే ఉన్న వాటిలో కొన్ని బ్రేక్ అవుతున్నాయి. క్రికెట్ చరిత్రలో పరుగులు, సెంచరీల వర్షం కురిపించిన బ్యాట్స్‌మెన్లు చాలా మందే ఉన్నారు. కానీ, వన్డే క్రికెట్‌లో ఏ బౌలర్ చేతిలోనూ అవుట్ కాని బ్యాట్స్‌మెన్లు ఉన్నారు. ప్రపంచంలో ఏ బౌలర్ కూడా వన్డే క్రికెట్‌లో వీరిని అవుట్ చేయలేకపోయారు. ఈ లిస్ట్‌లో కేవలం కొందరికే ఛాన్స్ దక్కింది. ఇందులో ముగ్గురు టీమిండియా ప్లేయర్లు ఈ అరుదైన రికార్డును సాధించారు. ఈ ముగ్గురు బ్యాట్స్‌మన్స్ వన్డేలో ఎప్పుడూ ఏ బౌలర్ చేతిలోనూ అవుట్ కాకపోవడం విశేషం. ఈ జాబితాలోని సౌరభ్ తివారీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టినప్పుడు, అతన్ని ధోని జిరాక్స్ అని పిలిచేవారు. సౌరభ్ పొడవాటి జుట్టు చూసి, ప్రజలు అతన్ని ధోనితో పోల్చేవారు. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించడం ద్వారా అతడు టీమ్ ఇండియాలో చోటు సంపాదించుకున్నాడు. సౌరభ్ 2010లో ఆస్ట్రేలియాపై వన్డే అరంగేట్రం చేశాడు. టీమ్ ఇండియా తరపున కేవలం మూడు వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. అందులో అతను రెండు ఇన్నింగ్స్‌లలో మాత్రమే బ్యాటింగ్ చేయగలిగాడు. ఈ రెండు ఇన్నింగ్స్‌లలోనూ సౌరభ్ తివారీ నాటౌట్‌గా నిలిచాడు. ఆ తరువాత అతన్ని జట్టు నుంచి తప్పించారు. అలాగే ఫైజ్ ఫజల్ దేశీయ క్రికెట్‌లో తన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. అందుకే అతనికి టీం ఇండియాలో కూడా అవకాశం లభించింది. కానీ, ఈ ఆటగాడు టీం ఇండియా తరపున ఒకే ఒక వన్డే మ్యాచ్ ఆడాడు. 2016లో జరిగిన ఈ వన్డే మ్యాచ్‌లో ఫైజ్ ఫజల్ జింబాబ్వేపై 55 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ అద్భుతమైన అర్ధ సెంచరీ తర్వాత కూడా అతన్ని జట్టు నుంచి తొలగించారు. ఇక నేటి యువతకు భరత్‌రెడ్డి పేరు తెలియకపోవచ్చు. కానీ, ఈ ఆటగాడికి కూడా భారతదేశం తరపున కేవలం మూడు వన్డేలు మాత్రమే ఆడే అదృష్టం కలిగింది. భరత్ రెడ్డి 1978 నుంచి 1981 వరకు భారతదేశం తరపున మూడు వన్డేలు ఆడాడు. అందులో అతనికి రెండుసార్లు బ్యాటింగ్ చేసే అవకాశం లభించింది. రెండు సార్లు అజేయంగా నిలిచాడు. ఆ తరువాత, భరత్ రెడ్డిని కూడా టీం ఇండియా నుంచి తొలగించారు. అతని కెరీర్ కూడా విషాదకరమైన ముగింపునకు చేరుకుంది.

# ఇంగ్లండ్ టెస్ట్‌కు భారత్ టీం




## కెప్టెన్‌గా ఈశ్వరన్.. శ్రేయాస్‌కు దక్కని ప్లేస్

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ టూర్‌కు భారత్ ఎ జట్టు సిద్ధమైంది. ఇండియా ఎ జట్టు ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనధికారిక టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌లు ఈ నెల 30 నుండి జూన్ 9వ వరకూ జరగనున్నాయి. ఈ పర్యటనకు గాను నిమించిన భారత్ జట్టుకు కెప్టెన్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను నియమిస్తూ సెలక్టర్లు నిర్ణయించారు. ఈ మేరకు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డ్ 18 మందితో కూడిన భారత్ జట్టును ప్రకటించింది. ఇంగ్లండ్ టూర్‌లో ఈశ్వరన్‌కు డిప్యూటీగా వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ వ్యవహరించనున్నాడు. ఇక ఇండియా ఎ జట్టుకు చాలాకాలం తర్వాత వెటరన్ క్రికెటర్ కరుణ్ నాయర్ ఎంపికయ్యాడు. కరుణ్ 8 ఏళ్ల తర్వాత ఇండియా సీనియర్ టెస్టు జట్టులోకి సైతం రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. కరుణ్‌తో పాటు, ఇషాన్ కిషన్‌కు కూడా భారత్ ఎ జట్టులో చోటు దక్కింది. అయితే ఆశ్చర్యకంగా శ్రేయాస్ అయ్యర్‌ను సెలక్టర్లు పక్కన పెట్టారు. దీంతో అయ్యర్ ఇంగ్లండ్‌తో టెస్టులకు ప్రధాన భారత్ జట్టులో ఉంటాడనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ జట్టులో భారత్ ఓపెనర్ యశస్వి జైస్వాల్, నితీష్ కుమార్, తనుష్ కోటియన్, ముఖేష్ కుమార్, ఆకాశ్ దీప్ కూడా ఉన్నారు. క్రికెట్ బోర్డు వారిని ప్రాక్టీస్ కోసం ముందుగా ఇంగ్లండ్‌కు పంపింది. అదే విధంగా ప్రస్తుత ఇండియన్ నప్రీమియర్ లీగ్ ప్లే ఆఫ్స్ తర్వాత శుభమన్ గిల్, సాయి సుదర్శన్‌లు ఇండియా ఎ జట్టుతో కలవనున్నారు. కాగా ఈ ఏడాది రంజీ ట్రోఫీ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్ హర్ష్ దుబే కూడా భారత్ ఎ జట్టులో భాగమయ్యాడు. ఈ విదర్భ స్పిన్నర్ 10 మ్యాచ్‌ల్లో 17 సగటుతో 69 వికెట్లు పడగొట్టాడు. మరో ఎడమ చేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. భారత్ ఎ జట్టులో అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), ధృవ్ జురెల్ (వైస్ కెప్టెన్) యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, ధృవ్ జురెల్, నితీష్ కుమార్, శార్దూల్ ఠాకూర్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), మానవ్ సుతార్, తనుష్ కోటియన్, ముఖేశ్ కుమార్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా, అన్షుల్ కాంబోజ్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, సర్ఫరాజ్ ఖాన్, తుషార్ దేశ్‌పాండే, హర్ష్ దూబే ఉన్నారు.




# ప్రో కబడ్డీ లీగ్ వేలం

## ముంబయిలో పాల్గొననున్న 12 ఫ్రాంచైజీలు

**న్యూఢిల్లీ:** ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌కు ముందు ఆటగాళ్ల వేలం ప్రక్రియకు సమయం దగ్గర పడుతోంది. ఈ నెల 31, జూన్ 1వ తేదీల్లో ఈ వేలాన్ని నిర్వహించేందుకు నిర్వహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముంబైలో నిర్వహించే ఈ వేలానికి సంబంధించి 12 ఫ్రాంచైజీలు పాల్గొంటున్నాయి. ఈ వేలానికి ముందే ప్రో కబడ్డీ లీగ్ ఎలైట్ రిటైన్డ్ ప్లేయర్లు, రిటైన్డ్ యంగ్ ప్లేయర్ల, న్యూ యంగ్ ప్లేయర్ల జాబితాను ప్రకటించింది. ఫ్రాంచైజీలు ఇప్పటికే 83 మంది ఆటగాళ్లను నిలుపుకొన్నాయి. ఇందులో ఎలైట్ రిటైండ్ ప్లేయర్స్ విభాగంలో 25 మంది, రిటైన్డ్ యంగ్ ప్లేయర్ల విభాగంలో 23 మంది, న్యూ యంగ్ ప్లేయర్స్ విభాగంలో 35 మంది ఉన్నట్లు ప్రకటించింది. మొత్తం ప్లేయర్లను 4 వర్గాలుగా విభజించారు. ఎ కేటగిరి ప్లేయర్లకు రూ.30 లక్షలు, బి లో ఉన్న వారికి రూ.20 లక్షలు, సి లోని వారికి 13 లక్షలు, డి కేటగిరిలో ఉన్న ప్లేయర్ల కనీస వేలం ధర 9 లక్షల రూపాయలుగా వర్గీకరించారు. ప్లేయర్ల కొనుగోలు నిమిత్తం ఒక్కో ఫ్రాంచైజీ 5 కోట్ల రూపాయల మేర పర్స్ కలిగి ఉంటుంది. బెంగాల్ వారియర్జ్, బెంగుళూరు బుల్స్, దబాంగ్ ఢిల్లీ కెసి, గుజరాత్ జెయింట్స్, హర్యానా స్టీలర్స్, జైపూర్ పింక్ పాంథర్స్, పాట్నా పైరేట్స్, పుణేరి పల్టన్, తమిళ తైలవులు, తెలుగు టైటాన్స్, యు ముంబా, యుపి యోధా ఫ్రాంచైజీలు ఈ వేలంలో పాల్గొంటున్నాయి. కాగా 2014 నుండి ఇప్పటి వరకూ జరిగిన 11 సీజన్లలో 8 వేర్వేరు జట్లు టైటిల్స్ గెలుపొందాయి. ఈ నేపథ్యంలో ప్రతీ జట్టూ టైటిల్ కోసం పోరాడుతునే ఉంది.

# ఆర్‌బిఐ వద్ద 879.59 టన్నుల బంగారం

**న్యూఢిల్లీ, మే 17:** భారతదేశంలో పెట్టుబడి పరంగా బంగారానికి చాలా ప్రాముఖ్యత ఉంది. బంగారం వందల సంవత్సరాలుగా దాని విలువ, ప్రాముఖ్యతను నిలుపుకుంది. దీనిని ఆభరణాలుగా మాత్రమే కాకుండా పారిశ్రామిక అవసరాలకు కూడా ఉపయోగిస్తారు. భారతదేశంలోని చాలా మంది ఆర్థిక సలహాదారులు ప్రజలు తమ ఆస్తులలో కొంత బంగారం రూపంలో ఉంచుకోవాలని సలహా ఇస్తుంటారు. భారతదేశ కేంద్ర బ్యాంకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవలి సంవత్సరాలలో బంగారం కొనుగోళ్లను పెంచింది. 2021 నుండి ఇప్పటి వరకు, ఆర్‌బిఐ తన ఫారెక్స్ నిల్వలలో బంగారం వాటాను 25 పెంచింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు కూడా బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. గత 3 సంవత్సరాలలో కేంద్ర బ్యాంకులు తమ నిల్వలకు 1,000 టన్నులకు పైగా బంగారాన్ని జోడించాయి. 2024లోనే ఆర్బీఐ 57.5 టన్నుల బంగారాన్ని కొనుగోలుచేసింది. మార్చి 2025 నాటికి ఆర్‌బిఐ వద్ద మొత్తం 879.59టన్నుల బంగారం ఉంది. అందులో 511.99 టన్నులు భారత దేశంలో, మిగిలినవి ఇంగ్లాండ్, ఇతర ప్రదేశాలలో భద్రంగా ఉంది. ఆర్బీఐ డేటా ప్రకారం.. భారతదేశ విదేశీ మారక నిల్వలలో (డాలర్లలో) బంగారం వాటా మార్చి 2021లో 5.87గా ఉంది. ఇది మార్చి 2025లో 11.7కి పెరిగింది. కేవలం నాలుగు సంవత్సరాలలో బంగారు ఆస్తులలో



ఆర్బీఐ పెట్టుబడి రెట్టింపు అయింది. మే 9 నాటికి ఆర్బీఐ విదేశీ మారక నిల్వలు 690 బిలియన్లు, అందులో బంగారం విలువ 86 బిలియన్లు. దీని అర్థం భారతదేశ విదేశీ మారక నిల్వలలో దాదాపు 12.46 బంగారంలో ఉన్నాయి.

# యుఎస్‌కు భారత్ జీరో టారిఫ్ ఆఫర్: ట్రంప్

**న్యూఢిల్లీ, మే 17:** జీరో టారిఫ్‌ల విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రస్తావించారు. అమెరికా నుంచి దిగుమతి చేసు కొనే చాలారకాల వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లను ఆఫర్ చేసిందని మరోసారి పునరుద్ఘాటిం చారు. భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న సమయంలో ట్రంప్ నుంచి పదేపదే ఈ వ్యాఖ్యలు రావడం ప్రాధాన్యం సంతరించు కుంటున్నాయి. భారత్‌ను లక్ష్యంగా చేసుకొని మాట్లాడారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి అని మరోమారు వ్యాఖ్యానించారు. తమ దేశం నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాల్ని 100 శాతం తగ్గించడానికి భారత్ అంగీకరించిందన్నా రు. ఇక భారత్‌తో వాణిజ్య ఒప్పందం గురించి తొందరలేదని.. తమతో ఒప్పందం కుదుర్చుకొనేందుకు అందరూ ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ట్రంప్ వ్యాఖ్యలపై జైశంకర్ స్పందిం చారు. రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అవి సంక్లిష్ట చర్చలు. ప్రతి అంశంపై నిర్ణయం తీసుకునేవరకు అవి కొనసాగుతూనే ఉంటాయి.



వాణిజ్య ఒప్పందం పరస్పరం ప్రయోజనకరంగా ఉండాలి. అది జరిగే వరకు దాని గురించి ప్రకటన చేయడం తొందర పాటే అవుతుం ది అని ట్రంప్ ప్రస్తావన లేకుండా మంత్రి మాట్లాడిన విషయం తెలిసిందే.


# వాణిజ్యం

# తగ్గనున్న రెపో రేట్లు..!

**న్యూఢిల్లీ, మే 17:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి రెపో రేటులో పెద్ద కోతను పరిశీలిస్తోంది. ఈ సంవత్సరం జూన్ నుండి దీపావళి వరకు రిజర్వ్ బ్యాంక్ మూడు ద్రవ్య విధాన కమిటీ సమావేశాలు జరగనున్నాయి, ఈ తరుణంలో రెపో రేటును తగ్గించవచ్చు. ఈ కోత 0.50 నుండి 0.75 శాతం వరకు ఉండవచ్చని నివేదికలలో పేర్కొన్నాయి. రెపో రేటులో ఇంత తగ్గింపు ఉంటే సామాన్యులకు పెద్ద రిలీఫ్ లభిస్తుంది. మీడియా నివేదికల ప్రకారం ఆర్‌బిఐ ద్రవ్యవిధాన కమిటీ వచ్చే సమావేశం జూన్ 46 వరకు జరగనుంది, ఈ సమావేశంలో సామాన్యులకు ఉపశమనం కలిగించడానికి పెద్ద నిర్ణయాలు తీసుకోవచ్చు అలాగే రెపో రేటును దాదాపు 0.25 తగ్గించవచ్చు. దీని తరువాత ఆగస్టు 5 నుండి 7 వరకు లేదా సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 1 వరకు జరిగే సమావేశంలో 0.25 శాతం నుండి 0.50 శాతం వరకు కోత ఉంటుందని భావిస్తున్నారు. సమాచారం ప్రకారం ఫిబ్రవరి నుండి ఆర్‌బిఐ రెపో రేటును తగ్గించడం ప్రారంభించింది. అప్పటి నుండి రెండు సమావేశాలలో 0.50 కోత వచ్చింది. ఈకారణంగా రెపో రేటు 6కి తగ్గింది. ఈసారి దీపావళికి ముందు సామాన్యులకు పెద్ద ఉపశమనం లభిస్తుందని, ఆర్‌బిఐ రెపో రేటు 0.75 వరకు తగ్గించవచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం రెపో రేటు 6 వద్ద ఉంది. దీపావళి నాటికి ఇది 5.25కి తగ్గవచ్చు. సింపుల్‌గా అర్థం చేసుకోవాలంటే రెపోరేటు అంటే ఆర్‌బిఐబ్యాంకులకు రుణాలిచ్చే వడ్డీరేటు, తరువాత బ్యాంకులు కొంత వడ్డీని కలపడం ద్వారా కస్టమర్లకు లైన్స్ ఇస్తాయి. ఇలాంటి పరిస్థితిలో రెపో రేటు తగ్గితే మీ లోన్ కూడా తగ్గుతుంది ఇంకా మీ హోమ్‌లోన్ అండ్ కారు లోన్ చౌకగా మారుతుంది. ఆర్‌బిఐ సెక్యూరిటీస్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ సన్నీ అగర్వాల్ ప్రకారం, అన్ని అంశాలు రేటు తగ్గింపు వైపు చూపిస్తున్నాయి. ఇంకా పరిస్థితులు కూడా సాధారణంగానే ఉంటాయని భావిస్తున్నారు.

# అంబానీ, అదానీలకు కలిసొచ్చిన కాల్పుల విరమణ

**ముంబై, మే 17:** భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ తర్వాత, ఆసియాలోని ఇద్దరు ధనవంతులైన వ్యాపారవేత్తలు ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీల అదృష్టం మారిపోయినట్లు కనిపిస్తోంది. ప్రత్యేకత ఏమిటంటే ముఖేష్ అంబానీ రూ.100 బిలియన్లు లేదా అంతకంటే ఎక్కువ సంపద కలిగిన బిలియనీర్ల గుంపులో చేరారు. మరోవైపు ప్రపంచంలోని టాప్ 20 ధనవంతుల జాబితాలో గౌతమ్ అదానీ చోటు దక్కించుకున్నారు. బ్లూమ్‌బెర్గ్ డేటాను పరిశీలిస్తే, ఆసియాలోని అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ నికర విలువ 5 రోజుల్లో 6 బిలియన్ డాలర్లు పెరిగింది. ఆసియాలో రెండవ అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్త గౌతమ్ అదానీ నికర విలువ 9.2 బిలియన్లు పెరిగింది. ఇప్పుడు ఇద్దరు బిలియనీర్ల నికర విలువ ఎంత ఉందో తెలుసుకుందాం. నివేదిక ప్రకారం, ముఖేష్ అంబానీ మొత్తం నికర విలువ మే 9న 99 బిలియన్లు కాగా, మే 16న అది 105 బిలియన్లకు పెరిగింది. అంటే 5 పని దినాలలో ముఖేష్ అంబానీ నికర విలువ 6 బిలియన్లకు పైగా అంటే రూ.51 వేల కోట్లకు పైగా పెరిగింది. ముఖేష్ అంబానీ 100 బిలియన్ డాలర్ల నికర విలువ కలిగిన ఎలైట్ గ్రూపులో చేరారు. కాల్పుల విరమణ తర్వాత, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో మంచి పెరుగుదల కనిపించింది. ఆ తర్వాత అతని నికర విలువలో పెరుగుదల ఉంది. మరోవైపు గౌతమ్ అదానీ నికర విలువ కూడా బాగా పెరిగింది. ప్రత్యేకత ఏమిటంటే, ఐదు పని దినాలలో అదానీ నికర విలువ అంబానీ కంటే ఎక్కువ పెరిగింది. నివేదిక ప్రకారం, గౌతమ్‌అదానీ నికర విలువ మే 9న 74.4బిలియన్లు కాగా, మే 16న అది



83.6 బిలియన్లకు పెరిగింది. అంటే గౌతమ్ అదానీనికరవిలువ 9.2 బిలియన్లు అంటే దాదాపు రూ.79 వేల కోట్లు పెరిగింది. అతను ప్రపంచంలోని టాప్20 బిలియనీర్ల జాబితాలోచేరాడు.అతను ఇదేవేగంతో కదులుతూ ఉంటే, అతను 100బిలియన్లకు దగ్గరగా చేరుకోవచ్చు.

# రాబడుల్లో పెద్ద కంపెనీలతో పతంజలి పోటీ!

**ముంబై, మే 17:** భారతీయ ఎఫ్‌ఎంసిజి కంపెనీ పతంజలి ఫుడ్స్ ఆదాయం, లాభం నిరంతరం పెరుగుతోంది. బాబా రామ్‌దేవ్ కంపెనీ ప్రపంచంలోని పెద్ద నీలీదిబి కంపెనీలతో పోటీ పడటానికి ఇదే కారణం. నాల్గవ త్రైమాసిక గణాంకాలను పరిశీలిస్తే, కంపెనీ లాభంలో 74 శాతం పెరుగుదల కనిపించింది. కాగా కంపెనీ ఆదాయం కూడా పెరిగింది. ప్రత్యేకత ఏమిటంటే కంపెనీ నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన గణాంకాలను మాత్రమే విడుదల చేయలేదు. మొత్తం ఆర్థిక సంవత్సరం డేటాను కూడా విడుదల చేసింది. దీనిలో పెరుగుదల కనిపించింది. అంతకుముందు కంపెనీ షేర్లు దాదాపు ఒకటిన్నర శాతం పెరిగాయి. పతంజలి ఫుడ్స్ నుండి త్రైమాసిక ఫలితాల్లో ఎలాంటి గణాంకాలు వచ్చాయో తెలుసుకుందాం. నాల్గవ త్రైమాసికంలో లాభం, ఆదాయంలో పెరుగుదల: గత ఆర్థిక సంవత్సరం జనవరి మార్చి త్రైమాసికంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ నికర లాభం స్వతంత్ర ప్రాతిపదికన 74 శాతం పెరిగి రూ.358.53 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం 2023-24 ఇదే త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.206.31 కోట్లుగా ఉంది. మరోవైపు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు ఒక ప్రకటనలో తన మొత్తం ఆదాయం 2023 24 ఇదే త్రైమాసికంలో రూ.8,348.02 కోట్ల నుండి రూ.9,744.73 కోట్లకు చేరుకుందని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ లాభం అపారమైన పెరుగుదల ఉంది. గణాంకాలను పరిశీలిస్తే, కంపెనీ నికర లాభం రూ.1,301.34 కోట్లకు పెరిగింది. ఇది 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.765.15 కోట్లు. ఇక కంపెనీ మొత్తం



ఆదాయం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.34,289.40 కోట్లకు పెరిగింది. ఇది 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.31,961.62 కోట్లు. గురువారం స్టాక్ మార్కెట్లో పతంజలి షేర్లలో పెరుగుదల కనిపించింది. కంపెనీ స్టాక్ 1.41 శాతం లాభంతో రూ.1811.35 వద్ద ముగిసింది. అంటే ఒక్కో షేరుకు రూ.25.20. కంపెనీ షేరు రోజు గరిష్ట స్థాయి రూ.1824 కి చేరుకుంది. అయితే కంపెనీ షేరు రూ.1795.95 వద్ద ప్రారంభమైంది.

# అజియో, మింత్రాలో తుర్కియే బ్రాండ్ బంద్

**ఇస్లామాబాద్, మే 17:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించిన తుర్కియే దేశంపై భారత్‌లోని అన్ని వర్గాలు మండిపడుతున్నా యి. ఆ దేశానికి చెందిన ఉత్పత్తులను బహిష్కరించా లని 'బాయ్‌కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రముఖ ఆన్‌లైన్ రిటైల్ సంస్థలు మింత్రా, అజియో టర్కీ బ్రాండ్ల అమ్మకాలను నిలిపివేశాయి. ఆయా ప్లాట్‌ఫామ్‌లలో టర్కీకి చెందిన దుస్తులను చూపించడం ఆపేశాయి. బాయ్‌కాట్ తుర్కియే నినాదం జోరందుకున్న క్రమంలో వ్యాపారులు ఆ దేశంతో వర్తక, వ్యాపారాలను నిలిపేస్తున్నారు. టర్కీకి చెందిన అన్ని బ్రాండ్‌ల అమ్మకాలను మింత్రా తాత్కాలికం గా నిలిపివేసింది. గతవారం నుంచి ఉద్రిక్తతలు పెరుగు తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబం ధిత అధికారి వెల్లడించారు. రిలయన్స్ కూడా తన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ అజియోలో విక్రయిస్తున్న కోటాన్, ఎల్‌సీ వైకికి, మావి వంటి టర్కిష్ దుస్తుల బ్రాండ్ల అమ్మకాల్ని ఆపేసింది. ఆ దేశంలో సంస్థ కార్యాలయాన్ని కూడా మూసివేసినట్లు రిలయన్స్‌కు చెందిన ఓఅధికారి పేర్కొ న్నారు. తుర్కియేతో తెంచేసుకుందాం. పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన తుర్కియే, అజర్‌బైజాన్ దేశాలతో పర్యాటకం సహా అన్ని రకాల వ్యాపార సంబంధాలు తెంచుకోవాలని దేశీయ వర్గాలు ఇప్పటికే నిర్ణయించాయి. అఖిలభారత వ్యాపారుల సమాఖ్య (కెయిట్) సైతం ఆరెండు దేశాలతో వాణిజ్యసంబంధాలను తెంచుకోవాలని నిర్ణయించింది. భారత ఎగుమతిదార్లు, దిగుమతి




దార్లు, వ్యాపార వర్గాలు సైతం ఆరెండు దేశాల్లోని కంపెనీలతో ఎటు వంటి సంబంధాలూ పెట్టుకోరని తెలిపింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14